అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 03-09-2024 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 196 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు వెల : 6.50

వరద సహాయ కార్యక్రమాల్లో పాల్గొనండి

పార్టీ శ్రేణులకు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ పిలుపు

మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలని తమ్మినేని డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురిసిన అత్యంత భారీ వర్షాల వల్ల కొన్ని జిల్లాల్లో వరదలు సంభవించాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తెలిపింది. ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగిందని వివరించింది. దాదాపు 18 మంది మరణించారని పేర్కొంది. ఈ విపత్తులో వరద బాధితులను ఆదుకోవడానికి పార్టీ శ్రేణులు తక్షణమే కదిలి సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం ఒక ప్రకటన ...11లో

జాతీయ విపత్తుగా ప్రకటించండి

మీరే స్వయంగా వచ్చి పరిశీలించండి



భారీ వర్షాలు, వరదలపై ప్రధాని మోడీకి సీఎం రేవంత్ విజ్ఞప్తి

- మరణించిన వారి కుటుంబాలకు ఇచ్చే పరిహారం రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంపు
- చనిపోయిన పాడి పశువులకు రూ.50 వేలు, మేకలు, గొర్రెలకు రూ.5 వేల పరిహారం
- తక్షణ సాయం కోసం ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట, భద్రాద్రి, కొత్తగూడెం కలెక్టర్లకు రూ.5 కోట్లు విడుదల
- ఎన్‌డీఆర్‌ఎఫ్ తరహాలో పోలీసు సిబ్బందికి శిక్షణ
- టీజీడీఆర్‌ఎఫ్‌ను ఏర్పాటు చేస్తాం : సమీక్షలో సీఎం నిర్ణయాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో సంభవించిన భారీ వర్షాల వల్ల పెద్ద సంఖ్యలో ప్రాణ నష్టం, లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిన నేపథ్యంలో ఈ విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... ప్రధాని నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. నష్టాన్ని పరిశీలించేందుకు స్వయంగా రాష్ట్రానికి విచ్చేయాలంటూ ఆయన్ను కోరారు. ఈ మేరకు ప్రధానికి లేఖ రాయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీఎం రేవంత్ సోమవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అతి తక్కువ సమయంలో ఇంత భారీ స్థాయిలో వర్షాలు కురవడానికిగల కారణాలు, రాగల రెండు మూడు రోజుల వాతావరణ పరిస్థితుల గురించి ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఊహించిన దానికంటే ఎక్కువగా ఈ యేడాది వర్షాలు పడ్డాయని వాతావరణ శాఖాధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపారు. గతంలో ఏ అయిదేండ్లకో, పదేండ్లకో ఇలాంటి కుంభవృష్టి కురిసేదని వారు తెలిపారు. ఇటీవల తరచూ భారీ నుంచి అతి భారీ ...11లో

ప్రతిపక్షాలు బురద రాజకీయాలు మానుకోవాలి

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- వర్షాల నష్టాలపై సమీక్ష

ఎకరాకు రూ.10వేల పరిహారం

వివరాలు 11లో

వ్యవసాయరంగంలో ఏడు పథకాలకు ఓకే

రూ.14,235.30 కోట్లు ఖర్చు



- ముంబాయి-ఇండోర్ మధ్య రూ.18,036 కోట్లతో 309 కిలోమీటర్ల రహదారి
- గుజరాత్‌లోని సనంద్‌లో సెమీ కండక్టర్ పరిశ్రమ : కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలు

నవతెలంగాణ- న్యూఢిల్లీ బ్యూరో

వ్యవసాయ రంగానికి సంబంధించిన ఏడు కీలమైన పథకాలను కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకాలకు కేంద్ర ప్రభుత్వం రూ.14,235.30 కోట్లు ఖర్చు చేయనుంది. సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర ...11లో





అండగా ఉంటాం

తక్షణ సాయం రూ.10 వేలు

- వందలాది కుటుంబాలు సర్వం కోల్పోయారు
- ఖమ్మం జిల్లాలో మున్నేరు వరద విషాదాన్ని నింపింది
- త్వరలో రిటైనింగ్ పూర్తి చేసేందుకు చర్యలు
- బాధితులు ధైర్యంగా ఉండాలి : సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి

నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందజేస్తాం



వరద ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని ఇప్పటికే కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశాం. అతి త్వరలోనే అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తారని ఆ నివేదిక ఆధారంగా తగిన నష్టపరిహారం అందజేస్తామన్నారు. రెవెన్యూ సిబ్బంది వరదతో నష్టపోయిన ప్రతి ఇంటికి వెళ్తారని అక్కడ జరిగిన నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తారని తెలిపారు. ఖమ్మం జిల్లాలో వరదతో నష్టపోయిన ప్రతి పంట చేనును వ్యవసాయ అధికారులు,రెవెన్యూ సిబ్బంది కలిసి సర్వే చేసి పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి అందజేస్తారని దీంతో పంట నష్టం రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు.

మున్నేరు రిటైనింగ్ వాల్ కోసం రూ.650కోట్లు

మున్నేరు రిటైనింగ్ వాల్ కోసం రూ.650 కోట్లు కేటాయించినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. త్వరలో పనులు యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలు పెట్టి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మళ్ళీ వర్షాకాలం వచ్చే నాటికి మున్నేరు పరివాహక ప్రాంత ప్రజలకు ఈ వరద కష్టాలు దూరం చేయడమే తన లక్ష్యమన్నారు. మరోసారి మున్నేరుతో ఖమ్మం నగర వాసులకు కష్టాలు రాకుండా ఉండేందుకు స్థానిక ఎమ్మెల్యే,రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో రిటైనింగ్ వాల్ పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఇప్పటికే అధికారులు జారీ చేశామన్నారు. విపత్తులను ముందే పసిగట్టిన ఇందిరమ్మ ప్రభుత్వం పోలేపల్లికి చుక్క నీరు రాకుండా రిటైనింగ్ వాల్ కట్టినప్పుడే మీకు న్యాయం జరుగుతుందన్నారు.

వరద ప్రాంతాల్లో మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటన

నవతెలంగాణ-ఖమ్మంరూరల్/ఖమ్మం

"మున్నేరు వరద మీ కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది...టీవీల్లో ప్రసారమైన దృశ్యాలు హైదరాబాద్‌లో చూసి నేను ఎంతో చలించిపోయాను..... వెంటనే హుటాహుటీగా మీలో ఒకడిగా వచ్చి ఓదార్పు నిచ్చి మీకు ధైర్యం చెప్పేందుకు వచ్చాను. మీకు పెద్దన్నగా కొండంత అండగా ఉంటాను" అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో మున్నేరు వరదతో ఖమ్మంరూరల్ మండలంలోని పలు గ్రామాలు అతలాకుతలమయ్యాయి. సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర నీటిపారుదలశాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి వరద ప్రాంతాల్లో పర్యటించారు. హైదరాబాద్ నుండి రోడ్డు మార్గంలో సూర్యాపేటకు సుమారు సాయంత్రం 4 గంటలకు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అక్కడి నుండి నాయకన్‌గూడెం మీదుగా పాలేరుకు చేరుకున్నారు. పాలేరు ఎడమ కాల్వకు గండి పడటంతో జలమయమైన ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం అక్కడి నుండి తల్లంపాడు మీదుగా ఖమ్మంరూరల్ మండలంలోని మున్నేరు పరివాహక ప్రాంతాల వద్ద కాన్వాయ్ దిగి నేరుగా వరద బాధితుల ఇండ్లకు వెళ్ళారు..అమ్మా మీకు జరగరాని నష్టం జరిగిన మాట వాస్తవమే కానీ.... ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజాపాలన ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది, ఎటువంటి పరిస్థితుల్లోనూ ధైర్యం కోల్పోవద్దు.. మీకు తక్షణ సహాయం కింద వెంటనే రూ.10 వేలు అందజేసేలా అధికారులను ఆదేశిస్తున్నానని వారికి భరోసానిచ్చారు.

వందలాది కుటుంబాలు సర్వం కోల్పోయారు..

కనివినీ రీతిలో ఇంత పెద్ద ఎత్తున భారీ విపత్తు జరుగుతుందని తాను కలలో కూడా ఊహించలేదని, ఖమ్మం మున్నేరు పరివాహక ప్రాంతాల్లో భారీ వరదతో వందలాది కుటుంబాలు సర్వం కోల్పోయాయన్నారు. గతం ఏడాది 30 అడుగుల ఎత్తులో మున్నేరుకు వరద నీరు వచ్చిందని, అప్పుడు ఇంత నష్టం జరగలేదన్నారు. మీకు జరిగిన నష్టం పూడ్చలేనిదయినప్పటికీ ప్రభుత్వం మీకు అండగా ఉంటుందన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హయాంలో కరుణగిరి ప్రాంతంలో రాజీవ్‌గృహ కల్ప పథకం కింద 31 బ్లాకులను నాలుగు అంతస్తుల్లో ఇండ్లు కట్టించి అర్హులైన నిరుపేదలకు అందజేశారన్నారు. ఇప్పుడు జరిగిన నష్టానికి వందలాది కుటుంబాలు సర్వం కోల్పోయారని, వారికి ఇందిరమ్మ రాజ్యంలో తక్షణం సహాయం అందించేందుకు జిల్లా కలెక్టర్ అకౌంట్లో రూ.5 కోట్లు జమ చేశామన్నారు. వరద బాధితులకు తక్షణ సాయం కింద నిత్యావసర సరుకులు రూ.10 వేలు అందజేయాలని కలెక్టర్‌కు ...2లో

మరో రెండు రోజులు వర్షాలు

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ | వెల్లడించిన వాతావరణ శాఖ 2లో..

నిందితుడైతే ఇల్లు కూల్చేస్తారా?

బుల్డోజర్ న్యాయంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

దేశవ్యాప్తంగా మార్గదర్శకాలుండాలని సూచన

తదుపరి విచారణ 17కు వాయిదా



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో నడుస్తున్న బుల్డోజర్ చర్యలపై భారత సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక క్రిమినల్ కేసుతో సంబంధమున్న నిందితుడు లేదా అందులో దోషి అయినంత మాత్రాన వారికి (నిందితుడు లేదా దోషి) చెందిన ఎలా కూల్చుతారు? అని ప్రశ్నించింది. ఇండ్లను కూల్చేముందు పాటించేలా దేశవ్యాప్తంగా కొన్ని మార్గదర్శకాలను రూపొందించాలని న్యాయస్థానం ఆదేశించింది. దేశవ్యాప్తంగా 'బుల్డోజర్ న్యాయం' జరకుండా ఉండేలా కోర్టు ఆదేశాలను కోరుతూ పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది దుశ్యంత్ దవే వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్ గవాయ్, కె.వి విశ్వనాథన్ లతో కూడిన ధర్మాసనం దీనిపై విచారణ జరిపింది. ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా తుషార్ మెహతా వాదించారు. క్రిమినల్ కేసుల్లో నిందితుడైనంత మాత్రానా సదరు వ్యక్తికి చెందిన స్థిర ఆస్తులను ధ్వంసం చేయటం లేదనీ, కేవలం అక్రమ నిర్మాణం అయితేనే ...11లో

విచారించే కోర్టు మారినా.. విషయం మారదు

ఓటుకు నోటు కేసులో సుప్రీం వ్యాఖ్యలు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

విచారించే కోర్టు మారినా... పరిధి మారదు, విషయం మారదని 'ఓటుకు నోటు' కేసులో అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ఈ కేసు విచారణను మరో రెండు వారాలు వాయిదా వేసినట్టు వెల్లడించింది. ఓటుకు నోటు కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని ఈ ఏడాది జనవరి 31న బీఆర్ఎస్ నేతలు, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మహ్మద్ అలీ, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ...11లో

కూల్చివేతలకు ముందు ఆధారాలు చూడండి

ఖానాపూర్‌లో ఇండ్ల నిర్మాణాల కూల్చివేతను నిలిపేసిన హైకోర్టు



నవతెలంగాణ - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం ఖానాపూర్‌కు చెందిన ఇండ్ల నిర్మాణాల కూల్చివేత నోటీసుల అమలును నిలిపేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాధర్‌రెడ్డి మరొకరు దాఖలు చేసిన కేసులో జస్టిస్ వినోద్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉస్మాన్ సాగర్ పరిధి ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు ఉన్నాయంటూ అధికారులు తమ వాదనలు పట్టించుకోకుండా నేరుగా కూల్చివేత నోటీసులు ఇచ్చారని పిటిషనర్ న్యాయవాది ...12లో

నెతన్యాహూ గద్దె దిగు

ఇజ్రాయిల్‌వ్యాప్తంగా ర్యాలీలు, ప్రదర్శనలు

5లక్షలమంది వీధుల్లోకి..

సమ్మెతో స్తంభించిన కార్యకలాపాలు



టెల్ అవీవ్ : గాజాలో హమాస్ చెరలో బందీలుగా వున్న వారిని విడిపించడంలో విఫలమవడాన్ని నిరసిస్తూ సోమవారం ఇజ్రాయిల్ వ్యాప్తంగా సమ్మె జరిగింది. ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయంతో సహా అన్ని వ్యాపార వాణిజ్య సంస్థల, విద్యా సంస్థలు మూతపడ్డాయి. కాల్పుల విరమణ ఒప్పందం తక్షణమే కుదుర్చుకోవాలని డిమాండ్ చేస్తూ పలు పట్టణాలు, నగరాల్లో ర్యాలీలు, ప్రదర్శనలు జరిగాయి. దాదాపు ఐదు లక్షల మంది ప్రజలు ఈ నిరసనల్లో పాల్గొన్నారు. గాజాలో ఆరుగురు బందీలు చనిపోయి వుండగా కనుగొన్న నేపథ్యంలో బందీల కుటుంబాల్లో, ప్రజల్లో తీవ్ర నిరసనలు, అసంతృప్తులు పెల్లుబికాయి. ఆదివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత వేలాదిమంది ఇజ్రాయిలీలు వీధుల్లోకి వచ్చి ప్రభుత్వం పట్ల తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వం తక్షణమే గద్దె ...11లో

దర్యాప్తును ఆమే పర్యవేక్షించారు

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అదానీ గ్రూపు సంస్థలపై సెబీ జరిపిన విచారణను దర్యాప్తు సంస్థ అధిపతి మాధబి పురి బచ్ స్వయంగా పర్యవేక్షించారని, ఆమె విచారణ ప్రక్రియ నుండి వైదొలగలేదని సెబీ బోర్డు సభ్యుడొకరు వెల్లడించారు. దీంతో గత కొంతకాలంగా ఈ విషయంలో నెలకొన్న సస్పెన్స్‌కు తెర పడింది. ప్రభుత్వం, సెబీ మాత్రం ఇప్పటికీ నోరు మెదపడం లేదు. మరోవైపు మాధబి బచ్ ముంబయిలో వ్యాపారవేత్తల సమావేశంలో ప్రసంగిస్తూ వ్యవస్థపై నమ్మకం ఉండాలంటూ సుద్దులు చెప్పారు.

బయటపెట్టిన సెబీ బోర్డు సభ్యుడు | సుప్రీంకోర్టు తదుపరి చర్యపై ఉత్కంఠ



న్యూఢిల్లీ : అదానీ గ్రూపుపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి సెబీ జరిపిన దర్యాప్తు నుంచి దాని అధిపతి మాధబి పురి బచ్ వైదొలిగారా లేదా అనే విషయంపై గత రెండు వారాలుగా నరేంద్ర మోడీ ప్రభుత్వం మౌనాన్నే ఆశ్రయిస్తోంది. షేర్ మార్కెట్‌లో తన వాటాల విలువను పెంచుకునేందుకు అదానీ గ్రూప్ ఆఫ్‌షోర్ సంస్థలను ఉపయోగించుకున్నారంటూ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సెబీ దర్యాప్తు జరిపింది. అదానీ గ్రూపు సంస్థల్లో మాధబి బచ్, ఆమె భర్త పెట్టుబడులు పెట్టిన నేపథ్యంలో నిష్పాక్షిక దర్యాప్తు జరిగేందుకు వీలుగా ఆ ప్రక్రియ నుండి ఆమె వైదొలగుతారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై కేంద్రం ఇప్పటి వరకూ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.అదానీ గ్రూపునకు చెందిన ఓ ఆఫ్‌షోర్ సంస్థతో మాధబి బచ్‌కు సంబంధం ఉన్నదని హిండెన్‌బర్గ్ ఇటీవలే బయటపెట్టింది. సెబీ పనితీరును సమీక్షించే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కూడా మాధబి బచ్ గురించి చెప్పేందుకు ఏమీ లేదని తేల్చేసింది. తనను తాను సమర్థించుకునేందుకు ...3లో



బచ్ సుద్దులు

ఈ వారంలో ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన మాధబి బచ్ ఓ ఆసక్తికరమైన ప్రకటన చేశారు. 'నిబంధనలు, వాటికి కట్టుబడి ఉండడం అనేవి వ్యవస్థపై నమ్మకాన్ని పెంచడానికి దోహదపడతాయి' అని వ్యాపారుల సమావేశంలో ఆమె చెప్పుకొచ్చారు. వ్యవస్థపై నమ్మకం అంటే దర్యాప్తు సంస్థ కూడా స్వచ్ఛంగా, కడిగిన ముత్యంలా ఉండాలి. ఏ దర్యాప్తు సంస్థ నుండైనా దీనినే ఆశించాలి కదా.

వరద బాధితులను ఆదుకోవడంలో విఫలమైన సీఎం

- బీఆర్ఎస్‌పై బురద చల్లడం సిగ్గుచేటు
- వరద బాధితులను ఆదుకుంటాం : మాజీమంత్రి తన్నీరు హరీశ్ రావు



నవతెలంగాణ-చేగుంట

వరద బాధితులను ఆదుకోవడంలో సీఎం రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. మెదక్ జిల్లా చేగుంట మండలం ఐబీ గెస్ట్ హౌస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి వరద బాధితులకు సహాయం చేయకుండా తమపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా తమపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఫెయిల్ అయ్యారన్నారు. ఖమ్మం వరద సహాయక బాధితులను ఆదుకోక వారిపై లాఠీచార్జి చేయించడం సిగ్గుచేటన్నారు. 74 ఏండ్లు ఉన్న ఏపీ సీఎం బయట తిరుగుతుంటే, 54 ఏండ్లు ఉన్న మన సీఎం ఇంట్లో ఉన్నాడని విమర్శించారు. వాతావరణ శాఖ హెచ్చరించినా ముందస్తు చర్యలు చేపట్టలేదన్నారు. హెలికాప్టర్‌ను ఏర్పాటు చేసి ఉంటే వరదల్లో చిక్కుకున్న బాధితుల చాలా మంది ప్రాణాలు దక్కేవన్నారు. 16 మంది చనిపోయారని ప్రభుత్వం చెప్తుంది కానీ తమకున్న సమాచారం మేరకు ఇప్పటివరకు 31 మంది చనిపోయారని తెలుస్తుందన్నారు. తమ కార్యకర్తలు సహాయక చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ఖమ్మంలో తొమ్మిది సీట్లు ఇస్తే, తొమ్మిది మందిని కూడా కాపాడలేకపోయారన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని, వెంటనే సహాయక చర్యలు చేపట్టాలన్నారు. మీరు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చనిపోయిన వ్యక్తులకు రూ.25 లక్షలు అడిగిన మీరు ఇప్పుడు చనిపోయిన వ్యక్తులకు రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 2023 జులైలో మొరంచ వాగు ప్రవాహంలో ఆరుగురిని హెలికాప్టర్ ద్వారా కాపాడిన విషయాన్ని గుర్తుచేశారు.

వరదల్లో చిక్కుకున్న వారికి తాగునీరు, ఆహార పదార్థాలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. త్వరలోనే వరద బాధితులను ఆదుకుంటామని, విరాళాలు సేకరించి బాధితులకు నిత్యావసర సరుకులతో పాటు చదువుకుంటున్న పిల్లలకు పుస్తకాలు, బట్టలు తదితర వస్తువులను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కోమండ్ల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుంగలు పడిన చెరువులకు, రోడ్లకు మరమ్మతులు చేయించాలి

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవ తెలంగాణ-హవేలీ ఘనాపూర్

బుంగలు పడిన చెరువులకు, తెగిపోయిన రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేసి ప్రజలకు ఉపశమనం కలిగించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ జిల్లా హవేలీఘనపూర్ మండల పరిధిలోని ముత్తయి కోట, లింగసాన్ పల్లి గ్రామాల్లో వర్షంతో కొట్టుకుపోయిన రోడ్లు, తెగిపోయిన చెరువులు, చెరువుకు పడిన బుంగలను సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తాండాలకు వెళ్లే రహదారులు భారీ వర్షానికి కొట్టుకుపోవడం వల్ల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని, వాటిని పునరుద్ధరించాలని సూచించారు. చెరువుకు పడిన బుంగలను కూడా తాత్కాలిక మరమ్మత్తులు చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని ఆదేశించారు. పరిశీలించిన వారిలో.. హవేలీ ఘనపూర్, మెదక్ తహసీల్దార్‌లు నవీన్, లక్ష్మణ్ బాబు, ఇరిగేషన్ ఏఈ శ్రీహరి గౌడ్, మండల సర్వేయర్ రమేష్ గౌడ్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

అండగా ఉంటాం

(మొదటిపేజీ తరువాయి)

ఇక్కడి నుంచి ఆదేశిస్తుమన్నారు.

స్వయంగా వరద బాధితులతో మాట్లాడిన ముఖ్యమంత్రి..

మున్నేరు పరివాహక ప్రాంతంలో విపరీతమైన బురద ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బురదను సైతం లెక్క చేయకుండా స్వయంగా వరద బాధితులతో వారి ఇళ్లలోకి వెళ్ళి పలకరించి మాట్లాడారు.పోలేపల్లి గ్రామపంచాయతీలోని కరుణగిరి రాజీవ్ గృహాల వద్ద నివాసం ఉంటున్న మూతి రాజేశ్వరి ఇంట్లోకి వెళ్ళి ఇల్లంతా కలియదిరుగుతూ పరిశీలించారు.జరిగిన నష్టానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆమెకు ధైర్యం కల్పించారు.అదే కాలనీలో నివాసముంటున్న భయ్యా సంధ్య ఇంట్లోకి భారీ వరద చేరడంతో ఇల్లంతా ఒండ్రు మట్టితో నిండి ఉన్నప్పటికీ తన

వాహనం దిగి ఆమె ఇంటికి వెళ్ళి వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

సీఎంకు నిరసన సెగ...

రాజీవ్ గృహ కల్పలో పర్యటిస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి అక్కడ వరద బాధితులు రోడ్డుపై బైఠాయించి సీఎం డాం, డాం అంటూ నిరసన తెలిపారు. దీంతో స్వయంగా ముఖ్యమంత్రి వారి వద్దకు వెళ్లి మాట్లాడారు. అక్కడ ప్రజలనుద్దేశించి మాట్లాడిన అనంతరం ఖమ్మం నగరంలోని బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, సారధినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి వరద బాధితులను పరామర్శించి ఖమ్మం నగరంలోని ఐడీఓసీ కార్యాలయంలో జరిగే సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు వెళ్ళారు. ముఖ్యమంత్రి పర్యటనలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, మున్సిపల్, విపత్తుల డైరెక్టర్ వి.పి. గౌతమ్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు తదితరులున్నారు.

మరో రెండు రోజులు వర్షాలు

- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- వెల్లడించిన వాతావరణ శాఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రాగల రెండు రోజుల పాటు తేలిక నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ ఒడిశా,దక్షిణ ఛత్తీస్‌గఢ్, ఏపీ వద్ద కేంద్రీకృత మైన వాయుగుండం విదర్భ, తెలంగాణలో విస్తరించిందని పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఆదిలాబాద్, కొమురంభీం ఆసీఫాబాద్, భూపాలపల్లి, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, సిద్ధిపేట, యాదాద్రి జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశముందని వివరించింది. హైదరాబాద్ నగరంలో రాగల 48 గంటల పాటు ఉరుములు, మెరుపులతో కూడి వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.

భారీ వర్షాలకు 754 రోడ్లు ధ్వంసం

శాశ్వత మరమ్మతులకు రూ.673.29 కోట్లు అవసరం



- సహాయక చర్యలతోపాటు నష్టం అంచనా
- ఇంజినీరింగ్ అధికారులకు సర్కారు ఆదేశం
- ప్రత్యేకంగా అర్‌అండ్‌బీలో కంట్రోల్ రూమ్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంచాయతీరాజ్, రోడ్లు, భవనాల శాఖకు చెందిన రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈమేరకు ఇరు శాఖల ఉన్నతాధికారులు సహాయక చర్యలు చేపడుతూనే నష్టాలను అంచనా వేయాలని సర్కారు ఆదేశించింది. ఈమేరకు ఉన్నతాధికారులు కింది స్థాయి ఇంజినీర్లకు ఆదేశించారు. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలంటూ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 754 రోడ్లు దెబ్బతినగా, వాటి శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరించడానికి రూ.673.29 కోట్లు అవసరమని అంచనాకు వచ్చారు. హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ఆర్‌అండ్‌బీ రాష్ట్ర కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అన్ని జిల్లాల్లో రికార్డు స్థాయిలో వర్షాలు కురవడంతో చాలా ప్రాంతాల్లో రోడ్లు కొట్టుకుపోయాయి. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, పంచాయతీరాజ్ రోడ్లు ఏ మేరకు ధ్వంసం కావడం, దెబ్బతినడం తదితర అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని చెప్పారు. చాలా జిల్లాల్లో పెద్ద ఎత్తున వరద పోటెత్తడంతో చెరువుల కట్టలు తెగిపోయాయి. ఈ వానల కారణంగా ఏపీ-తెలంగాణ మధ్య రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. ఏకంగా రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయిన విషయం విదితమే. తెలంగాణ -ఏపీ సరిహద్దు రామాపురం వద్ద చిమిర్యాల వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. కోదాడ నుంచి వరదనీరు దిగువకు భారీగా వస్తున్నది. దీంతోపాటు నల్లబండగూడెం వద్ద జాతీయ రహదారిపైకి వరద నీరు భారీగా వచ్చి చేరింది. అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈనేపథ్యంలో రెండు రాష్ట్రాలకు మధ్య రాకపోకలు స్థంభించాయి. రోడ్లపై నిలిచిన నీటిని మళ్లించడానికి అధికార యంత్రాంగం చర్యలు చేపడుతున్నది. అయినా సరే ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో రహదారులపై నీటిని తొలగించడం కష్టంగా మారిందని అర్‌అండ్‌బీ అధికారులు అంటున్నారు. ఎక్కడికక్కడ వాగులు పొంగడంతో పాటుగా కాలువలు కట్టలు తెగి ప్రవహిస్తున్నాయి. దీంతో రహదారులన్ని నీటమునిగాయి. మరోవైపు రెండు రాష్ట్రాల్లోనూ భారీగా వర్షాలు పడడంతో ఇండ్లలోకి నీరు చేరింది. ఆదిలాబాద్ జిల్లా పెనుగంగా ఉప్పొంగి నది ప్రవహిస్తున్నది. ఆనంద్‌పూర్ వద్ద బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న పెనుగంగా కారణంగా... తెలంగాణ, మహారాష్ట్ర మధ్య రాకపోకలకు బ్రేక్ పడింది. ఇక ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలో కుండపోత వర్షం కురుస్తున్నది. విజయవాడ, ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారిపై వరద నీరు పోటెత్తింది. బయ్యన్నగూడెం, తుమ్మలపల్లి, కుప్పెనకుంట్ల గ్రామాల వద్ద జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు కారణంగా విజయవాడ, భద్రాచలం వైపు రాకపోకలు నిలిచిపోయాయి. మహబూబ్‌నగర్ - చించోలి జాతీయ ప్రధాన రహదారి హన్వాడ మండలం ఇబ్రహీంబాద్ వద్ద కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయింది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు సగానికిపైగా జిల్లాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. రోడ్ల నష్టాన్ని అంచనా వేసేందుకు ఆర్‌అండ్‌బీ శాఖ ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేసింది. సహాయక చర్యలూ తీసుకుంటున్నారు. ఇదిలావుండగా 119 పంచాయతీరాజ్ రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఎక్కువగా ఖమ్మం-భద్రాద్రి ములుగు-నల్లగొండ రోడ్లు ధ్వంసమైనట్టు పంచాయరాజ్ ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. సూర్యాపేట జిల్లాలో దాదాపు 11 రోడ్లు కొట్టుకుపోయాయి. వాటిని మరమ్మతు చేయడానికి రూ.23 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనాకు వచ్చారు. మిగతా రోడ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని అంటున్నారు. వాగులు, వంకలు, పొంగిపోర్లడంతో రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. హన్మకొండ, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, యాదాద్రి-భువనగిరి, వికారాబాద్, సిద్ధిపేట, కామారెడ్డి, ఖమ్మం, నాగర్‌కర్నూల్ తదితర జిల్లాలో రోడ్లు దెబ్బతిన్నాయి.

నష్టం ఇలా...

68 రోడ్లు కొట్టుకుపోయాయి
300 రోడ్లు ఉప్పొంగి దెబ్బతిన్నాయి
386 రోడ్ల ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారాయి
తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.5.67 కోట్లు అవసరం
శాశ్వత మరమ్మతుల కోసం రూ.673.29 కోట్లు కావాలి.

ప్రాజెక్టులకు పెరిగిన వరద ప్రవాహం


- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి



నవతెలంగాణ- విలేకరులు

రాష్ట్రంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో పాటు ఎగువన కురుస్తున్న వర్షానికి ప్రాజెక్టులకు వరద ప్రవాహం పెరిగింది. దాంతో ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు 45 గేట్లు ఎత్తి 3,07,845 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయం లోనికి వదులుతున్నట్టు తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టు 10 గేట్లు 10 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నట్టు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 3,24,525 క్యూసెక్కులు ఉండగా, ఔట్ ఫ్లో 3,49,152 క్యూసెక్కులుగా ఉందన్నారు. నీటిమట్టం 885 అడుగులకు చేరింది. కాగా కుడి, ఎడుమ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోందని తెలిపారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఎగువనున్న కడెం నుంచి 40వేల క్యూసెక్కులు వస్తుండగా.. ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియా నుంచే పెద్దఎత్తున వరద వస్తోంది. ప్రాజెక్టు 20.175టీఎంసీ సామర్థ్యం ఉండగా.. 15టీఎంసీల వరకు నీటి నిల్వ ఉండేట్టు చూస్తూ ప్రాజెక్టు 38గేట్లు ఎత్తి దిగువకు 2.60లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరికిలోకి వదులుతున్నారు.

నల్లగొండ జిల్లా కేతేపల్లిలోని మూసి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. 7 క్రస్ట్ గేట్లను నాలుగు అడుగుల మేర ఎత్తి దిగువ మూసీలోకి 12410 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 641.90 అడుగుల వద్ద స్థిరంగా ఉంది. దుందుభి నదిలో నీరు ఉధృతంగా ప్రవహించడంతో డీండీ ప్రాజెక్టు ఆదివారం రాత్రి నుంచి పొంగిపొర్లుతోంది. ఈ ప్రాజెక్టు హైదరాబాద్ శ్రీశైలం హైవేపై ఉండటం వల్ల పర్యాటకుల సందడి పెరిగింది. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్ట్‌లో నాలుగు రోజుల కిందటి వరకు కేవలం 14 టీఎంసీల నీరు మాత్రమే ఉండగా ప్రస్తుతం 19 టీఎంసీలకు చేరింది. కాగా ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యం 29 టీఎంసీలు.ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో 22,036 క్యూసెక్కులు ఉండగా.. అవుట్ ఫ్లో 401 క్యూసెక్కుల నీరు బయటికి వెళ్తున్నది. కాగా, సింగూరు ప్రాజెక్ట్‌ను వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరుతో కలిసి సోమవారం ప్రాజెక్ట్‌ను సందర్శించారు.



కడెం ప్రాజెక్టుకు ప్రస్తుతం 60వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 18గేట్లు ఎత్తివేసి 75వేల క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నారు. ఎగువన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 40గేట్లు ఎత్తి నీరు వదులుతుండటంతో గోదావరి నది పొంగి ప్రవహిస్తోంది. దీంతో సదర్మాట్ బ్యారేజీలోకి భారీ స్థాయిలో వరద చేరింది. 36 గేట్లు ఎత్తి బ్యారేజీ నీటిని దిగువకు వదిలారు. ఆసిఫాబాద్ జిల్లాలోని అడ, వట్టివాగు ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేసి నీటిని దిగువకు వదిలేయడంతో గుండివాగు మరింత ఉధృతంగా ప్రవహిస్తోంది. వంతెనపై నుంచి నీరు పారడంతో సుమారు 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కోస్రా- మలన్‌గొంది వద్ద బ్రిడ్జి తెగిపోయింది. స్వర్ణ ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని కిందకు వదిలేయడంతో సిద్దాపూర్ వాగు మరింత వంతెనపై నుంచి ప్రవహిస్తోంది.

దాంతో నిర్మల్- కొట్ల(కె) గ్రామాలకు రాకపోకలు నిలిపివేశారు. మత్తడివాగు, సాత్నాల తదితర ప్రాజెక్టుల గేట్లు ఎత్తారు. పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. మంచిర్యాల జిల్లాలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు 32 గేట్లు ఎత్తి వేయడంతో స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్ ప్రాజెక్టును సందర్శించారు.

ఎస్సారెస్పీ గేట్లు ఎత్తివేత

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు మంజీరా, గోదావరి నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ఎస్సారెస్పీకి వరదనీరు పోటెత్తుతుంది. ఆదివారం అర్ధరాత్రి నుంచి గంట గంటకూ ప్రవాహం పెరుగుతూ వచ్చింది. దాంతో మొత్తం 41 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 2.5 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా.. 3.14 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి కోసం ఎస్కేప్ గేట్ల ద్వారా 4000 క్యూసెక్కుల నీరు గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు, 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1088.9 అడుగులు 72.990 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు 51 వేల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 17.8 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.52 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

విద్యార్థుల కొట్లాట..

- హాకీ స్టిక్, క్రికెట్ బ్యాట్, చెప్పులతో జూనియర్‌లను కొట్టిన సీనియర్లు
- 2 నెలల్లోపే 2 సార్లు కొట్టుకున్న విద్యార్థులు
- తరచూ గొడవలకు ప్రిన్సిపల్ పర్యవేక్షణ లోపమే కారణమా?
- ప్రిన్సిపల్‌పై మండిపడిన విద్యార్థుల తల్లిదండ్రులు



నవతెలంగాణ-తూప్రాన్

మెదక్ జిల్లా తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద ఉన్న తెలంగాణ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులను 10వ తరగతి విద్యార్థులు ఆదివారం రాత్రి విచక్షణారహితంగా కొట్టారు. టీఎస్‌ఆర్జేసీ పాఠశాలలో బుద్ధిగా చదువుకోవాల్సిన విద్యార్థులు గొడవలకు ఉపక్రమిస్తున్నారు. 2 నెలల క్రితం ఇంటర్ విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులను చితక్కొట్టిన విషయాన్ని మరవకముందే మరొక దారుణం వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులను ఆదివారం రాత్రి 10 నుంచి 12 గంటల సమయంలో సెంట్ బాటిల్ విషయంలో వారి మధ్య జరిగిన వాగ్వాదంతో ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. అనంతరం పాత గొడవలను సైతం దృష్టిలో ఉంచుకొని 10 మంది 10 వ తరగతి విద్యార్థులు హాకీ స్టిక్, క్రికెట్ బ్యాట్లు, చెప్పులు, కట్టెలతో విచక్షణారహితంగా 9వ తరగతి విద్యార్థులను కొట్టారు. విద్యార్థులు ఎంత ప్రాదేయపడ్డా వదలకపోగా.. వారి బట్టలను నోట్లో కుక్కి, కొట్టేటప్పుడు అరిచినా, ఉపాధ్యాయులకు చెప్పిన మిమ్మల్ని చంపేస్తామని 10వ తరగతి విద్యార్థులు బెదిరించారు.

ప్రిన్సిపాల్‌ను నిలదీసిన విద్యార్థుల తల్లిదండ్రులు

విద్యార్థులు కొట్టుకున్న విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చి ప్రిన్సిపాల్ మురళితో వాగ్వాదానికి దిగారు. పాఠశాలలో ప్రిన్సిపల్ పర్యవేక్షణా లోపం ఉందని, విద్యార్థులు కొట్టుకునేటప్పుడు ఉపాధ్యాయులు ఏమి చేస్తున్నారని తల్లిదండ్రులు ప్రశ్నించారు. 9వ తరగతి విద్యార్థులు వీపులపై ఏర్పడిన తీవ్రమైన గాయాలను చూయిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ మురళి మాట్లాడుతూ.. 9వ తరగతి విద్యార్థులను కొట్టిన 10 వ తరగతి విద్యార్థులకు టీసీలు ఇచ్చి పాఠశాల నుంచి బయటకు పంపిస్తామన్నారు. ఇంత పెద్ద గొడవ జరిగినా ఎవరికీ తెలియకుండా పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు గోప్యంగా ఉంచడానికి కారణమేంటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. ఇకపై ఇలాంటి గొడవలు పాఠశాలలో పునరావతం కాకుండా చర్యలు చేపట్టాలని విద్యాశాఖ ఉన్నతాధి.కారులను విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకున్నారు.

నవతెలంగాణ
క్లాసిఫైడ్స్

SAREES

మా వద్ద కంచి, ఆరణి, ధర్మవరం, గద్వాల్, పోచంపల్లి, ఉప్పాడ, వెంకటగిరి, మంగళగిరి, బెనారస్, జరీ కోటా, చందేరి పట్టు చీరలు హోల్ సేల్ రేట్లకే లభించును. ఫోన్ : 7901477499

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "నవతెలంగాణ" పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు, పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సింగూరు ఎడమ కాలువకు గండి

- పంటపొలాల్లోకి భారీగా వరద నీరు
- లబోదిబోమంటున్న రైతులు



నవతెలంగాణ-పుల్కల్

గత నాలుగు రోజులు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో సింగూరు ఎడమ కాలువ వరద నీటితో నిండి.. దానికి అనుసంధానంగా ఉన్న పిల్ల కాలువల్లోకి పెద్ద ఎత్తున నీరు చేరుతున్నది. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల పరిధిలోని ఇసోజిపేట గ్రామ శివారులో ఆ కాల్వకు గండిపడింది. దాంతో నీటితోపాటు పెద్దఎత్తున మట్టి కూడా వ్యవసాయ పొల్లాల్లోకి కొట్టుకుపోయింది. ఒక్కసారిగా కట్ట పగిలిపోవడంతో నీరంతా పొలాల్లోకి చేరిందని.. పంటలు పూర్తిగా దెబ్బతినే దుస్థితి వచ్చిందని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికి ఏ ఒక్క అధికారి స్పందించలేదని వాపోయారు. గతేడాది కూడా ఇదే కాలువకు గండి పడగా.. అప్పటి ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ వెంటడే స్పందించి నేరుగా ఆయన ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీల సాయంతో గండిని పూడ్చి వేయించారన్నారు. ఇప్పుడు కూడా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గండిని పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

సాగు భూములను వదులుకోం..

- సర్వేకోసం వచ్చిన అదనపు కలెక్టర్, ఆర్డీఓను అడ్డుకున్న రైతులు
- భూ సేకరణకు వ్యతిరేకంగా రోడ్డుపై గంటలపాటు బైటాయింపు



నవతెలంగాణ-న్యాల్‌కల్

సారవంతమైన సాగు భూములను ఫార్మా కంపెనీల పేరిట లాక్కోవద్దని.. ఎట్టి పరిస్థితుల్లో ఆ భూములను వదులుకోబోమని బాధిత రైతులు అధికారులకు స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీఓ రాజు, తహసీల్దార్ భూపాల్, ఉప తహసీల్దార్ రాజిరెడ్డితో కలిసి ఫార్మాసిటీ ఏర్పాటుకు భూ సేకరణ కోసం సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని డప్పూరు గ్రామంలో భూములను పరిశీలిస్తుండగా రైతులు అడ్డుకున్నారు. పచ్చని పల్లెల్లోకి కాలుష్య కంపెనీలు తేవొద్దని నినాదాలు చేస్తూ.. మల్గి గ్రామస్తులతో కలిసి గంటలపాటు రోడ్డుపై బైటాయించారు. సాగు భూములను కంపెనీలకు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. ఈ విషయం తెలుసుకున్న జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ హనుమంతు, శివలింగం, డివిజన్ ఎస్ఐతో ఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ఫార్మాసిటీ భూ సేకరణను వెంటనే వెనక్కు తీసుకోవాలని అదనపు కలెక్టర్, అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. ఎట్టి పరిస్థితుల్లో భూములు వదులుకోమని తేల్చిచెప్పారు. ఈ నిరసనలో ఆయా గ్రామాల భూ నిర్వాసితులు డప్పుర్ శివరాజ్ , రవికుమార్, రవి గౌడ్, కిరణ్ గౌడ్, అరుణ్, మారుతి యాదవ్ తదితరులున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
శ్రీశ్రీశ్రీ పడమటి ఆంజనేయ స్వామి దేవస్థానము
[illegible]
లేఖ. నెం.06/[illegible]-2024 తేది: 30/08/2024
షాపుల బహిరంగ వేలము ప్రకటన
[illegible] తేది: 19-09-2024 [illegible] 11-30 [illegible] రూ. 1,00,000/- [illegible] 9-00 [illegible] 11-00 [illegible] 18.1" X 8.6" [illegible] రూ. 1,00,000/-[illegible] తేది: 01-10-2024 నుండి తేది: 30-09-2027 వరకు (3 సంవత్సరాలు), 02. షాప్ నెం.5 [illegible] 6" X 6" [illegible] రూ. 1,00,000/-[illegible] తేది: 01-10-2024 నుండి తేది: 30-09-2027 వరకు (3 సంవత్సరాలు)
కార్యనిర్వహణాధికారి
DIPR R.O.No. 3583-PP/CL/ADVT/1/2024-25, Dt:14.06.2024

తెలంగాణ ప్రభుత్వం
సాగునీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
కార్యనిర్వాహక ఇంజనీరు వారి కార్యాలయం, డివిజన్ నెం. 1 సంగారెడ్డి ఫోన్: 9440816444

1. ఇ-ప్రొక్యూర్మెంట్ నోటీసు నెం.19/ఇఇ/ఐడి-1/ఎస్ఆర్‌డి/2024-25 తేది: 30-08-2024, (2వ పిలుపు) సాగునీటి పారుదల శాఖ-సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి మండలం, సంగారెడ్డి గ్రామం, [illegible] ఎఫ్‌టిఎల్ సరిహద్దు స్తంభం పనుల కొరకు తేది: 04-09-2024 నుండి 11-09-2024 వరకు బిడ్లను ఆహ్వానించడమైనది. పని అంచనా విలువ రూ.1.57 లక్షలు
2. ఇ-ప్రొక్యూర్మెంట్ నోటీసు నెం.20/ఇఇ/ఐడి-1/ఎస్ఆర్‌డి/2024-25 తేది: 30-08-2024, (2వ పిలుపు) సాగునీటి పారుదల శాఖ-సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి మండలం, సంగారెడ్డి గ్రామం, [illegible] చెరువు ఎఫ్‌టిఎల్ సరిహద్దు స్తంభం పనుల కొరకు తేది: 04-09-2024 నుండి 11-09-2024 వరకు బిడ్లను ఆహ్వానించడమైనది. పని అంచనా విలువ రూ.3.93 లక్షలు
3. ఇ-ప్రొక్యూర్మెంట్ నోటీసు నెం.21/ఇఇ/ఐడి-1/ఎస్ఆర్‌డి/2024-25 తేది: 30-08-2024, (2వ పిలుపు) సాగునీటి పారుదల శాఖ-సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి మండలం, కల్పకుంట గ్రామం, ఎర్రకుంట ఎఫ్‌టిఎల్ సరిహద్దు స్తంభం పనుల కొరకు తేది: 04-09-2024 నుండి 11-09-2024 వరకు బిడ్లను ఆహ్వానించడమైనది. పని అంచనా విలువ రూ.2.53 లక్షలు
4. ఇ-ప్రొక్యూర్మెంట్ నోటీసు నెం.22/ఇఇ/ఐడి-1/ఎస్ఆర్‌డి/2024-25 తేది: 30-08-2024, (2వ పిలుపు) సాగునీటి పారుదల శాఖ-సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి మండలం, రాజంపేట గ్రామం, ఎర్రకుంట ఎఫ్‌టిఎల్ సరిహద్దు స్తంభం పనుల కొరకు తేది: 04-09-2024 నుండి 11-09-2024 వరకు బిడ్లను ఆహ్వానించడమైనది. పని అంచనా విలువ రూ.0.91 లక్షలు.

మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్మెంట్ ప్లాట్ ఫామ్ www.tender.telangana.gov.in వెబ్ సైట్ నందు తేది: 04-09-2024 నుండి చూడగలరు.
సం/-
కార్యనిర్వాహక ఇంజనీరు
నీటి పారుదల డివిజన్ నెం-1 సంగారెడ్డి
DIPR R.O.No.3597-PP/CL/ADVT/1/2024-25, Dt:02.09.2024

SOUTHERN MAGNESIUM AND CHEMICALS LIMITED
CIN: L27109TG1985PLC005303
Regd. Off: Deccan Chambers, 5th Floor, 6-3-666/B, Somajiguda, Hyderabad - 500082.

38వ వార్షిక సర్వసభ్య సమావేశం ప్రకటన

[illegible] 38వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజిఎం) సోమవారం, 30 సెప్టెంబర్, 2024న ఉదయం గం.11-30 నిమిషాలకు నిర్వహించబడును. [illegible] జనరల్ సర్క్యులర్ నెం.14/2020,తేది:08-04-2020,జనరల్ సర్క్యులర్ నెం.17/2020, తేది:13-04-2020, జనరల్ సర్క్యులర్ నెం.22/2020,తేది:15-06-2020,జనరల్ సర్క్యులర్ నెం.33/2020, తేది:28-09-2020, జనరల్ సర్క్యులర్ నెం.39/2020, తేది:31-12-2020, జనరల్ సర్క్యులర్ నెం.10/2021,తేది:23-06-2021, జనరల్ సర్క్యులర్ నెం.20/2021,తేది:08-12-2021, జనరల్ సర్క్యులర్ నెం.02/2022, తేది:05-05-2022, జనరల్ సర్క్యులర్ నెం.10/2022, తేది:28-12-2022, జనరల్ సర్క్యులర్ నెం.09/2023, తేది:25-09-2023 [illegible]

ఏజిఎం నోటీసు మరియు 2023-24 యొక్క వార్షిక నివేదికను 31,మార్చి,2024తో ముగిసిన [illegible] www.southernmagnesium.com [illegible] www.bseindia.com [illegible] www.evotingindia.com [illegible] info@aarthiconsultants.com [illegible]

- ఫోలియో నెం./క్లయింట్ ఐడి మరియు డిపి-ఐడి
- వాటాదారుని పేరు
- ఒకవేళ వాటాలు భౌతిక రూపంలో ఉన్నట్లయితే...వాటా సర్టిఫికెట్ యొక్క స్కాన్ కాపీ
- పాన్ కార్డు యొక్క స్వీయ ధ్రువీకరణతో కూడిన స్కాన్ చేయబడిన కాపీ
- ఆధార్ కార్డు యొక్క స్వీయ ధ్రువీకరణతో కూడిన స్కాన్ చేయబడిన కాపీ

[illegible] మంగళవారం, 24,సెప్టెంబర్,2024 నుండి సోమవారం, 30, సెప్టెంబర్,2024 వరకు (రెండు రోజులు కలుపుకొని) 38వ ఏజిఎం నిర్వహణ నిమిత్తం మూసివేయబడి ఉంటాయి.

బోర్డు ఆఫ్ డైరెక్టర్ల తరపున
For Southern Magnesium and Chemicals Limited
సం/-
ఎస్.రాజేంద్ర ప్రసాద్
జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ & సిఎఫ్ఓ
(DIN: 00145659)
తేది: 02-09-2024
ప్రదేశం: హైదరాబాద్



సమస్యల పరిష్కారానికి కమిటీ

అన్నదాతల ఆందోళనపై సుప్రీంకోర్టు నిర్ణయం

న్యూఢిల్లీ : శంభు సరిహద్దులో ఆందోళన చేస్తున్న అన్నదాతల సమస్యలను పరిష్కరించేందుకు సుప్రీంకోర్టు సోమవారం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. పంజాబ్-హర్యానా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నవాబ్ సింగ్ దీనికి నేతృత్వం వహిస్తారు. వారం రోజుల్లో తొలి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భయాన్‌తో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ కమిటీని ఆదేశించింది. రైతుల సమస్యలను రాజకీయం చేయరాదని, వాటిని కమిటీ దశల వారీగా పరిశీలిస్తుందని బెంచ్ తెలిపింది. శాంతియుతంగా జరుపుతున్న ఆందోళనను ప్రత్యామ్నాయ ప్రదేశాలకు మార్చే స్వేచ్ఛ రైతులకు ఉన్నదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అంబాలా సమీపంలోని శంభు సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను వారం రోజుల్లో తొలగించాలంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను హర్యానా ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఆ సరిహద్దు వద్ద రైతులు ఫిబ్రవరి 13వ తేదీ నుండి ఆందోళన జరుపుతున్నారు. రైతులు తమ డిమాండ్ల సాధన కోసం రాజధాని ఢిల్లీకి ప్రదర్శనగా వెళతారని సంయుక్త కిసాన్ మోర్చ, కిసాన్ మజ్దూర్ మోర్చ ప్రకటించిన నేపథ్యంలో హర్యానా ప్రభుత్వం అంబాలా-న్యూఢిల్లీ జాతీయ రహదారిపై ఫిబ్రవరిలో బారికేడ్లను ఏర్పాటు చేసింది. తమ ఉత్పత్తుల కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే.

స్వాతి మాలివాల్‌పై దాడి కేసులో...

కేజ్రీవాల్ ప్రైవేటు కార్యదర్శికి బెయిల్



న్యూఢిల్లీ : స్వాతి మాలివాల్‌పై దాడి కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రైవేటు కార్యదర్శి వైభవ్ కుమార్‌కు సుప్రీంకోర్టు సోమవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. కుమార్ ఇప్పటికే వంద రోజులకు పైగా జైలులో గడిపారని, విచారణ ప్రారంభం కావడానికి ఇంకా సమయం పడుతుందని జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని బెంచ్ వ్యాఖ్యానించింది. సాక్ష్యాలను తారు మారు చేయకూడదని, సాక్షులను ప్రభావితం చేయకూడదని నిందితుడిని ఆదేశించింది. ఢిల్లీ ముఖ్యమంత్రికి ప్రైవేటు కార్యదర్శిగా వ్యవహరించకూడదని కూడా నిర్దేశించింది. సాక్షులందరినీ విచారించే వరకూ వైభవ్ కుమార్ ముఖ్యమంత్రి నివాసంలో అడుగు పెట్టకూడదని షరతు విధించింది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ ముందుగా ముఖ్యమైన సాక్షులను, బలహీనులైన ప్రైవేటు సాక్షులను విచారించాలని న్యాయస్థానం ఆదేశించింది.

మరో వివాదంలో సెబీ చీఫ్

దర్యాప్తు సంస్థలో ఉంటూనే ఐసీఐసీఐ నుండి ఆదాయం

- ఇది విరుద్ధ ప్రయోజనమే
- ప్రధానికి తెలిసే ఇదంతా జరుగుతోందా?
- కాంగ్రెస్ తాజా ఆరోపణ
- రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్



న్యూఢిల్లీ : సెబీ చీఫ్ మాధబి పూరి బచ్‌పై హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ చేసిన ఆరోపణల వేడి చల్లారక ముందే కాంగ్రెస్ పార్టీ తాజాగా బాంబు పేల్చింది. సెబీ హోల్‌టైమ్ సభ్యురాలిగా వ్యవహరిస్తూనే మాధబి బచ్ తాను గతంలో పనిచేసిన ఐసీఐసీఐ బ్యాంక్ నుండి 2014-17 మధ్యకాలంలో రూ.16.8 కోట్ల మేర జీతం, ఆదాయం పొందారని ఆరోపించింది. సెబీ సభ్యురాలిగా ఉంటూ ఐసీఐసీఐ వంటి ప్రైవేటు సంస్థ నుండి ఎలా జీతం తీసుకుంటారని ప్రశ్నించింది. కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖెరా సోమవారం విలేకరులతో మాట్లాడుతూ 'మాధబి బచ్ 2014-17 మధ్య సెబీ హోల్‌టైమ్ సభ్యురాలిగా ఉన్నారు. ఆ కాలంలో ఆమె రూ.16.80 కోట్ల మేర ఐసీఐసీఐ బ్యాంక్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ నుండి ఆదాయాన్ని, బ్యాంక్ నుండి ఎంప్లాయీ స్టాక్ ఓనర్‌షిప్ ప్లాన్స్ (ఎసోప్) ప్రయోజనాలను పొందారు' అని తెలిపారు. 2017 నుండి ఈ రోజు వరకూ ఆమె ఐసీఐసీఐ నుండి రెగ్యులర్‌గా ఆదాయం పొందుతూనే ఉన్నారని చెప్పారు. ఎసోప్స్‌పై టీడీఎస్‌ను కూడా ఆమెకు బ్యాంక్ అందజేసిందని అన్నారు. 2021-22లో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ నుండి రూ.2.17 లక్షలు తీసుకున్నారని, ఎసోప్స్ రూ.2.66 కోట్లతో ప్రారంభమయ్యాయని వివరించారు. ఎసోప్స్ అంటే యాజమాన్యం తన ఉద్యోగులకు తక్కువ ధరకు లేదా అదనపు ఖర్చు లేకుండా కంపెనీ వాటాలను విక్రయించడం. వాటిని వారు నిర్దిష్ట కాలం తర్వాత, నిర్దిష్ట ధరకు విక్రయించి సొమ్ము చేసుకోవచ్చు.

సెబీ చీఫ్ ఒక కీలకమైన ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నారని, ప్రధానమంత్రి నేతృత్వంలోని నియామకాల కమిటీ ఆమెను నియమించిందని, ఆ కమిటీలో ఒక కేంద్ర మంత్రి కూడా సభ్యుడిగా ఉంటారని పవన్ ఖెరా గుర్తు చేశారు. ప్రజలు తమ వద్ద ఉన్న సొమ్మును షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడతారని, దానిని సెబీ పర్యవేక్షిస్తుందని చెప్పారు. అందువల్ల అది నిర్వహించే పాత్ర చాలా ముఖ్యమైనదని తెలిపారు.

సంవత్సరంలోనే రెట్టింపైన జీతం

2017-18లో బచ్ రెండు కోట్ల రూపాయల జీతం తీసుకున్నారని, ఆ మరుసటి ఆర్థిక సంవత్సరంలోనే అది రెట్టింపై రూ.4.71 కోట్లకు చేరిందని కాంగ్రెస్ గుర్తు చేసింది. ఐసీఐసీఐ నుండి ఆమెకు ఆదాయం నిలిచిపోయినప్పటికీ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, ఎసోప్స్ నుండి వస్తూనే ఉన్నదని తెలిపింది. '2017లో బచ్ సెబీలో చేరారు. అప్పటి నుండి నేటి వరకూ ఐసీఐసీఐ నుండి ఆమె రూ.16,80,22,143ల ఆదాయాన్ని పొందారు. అదే కాలంలో సెబీ నుండి పొందిన రూ.3,30,28,246ల ఆదాయంతో పోలిస్తే ఇది 5.09 రెట్లు అదనం' అని కాంగ్రెస్ ఓ ప్రకటనలో వివరించింది.

ఈ ప్రశ్నలకు జవాబేది?

సెబీ జరుపుతున్న దర్యాప్తులో దాని అధిపతికి పరస్పర విరుద్ధ ప్రయోజనాలు చేకూరడంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ అన్నారు. 'ఈ ప్రశ్నలను కేంద్ర ప్రభుత్వం చాలా తేలికగా కొట్టిపారేసింది. కానీ ఇప్పుడు కొత్తగా వెలుగులోకి వచ్చిన వాస్తవాలు చట్ట విరుద్ధ కార్యకలాపాల బాగోతాన్ని బయటపెట్టాయి' అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. 'సెబీ ఛైర్‌పర్సన్ గురించి బయటపడిన దిగ్భ్రాంతికరమైన వాస్తవాలను క్యాబినెట్ నియామకాల కమిటీ పరిశీలించిందా? సెబీ చీఫ్ లాభాపేక్ష కలిగిన పదవిని నిర్వహిస్తున్న విషయం, పదవిలో ఉంటూ ఐసీఐసీఐ బ్యాంక్ నుండి జీతం, ఆదాయం పొందిన విషయం ప్రధానికి తెలుసా? ఐసీఐసీఐ నుండి ఆదాయం పొందుతూ ఆ బ్యాంక్‌కు, దాని అనుబంధ సంస్థలకు వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదులను మాధబి బచ్ విచారించిన విషయం ప్రధానికి తెలుసా? చాలా కాలం క్రితమే కాలం చెల్లిన ఎసోప్స్ ప్రయోజనాలను ఐసీఐసీఐ నుండి ఆమె ఎందుకు పొందుతున్నారు?' అని జైరాం రమేష్ నిలదీశారు.

రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్

సెబీ పదవిలో ఉంటూ ప్రైవేటు బ్యాంక్ నుండి ఆర్థిక ప్రయోజనాలు పొందడం దర్యాప్తు సంస్థ సెక్షన్ 54ను ఉల్లంఘించడమే అవుతుందని, కాబట్టి బచ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ విషయాలన్నింటినీ గమనిస్తే సెబీ చీఫ్‌కు, ఆమె ప్రైవేటు బ్యాంక్ నుండి జీతం తీసుకోవడానికి మధ్య పరస్పర విరుద్ధ ప్రయోజనాలు ఉన్నాయన్న అనుమానం కలుగుతోందని తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగిగా విలువలకు, జవాబుదారీతనానికి ఆమె తిలోదకాలు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐసీఐసీఐ వంటి ప్రైవేటు సంస్థ నుండి సెబీ అధిపతి జీతం తీసుకుంటున్నప్పుడు అది నిస్పాక్షిక దర్యాప్తు సంస్థ ఎలా అవుతుందని ప్రశ్నించింది. ఎసోప్స్ ప్రయోజనాలను అందించిన విషయంలో ఐసీఐసీఐ బ్యాంక్ తన నిబంధనలను ఎలా తుంగలో తొక్కిందని కూడా నిలదీసింది.

దర్యాప్తును ఆమే పర్యవేక్షించారు

(మొదటిపేజీ తరువాయి)

మాధబి చేసిన ప్రకటననే మంత్రిత్వ శాఖ ఉటంకించింది. అయితే అదానీ ఆఫ్‌షోర్ సంస్థలపై సెబీ జరిపిన దర్యాప్తు నుండి మీరు వైదొలగాలని, దర్యాప్తు సంస్థ నిబంధనల మేరకు నడుచుకుంటారా లేదా అంటూ నిర్దిష్టంగా అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చేందుకు ఆమె నిరాకరించారు.

దొంగ చేతికే తాళం

సెబీ బోర్డు సభ్యుడొకరు ఆన్‌లైన్ పోర్టర్ స్క్రోల్‌కు ఓ సంచలన విషయాన్ని బహిర్గతం చేశారు. అయితే తన పేరు వెల్లడించవద్దని ఆయన కోరారు. ఆయన చెప్పిన దాని ప్రకారం సెబీ దర్యాప్తు నుండి మాధబి బచ్ వైదొలగలేదు. సెబీ సభ్యుడు పేల్చిన బాంబు నిశ్శబ్దపు కుట్రను భగ్నం చేసింది. చేదునిజం బయటపడింది. అదానీ గ్రూపు సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన సెబీ చీఫ్ నేతృత్వంలోనే ఆరోపణలపై దర్యాప్తు జరిపారు. అంటే దొంగ చేతికే తాళం ఇచ్చారన్న మాట. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బచ్ సెబీ దర్యాప్తును పర్యవేక్షించారని ఆ సభ్యుడు స్పష్టం చేశారు.

సెబీ ప్రకటనకు భిన్నంగా...

సెబీ బోర్డు సభ్యుడు చెప్పిన విషయం ఆ సంస్థ వివరణకు పూర్తి భిన్నంగా ఉంది. 'పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించిన వ్యవహారాల నుంచి మాధబి బచ్ తనకు తానుగా వైదొలిగారు' అని సెబీ ప్రకటన తెలిపింది. అదానీ వ్యవహారంలో దర్యాప్తు నుంచి వైదొలిగారా అని అడిగిన ప్రశ్నకు మాధబి బచ్ సమాధానం ఇవ్వకుండా ఎందుకు దాటవేశారో వివరణ ఇచ్చేందుకు సెబీ తంటాలు పడింది. హిండెన్‌బర్గ్ ఆరోపణలపై విచారణ జరపాలని సెబీని సుప్రీంకోర్టు ఆదేశించినప్పుడు దర్యాప్తు నుండి మాధబి బచ్ వైదొగలేదని బోర్డు సభ్యుడు స్పష్టం చేయడంతో ప్రజలకు, మార్కెట్‌కు ఆమె వాస్తవాన్ని వెల్లడించకుండా దాచిపెడుతున్నారని అర్థమవుతోంది. సెబీ బోర్డు తనకు మద్దతు ఇస్తోందని మాధబి బచ్ తన ప్రకటనలో పరోక్షంగా తెలియజేశారు.

సుప్రీంకోర్టు ఏం చేస్తుంది?

సెబీ బోర్డు సభ్యుడు చెప్పిందే నిజమైతే దర్యాప్తు పర్యవేక్షణ నుండి ఆమె వైదొలగకపోవడం తీవ్ర పరిణామాలకు కారణమవుతుంది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సెబీ జరిపిన దర్యాప్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి. సెబీ దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదు కాబట్టి ఈ వ్యవహారం ఇంకా సుప్రీంకోర్టు పరిశీలనలోనే ఉంది. సెబీ బోర్డు సభ్యుడు చేసిన ప్రకటనను తేలికగా తీసుకోవడానికి వీలులేదు. ఈ వ్యవహారంలో నిజానిజాలను నిగ్గు తేలుస్తున్న అత్యున్నత న్యాయస్థానం అయినా దానిని పరిగణనలోకి తీసుకోవాలి.

సెబీ రికార్డులను పరిశీలించినప్పుడు ఆ సభ్యుడు చెప్పింది నిజమని తేలితే అప్పుడు న్యాయస్థానం చెప్పే పరిష్కారం ఏమిటి? అలాంటి పరిస్థితి ఉత్పన్నమైతే అప్పుడు సుప్రీంకోర్టు సెబీ మాజీ అధిపతులతో, అధికారులతో మరో స్వతంత్ర కమిటీని నియమించవచ్చు. లేదా వ్యవహారంపై తిరిగి విచారణ జరపడానికి ఓ న్యాయమూర్తిని నియమించి కొన్ని నెలల్లో నివేదిక ఇవ్వాలని కోరవచ్చు. అనేక నెలల పాటు జరిపిన దర్యాప్తులో సెబీ ఇప్పటికే చాలా సమాచారాన్ని సేకరించింది. అదానీ సంస్థలపై 2017 నుండే దర్యాప్తు జరుగుతోంది. పెద్ద ఎత్తున సమాచారాన్ని సేకరించారు. భారతదేశంలోని వర్గాల నుంచే హిండెన్‌బర్గ్ సంస్థ ఎక్కువ సమాచారాన్ని సేకరించగలిగినప్పుడు సెబీ వద్ద కూడా ఆ సమాచారం ఉండి ఉండాలి. ఇక్కడ ప్రశ్న ఏమిటంటే చట్టం, భద్రతా నియమాలు, నిబంధనలకు సంబంధించిన నాలుగు మూలల నుంచి ఆ సమాచారాన్ని ఎలా చదవాలి, ఎలా అర్థం చేసుకోవాలి అనేదే.

గవర్నర్ పదవిని రద్దు చేయాలి

కాంగ్రెస్ నేత అభిషేక్ సింఘ్వి



నవతెలంగాణ- న్యూఢిల్లీ బ్యూరో

గవర్నర్ పదవిని రద్దు చేయాలని, చిల్లర రాజకీయాలకు పాల్పడని వ్యక్తిని ఏకాభిప్రాయంతో నియమించాలని కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వి అన్నారు. గవర్నర్‌లు, ప్రతిపక్షాల పాలిత రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదాలు తలెత్తుతున్న నేపథ్యంలో ఆయన ఈ మేరకు సోమవారం కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రికి సవాల్‌గా లేదా బెదిరింపుగా మారితే గవర్నర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఎందుకంటే ఎన్నికలు జరిగేది సీఎంను ఎన్నుకునేందుకు కానీ, గవర్నర్‌ను ఎన్నుకునేందుకు కాదని అన్నారు. కాగా, గవర్నర్లు బిల్లులను ఆమోదించకుండా పెండింగ్‌లో ఉంచడంపై అభిషేక్ సింఘ్వి మండిపడ్డారు. గవర్నర్లు బిల్లులను ఆమోదించకపోవడంతో ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు కోర్టులకు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. దీనివల్ల పరిపాలన బాధాకరంగా మారుతోందని, ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేకపోతున్నాయని తెలిపారు. మరోవైపు గవర్నర్ మరో చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లా, ఒకే ఒరలో రెండో కత్తిలా వ్యవహరిస్తున్నారని అభిషేక్ సింఘ్వి విమర్శించారు. గవర్నర్‌లు, సీఎంల కోసం అంబేద్కర్ రూపొందించిన సూత్రాన్ని కేంద్ర ప్రభుత్వం సిగ్గులేకుండా ఉల్లంఘిస్తోందని ఆయన ఆరోపించారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కర్నాటక వంటి ప్రతిపక్షాల పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు, గవర్నర్‌ల మధ్య పదేపదే ప్రతి ష్టంభనలు నెలకొంటున్న నేపథ్యంలో సింఘ్వి ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు.

వరద బాధితులను ఆదుకోవాలి

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య



నవతెలంగాణ- మిర్యాలగూడ

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని, గ్రామాలు వరదల్లో చిక్కుకున్నాయని, ప్రజలు అల్లాడిపోతున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 18 మంది చనిపోయారని, ఆ కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని కోరారు. వరద ప్రాంతాల్లో వెంటనే సహాయక చర్యలు చేపట్టి బాధితులను ఆదుకోవాలన్నారు. వరదల కారణంగా అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. వానాకాలం పంట సీజన్ పూర్తి కావస్తోందని, ఇప్పటివరకు పెట్టుబడి సహాయం అందించకపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణమే రైతు భరోసా కింద సహాయమందించాలని కోరారు. ప్రభుత్వం వాగ్దానం చేసినట్టు కౌలు రైతులను కూడా ఆదుకోవాలన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు అయ్యే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు బలహీనంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వానికి, అధికారులకు అనేకసార్లు విజ్ఞప్తి చేసినా మరమ్మతులు చేయకపోవడంతో ప్రస్తుత వరదల కారణంగా కాలువ కట్టలకు గండ్లు పడే ప్రమాదం ఉందని అన్నారు. ఇప్పటికే నడిగూడెం వద్ద గండిపడి వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని చెప్పారు. కాల్వ కట్టలు బలహీనంగా ఉండటం వల్ల ఎడమ కాల్వకు నీటి విడుదల ఆపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో నీరు అందించాలని డిమాండ్ చేశారు.

జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్ఎల్‌బీసీ పనులను పూర్తి చేయాలని కాల్వలో పూడిక తీయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య, తుమ్మల వీరారెడ్డి, డబ్బికార్ మల్లేష్, జిల్లా నాయకులు పాలడుగు నాగార్జున కందాల ప్రమీల, చినపాక లక్ష్మీనారాయణ, పాలడుగు ప్రభావతి ,సయ్యద్ హాశం, వీరే పల్లి వెంకటేశ్వర్లు, రవి నాయక్ పాల్గొన్నారు.

కేంద్రం పునరావాసం ప్యాకేజీని

ప్రకటించాలి

- వరద సహాయ చర్యల్లో పార్టీ శ్రేణులు పాలుపంచుకోవాలి
- తెలుగు రాష్ట్రాల కార్యకర్తలకు రాహుల్ గాంధీ విజ్ఞప్తి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వరదలతో సతమతమవుతున్న తెలుగు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం పునరావాస ప్యాకేజీని కల్పించాలని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణలో వరద పరిస్థితిపై విచారం వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాల్లో భారీ వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు బాసటగా నిలవాలని, సహాయ పునరావాస కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు రాహుల్ గాంధీ విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాలు, వరదలతో సమస్యలు ఎదుర్కొంటున్న తెలంగాణ, ఏపీ ప్రజల బాగోగులపై తాను కలత చెందుతున్నానని, వరదల కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు తాను ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని సోమవారం ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ పోస్ట్ చేశారు. సహాయ, పునారావస కార్యక్రమాల్లో పాల్గొని బాధితులకు సేవలు అందించాలని పార్టీ శ్రేణులను కోరారు. భారీ వర్షాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని, ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు అలుపెరగకుండా శ్రమిస్తున్నదని తెలిపారు.

వరద సహాయక చర్యలో

ప్రభుత్వం విఫలం : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజల ప్రాణాలు కాపాడటంలో, వరద సహాయక చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ విమర్శించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా ఏర్పడిన పరిస్థితులు తనను ఆవేదనకు గురిచేశాయనీ, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తెలంగాణ ప్రభుత్వం అవిశ్రాంతంగా చర్యలు చేపట్టిందంటూ రాహుల్ గాంధీ చేసిన ట్వీట్‌కు సమాధానంగా కేటీఆర్ విచారం వ్యక్తం చేశారు. కేవలం బాధపడతున్నట్టుగా, ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టుగా ప్రకటనలు చేస్తే సరిపోదని రాహుల్‌కు సూచించారు. తెలంగాణలో నిజంగా ప్రభుత్వం తరఫున చేయాల్సిన సహాయక కార్యక్రమాలను చిత్తశుద్ధితో చేస్తున్నారో లేదో తెలుసుకుంటే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకం తెలుస్తుందని రాహుల్ గాంధీకి చురకంటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా తెలంగాణ ఛిన్నాభిన్నామైందని తెలిపారు. నిజంగా తెలంగాణపై శ్రద్ధ ఉండి ఉంటే ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యపు, తప్పుడు చర్యలను మీరెందుకు తప్పుబట్టలేదంటూ రాహుల్‌ను ప్రశ్నించారు. కాంగ్రెస్ చేస్తున్న ఉద్దేశ పూర్వక నిర్లక్ష్యం కారణంగా ప్రజల్లో రోజురోజుకు ఆ పార్టీపై విశ్వాసం సన్నగిల్లుతోందని పేర్కొన్నారు. వరదల్లో ప్రాణ నష్టం, ప్రజలు పడుతున్న ఇబ్బందులకు చేతగాని ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని సూచించారు. వరదల్లో చిక్కుకున్న ప్రజలను దేవుడే కాపాడాలంటూ ప్రభుత్వ పెద్దలే మాట్లాడుతుంటే...ఇంకా మీ ప్రభుత్వం ఉండి ప్రయోజనమేంటనీ రాహుల్ గాంధీని కేటీఆర్ నిలదీశారు.

రహస్య కెమెరాల ఘటనపై

రెండు వారాల్లోగా నివేదిక ఇవ్వండి

సీఎస్, డీజీపీ ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఏపీ కళాశాలలో గర్ల్స్ హాస్టల్ వాష్‌రూమ్‌లలో రహస్య కెమెరాల ఘటనపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)కి జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) నోటీసులు ఇచ్చింది. రెండు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని సూచించింది. ఆంధ్రప్రదేశ్‌లోని కష్ణా జిల్లాలోని బాలికల హాస్టల్ వాష్‌రూమ్‌లలో రహస్య కెమెరాలు ఉన్నట్టు నివేదించబడిన సంఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సుమోటాగా పరిగణలోకి తీసుకుంది. మహిళల భద్రత, గౌరవ హక్కుపై తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేస్తూ, సీఎస్, డీజీపీకి నోటీసులు జారీ చేసింది.

ఛత్ర సమాజ్ నాయకుడు బెయిల్‌కు

వ్యతిరేకంగా బెంగాల్ పిటీషన్

తిరస్కరించిన సుప్రీం

న్యూఢిల్లీ : నబన్న అభిజన్ ర్యాలీ నిర్వహకుల్లో ఒకరు, ఛత్ర సమాజ్ నాయకుడు సయన్ లాహిరికి బెయిల్‌కు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ దాఖలు చేసిన పిటీషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. జస్టిస్ జెబి పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం బెంగాల్ ప్రభుత్వ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోలేదు. కొల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి వ్యతిరేకంగా ఆగస్టు 27న ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా డిమాండ్ చేస్తూ నబన్న అభిజన్ ర్యాలీ నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే ర్యాలీ హింసాత్మకంగా మారిందని, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేశారని, పోలీసులపై దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ ఆగస్టు 27 సాయంత్రం లాహిరిని అరెస్టు చేశారు. ఈ కేసులో ఆగస్టు 30న కొల్‌కతా హైకోర్టు లాహిరికి బెయిల్ మంజూరు చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ బెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది.

మణిపూర్‌లో కొనసాగుతున్న కూంబింగ్

ఇంఫాల్ : ఆదివారం ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో కౌత్రుక్ వద్ద జరిగిన దాడిలో ఇద్దరు మృతి చెందగా, మరో తొమ్మిది మంది గాయపడిన నేపథ్యంలో ఈ ప్రాంతంలో పోలీసులు భారీ ఎత్తున కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ దాడిలో పాల్గొన్నవారిని అరెస్టు చేయాలని, అలాగే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని డిజిపిని కమిషనర్ (హోం) ఎన్.అశోక్ కుమార్ ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే ఈ కూంబింగ్ జరుగుతోంది. పోలీసుల సమాచారం ప్రకారం ఆదివారం జరిపిన దాడిలో రాకెట్‌తో నడిచే గ్రెనేడ్లు, డ్రోన్లును సాయుధులు ఉపయోగించారు. ఈ దాడిలో అనేక ఇళ్లు కూడా ధ్వంసమైనట్లు పోలీసులు తెలిపారు. దాడిలో పేలుడు పదార్థాలను వినియోగించడానికి హైటెక్ డ్రోన్లను ఉపయోగించడం పోలీసుల్ని ఆందోళనకు గురి చేస్తోంది. ఆదివారం జరిగిన దాడిలో సాంకేతిక నైపుణ్యం, అత్యంత శిక్షణ పొందిన నిపుణుల భాగస్వామ్యాన్ని తోసిపుచ్చలేమని పోలీసులు అంటున్నారు. ఆదివారం కౌత్రుక్ గ్రామంలో డ్రోన్ల నుంచి కనీసం ఐదు బాంబులు పడినట్లు పోలీసులు తెలిపారు. డ్రోన్ల ద్వారా పేలుడు పదార్థాలను ఉపయోగించడం రాష్ట్రంలో కొత్తపద్ధతిగా పోలీసులు చెబుతున్నారు.

పెండింగ్‌లో సీబీఐ అవినీతి కేసులు

వివిధ కోర్టుల్లో విచారణలో ఉన్నవి 6900కు పైనే..!

- 20 ఏండ్లకు పైగా నడుస్తున్నవి 361
- సీవీసీ వార్షిక నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ : సీబీఐ దర్యాప్తు జరుపుతున్న 6900కు పైగా అవినీతి కేసులు దేశవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో 361 కేసులు 20 ఏండ్ల నుంచి నడుస్తున్నాయి. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) తాజా వార్షిక నివేదికలో ఈ విషయం వెల్లడైంది.

సీవీసీ నివేదిక సమాచారం ప్రకారం..గతేడాది డిసెంబర్ 31 నాటికిమొత్తం 6903 అవినీతి కేసులు కోర్టుల ముందు పెండింగ్‌లో ఉన్నాయి. 1379 కేసుల్లో మూడేండ్ల కంటే తక్కువ, 875 కేసులు మూడేండ్ల నుంచి ఐదేండ్ల వరకు, 2188 కేసులు ఐదేండ్ల నుంచి పదేండ్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. 2100 వరకు కేసులు పదేండ్లకుపై నుంచి 20 ఏండ్ల వరకు, 361 కేసులు 20 ఏండ్లకు పైగా కోర్టుల్లో విచారణలో ఉన్నాయి. సీబీఐ, నిందితుల ద్వారా దాఖలైన 12,773 అప్పీళ్లు, రివిజన్లు సుప్రీంకోర్టుతో పాటు దేశవ్యాప్తంగా పలు హైకోర్టులలో పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో 501 కేసులు 20 ఏండ్లకు పైగా, 1138 15 ఏండ్ల నుంచి 20 ఏండ్ల లోపు, 2558 కేసులు పదేండ్ల నుంచి 15 ఏండ్ల మధ్య, 3850 కేసులు ఐదు నుంచి పదేండ్ల మధ్య పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే, రెండేండ్ల నుంచి ఐదేండ్ల లోపు పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య 2172 కాగా, 2554 కేసులు రెండేండ్ల లోపు పెండింగ్‌ల ఉన్నాయి.

ఇక సీబీఐ వద్ద దర్యాప్తు దశలో 658 కేసులు పెండింగ్‌లో ఉండటం గమనార్హం. ఇందులో 48 ఐదేండ్లకు పైగా, 74 మూడేండ్ల నుంచి ఐదేండ్ల లోపు, 75 కేసులు రెండేండ్ల నుంచి మూడేండ్ల లోపు దర్యాప్తులో ఉన్నవే. అవినీతికి సంబంధించిన కేసులు విచారణ, దర్యాప్తు దశలలో న్యాయస్థానాలు, సీబీఐ వద్ద పెండింగ్‌లో ఉండటంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం సీబీఐలో కేటాయించిన ఉద్యోగుల సంఖ్య 7295 కంటే 1610 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతేడాది సమయంలో సీబీఐ 876 రెగ్యులర్(ప్రాథమిక దర్యాప్తులకు సంబంధించి)కేసులను నమోదు చేసింది. అలాగే, 552 అవినీతి కేసులను రిజిస్టర్ చేసంది. ఇందులో 674 మంది ప్రభుత్వ ఉద్యోగులు (వీరిలో 195 మంది గెజిటెడ్ అధికారులు) ఉన్నారు. గతేడాది నేర నిరూపణ రేటు 71.47 శాతంగా ఉన్నది. అంతకముందు ఏడాది ఇది 74.59 శాతంగా ఉండటం గమనార్హం.

సంపాదకీయం

యోగి కనుసన్నల్లో 'మీడియా'

'ఒక సమాచారం ఇవ్వడం వల్ల ఎక్కువ నష్టం జరుగుతుందా? లేక ఆ సమాచారాన్ని ఇవ్వకుండా నిషేధించటం వల్ల ఎక్కువ నష్టం జరుగుతుందా? అన్న ప్రశ్నలను వివేకంతో, విచక్షణతో బేరీజు వేసిన తరువాతనే మీడియాపై చర్యలకు పూనుకోవాలని అత్యున్నత న్యాయస్థానం బ్లూమ్‌బెర్గ్ వర్సస్ జీ ఎంటర్‌టైన్‌మెంట్స్ కేసులో స్పష్టం చేసింది. మీడియాపై కత్తి కట్టి వ్యవహరిస్తూ, పత్రికాస్వేచ్ఛను కర్కశంగా అణచి వేస్తున్న పాలకుల ఏలుబడిలో సుప్రీంకోర్టు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం హర్షణీయం. తాజాగా ఉత్తరప్రదేశ్‌లో యోగీ సర్కార్ తీసుకువచ్చిన 'మీడియా విధానం' సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉంది.

దేశంలో బ్రాడ్ కాస్టింగ్ తీసుకురావడం ద్వారా మీడియాపై ఆధిపత్యం చెలాయించాలనుకున్న మోడీ సర్కార్ బిల్లు తీసుకురావడానికి ప్రయత్నించింది. దానిపై తీవ్ర ప్రతిఘటన ఎదురుకావడంతో మోడీ ప్రభుత్వం ఆ బిల్లును పక్కన పెట్టింది. కానీ, యోగీ తమ రాష్ట్రం కోసం

జర్నలిస్టు కప్పన్‌పై ఉపా కేసు బనాయించి రెండేండ్లు జైల్లో ఉంచింది. సామాజిక కార్యకర్త దిశారవిని తీవ్రంగా వేధించింది. రైతు ఉద్యమ వార్తలను రాసినందుకు న్యూస్‌క్లిక్ సంపాదకుడు పుర్కాయస్తపై దేశద్రోహ కేసు బనాయించి, జైల్లో పెట్టింది. ప్రజల పక్షాన రాసిన, మాట్లాడిన అనేకమంది జర్నలిస్టులను, సామాజిక కార్యకర్తలను వెంటాడి వేధించటం, దాడులు చేయించటం, తీవ్రమైన కేసులు మోపటం వంటి కక్షపూరిత చర్యలతో భయోత్పాతం సృష్టించటం ఒక విధానంగా కొనసాగిస్తోంది. ఈ కుట్రపూరిత ఆచరణ వల్లనే ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే మనదేశం పత్రికాస్వేచ్ఛలో ప్రపంచంలో 161వ స్థానానికి దిగజారిపోయింది!

ప్రత్యేకంగా ఒక మీడియా విధానాన్ని రూపొందించారు. తమ ప్రభుత్వాన్ని పొగిడే వారికి నెలకు ఎనిమిది లక్షలదాకా వ్యాపార ప్రకటనల రూపంలో ఆదాయం వచ్చే దారి చూపిస్తారట. అదే వారి ప్రభుత్వంలో లోపాలను తెలియజేసే వారిపై చట్టరీత్యా చర్య తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఇది వారు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, విద్వేష పూరిత విధానాలను ఎండగట్టే వారిని సహించేదిలేదని హెచ్చరించడానికే రూపొందించిన విధానం.



ప్రజలకు అవసరమైన సమాచారాన్ని సేకరించటం, ప్రచురించటం, ప్రసారం చేయడం మీడియా బాధ్యత. ఇతరుల వ్యక్తిగత స్వేచ్ఛకు, గోప్యతకు భంగం వాటిల్లకుండా ఎక్కడ, ఏం జరుగుతుందో తెలుసుకోవడం ప్రజల హక్కు. ఈ హక్కులను తగిన విధంగా పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగాలది. పాలనలో పారదర్శకత, ప్రవర్తనలో ప్రజా విధేయత ఉన్న పాలక పక్షాల నుంచి దాపరికం లేని సమాచారాన్ని ఆశించవచ్చు. కానీ, అందుకు భిన్నంగా వ్యవహరించే ప్రభుత్వాల నుంచి, నిజాలను మాట్లాడితే సహించలేని పాలకుల నుంచి పచ్చి నిరంకుశ ధోరణులను ఎదుర్కోవల్సిన దుస్థితిలోకి నేడు మీడియా నెట్టివేయబడింది.

దృశ్య శ్రవ్య మాధ్యమాలకు తోడు డిజిటల్ మీడియా ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. పత్రికలు, ప్రసార సాధనాలు చాలావరకు ప్రభుత్వం గుప్పెట్లో బంధి అయి అధికార పక్షానికి బాకా వ్యవస్థలుగా మారిపోయాయి. మోడీ ప్రభుత్వ హయాంలో మన దేశంలో పత్రికాస్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ దారుణాతిదారుణంగా హరించుకు పోయాయి. కోట్ల రూపాయల పెట్టుబడులతో నడిచే ప్రధాన మీడియాపై బీజేపీ గట్టి నియంత్రణ సాధించింది. దాని ఏలుబడిలో ఎన్ని విధానపరమైన వైఫల్యాలు జరిగినా, ఎన్ని వ్యూహాత్మక విద్వేషాలు రగిలినా మీడియా నుంచి పొగడ్తలను, సమర్థింపులను మాత్రమే కోరుకుంటోంది. కొద్దిపాటి ప్రజాపక్ష మీడియా సంస్థలూ, కొంతమంది జనహిత జర్నలిస్టులూ వారి పాలనా వైఫల్యాలను, దుర్మార్గాలను గొంతెత్తి చెప్పబోతే దారుణమైన అణచివేతకు, వేధింపులకూ బరితెగిస్తోంది.

జర్నలిస్టు కప్పన్‌పై ఉపా కేసు బనాయించి రెండేండ్లు జైల్లో ఉంచింది. సామాజిక కార్యకర్త దిశారవిని తీవ్రంగా వేధించింది. రైతు ఉద్యమ వార్తలను రాసినందుకు న్యూస్‌క్లిక్ సంపాదకుడు పుర్కాయస్తపై దేశద్రోహ కేసు బనాయించి, జైల్లో పెట్టింది. ప్రజల పక్షాన రాసిన, మాట్లాడిన అనేకమంది జర్నలిస్టులను, సామాజిక కార్యకర్తలను వెంటాడి వేధించటం, దాడులు చేయించటం, తీవ్రమైన కేసులు మోపటం వంటి కక్షపూరిత చర్యలతో భయోత్పాతం సృష్టించటం ఒక విధానంగా కొనసాగిస్తోంది. ఈ కుట్రపూరిత ఆచరణ వల్లనే ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే మనదేశం పత్రికాస్వేచ్ఛలో ప్రపంచంలో 161వ స్థానానికి దిగజారిపోయింది!

అయినా తగ్గేదే లేదన్నట్టు యోగీ సర్కార్ ప్రభుత్వ వ్యతిరేక డిజిటల్ మీడియాను కట్టడి చేయడానికి నూతన డిజిటల్ మీడియా విధానాన్ని తెర మీదకు తెచ్చింది. దీనికి యోగి కొలమానాలూ సైతం నిర్దేశించారు. వెరసి యోగీ ప్రభుత్వం "సంఘ వ్యతిరేక", "జాతి వ్యతిరేక" ప్రచారం చేసే వారిని చట్ట రీత్యా శిక్షిస్తారు. ఇది కచ్చితంగా భావ ప్రకటనా స్వేచ్ఛను కట్టడి చేయడమే. గుణ దోష నివారణ ప్రభుత్వాల గుప్పెట్లో ఉండటం అత్యంత ప్రమాదకరం. భావ ప్రకటన, పత్రికాస్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు. దానిని కఠినంగా తొక్కిపెట్టాలనుకోవడం నియంతృత్వానికి దారి తీస్తుంది. పీటీఐ వార్షికోత్సవంలో 'మీడియా ఒత్తిడులకు లొంగకుండా, ఎవరికీ భయపడకుండా ధైర్యంగా ప్రజలకు నిజాలు తెలియజేయాలి. దేశాన్ని, సమాజాన్ని తీర్చిదిద్దడంలో ఫోర్త్ ఎస్టేట్ ది కీలక పాత్ర' అన్న రాష్ట్రపతి మాటలకు యోగీ సర్కార్ చేతలతో విలువ లేకుండా చేసింది. హిట్లర్ తదితర నియంతలు ఇలాంటి అణచివేత చర్యలకే పాల్పడి, చరిత్ర హీనులుగా మిగిలిపోయారు. ఈ పాలకులు కూడా ఆ దిశగానే పరుగులు పెడుతున్నారు.

ఏకపక్ష ఆంక్షలు నేరం



ప్రభాత్ పట్నాయక్

పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలు తమ ఆదేశాలను ఖాతరు చేయని దేశాలపై విధించే ఆంక్షలనే మనం ఇక్కడ ఏకపక్ష ఆంక్షలు అంటున్నాం. వీటికి ఐక్య రాజ్య సమితి ఆమోదం ఎంత మాత్రమూ లేదు. అన్ని దేశాలకూ ఉమ్మడి వేదికగా ఉన్న ఐరాస ఆమోదంతో ఎప్పుడైనా, ఏ దేశం మీదనైనా ఆంక్షలు విధిస్తే వాటి సంగతి వేరు. అప్పుడు ప్రపంచ ప్రయోజనాలు మొత్తంగా పరిగణన లోకి తీసుకునే వీలుంటుంది. కాని ఈ ఏకపక్ష ఆంక్షలు వేరు. సామ్రాజ్యవాద దేశాల ఆదేశాలను వ్యతిరేకించినందుకు క్యూబా నుంచి వెనిజులా వరకు, సిరియా నుండి లిబియా వరకు పలు దేశాలు ఈ విధమైన ఏకపక్ష ఆంక్షలకు లోను కావలసి వచ్చింది. ఈ ఏకపక్ష ఆంక్షలకు అనుగుణంగా నడుచుకోవడం అంటే మన దేశం కూడా సామ్రాజ్యవాద దేశాల దూకుడుకు, దానిలో భాగంగా అమలు చేసే కుట్రలకు ఆమోదం వేసినట్టే అవుతుంది.

ఈ మధ్య ప్రధాని మోడీ ఉక్రెయిన్‌లో పర్యటించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎందుకు ఈ పర్యటన తలపెట్టారన్నది ఒక నిగూఢ రహస్యమే. రష్యా నుండి ఎవరూ చమురు కొనుగోలు చేయరాదంటూ సామ్రాజ్యవాద దేశాలు విధించిన ఆంక్షలను పక్కన పెట్టి భారతదేశం ఇంతవరకూ రష్యా నుండి ముడి చమురు, సహజ వాయువు కొనుగోలు చేస్తోంది. ఈ పర్యటన సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ రష్యా నుండి ముడి చమురు కొనుగోలు చేయవద్దని, సామ్రాజ్యవాద దేశాల ఆంక్షలకు అనుగుణంగా వ్యవహరించాలని మోడీని కోరారు.

ఇలా మన ప్రధానిని కోరుతున్న వ్యక్తి ఎటువంటివాడు? రెండో ప్రపంచ యుద్ధంలో (అప్పుడు ఉక్రెయిన్ సోవియట్ రష్యాలో అంతర్భాగం) నాజీ జర్మనీకి ఏజెంటుగా వ్యవహరించి స్వంత దేశానికే ద్రోహం తలపెట్టిన స్టెపాన్ బండెరా వంటి పరమ నీచుల మద్దతుతో ఉక్రెయిన్‌ను అతగాడు పాలిస్తున్నాడు. పోనీ, ఆ సంగతి పక్కన పెడదాం. బుష్ హయాంలో గోర్బచేవ్‌తో కుదిరిన అంగీకారం ప్రకారం నాటో తూర్పు వైపుగా, అంటే రష్యా వైపుగా విస్తరించ కూడదు. అదే మాదిరిగా ఉక్రెయిన్ విడిపోయినప్పుడు రష్యా-ఉక్రెయిన్ దేశాల నడుమ మిన్స్క్ ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందాన్ని ఉక్రెయిన్ ఏకపక్షంగా ఉల్లంఘిం చింది. బ్రిటన్, అమెరికా దేశాలు ఉక్రెయిన్‌లో తమ కీలు బొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఆ ప్రభుత్వం ద్వారా ఈ ఉల్లంఘన జరిగేట్టు చేశాయి. ఆ ఒప్పందానికే గనుక ఉక్రెయిన్ కట్టుబడి వుంటే ఈ యుద్ధమే జరిగేది కాదు. పోనీ, ఆ విషయాన్నీ పక్కన పెడదాం. భారతదేశం తన స్వప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తోంది. తద్వారా మన దేశం సామ్రాజ్య వాదులు విధించిన ఆంక్షలను పక్కన పెట్టినట్టయింది. దీనినీ పక్కన పెడదాం. అసలు ఈ "ఏకపక్ష" ఆంక్షలకు ఉన్న నైతికత ఏమిటో చర్చిద్దాం.

పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలు తమ ఆదేశాలను ఖాతరు చేయని దేశాలపై విధించే ఆంక్షలనే మనం ఇక్కడ ఏకపక్ష ఆంక్షలు అంటున్నాం. వీటికి ఐక్య రాజ్య సమితి ఆమోదం ఎంత మాత్రమూ లేదు. అన్ని దేశాలకూ ఉమ్మడి వేదికగా ఉన్న ఐరాస ఆమోదంతో ఎప్పుడైనా, ఏ దేశం మీదనైనా ఆంక్షలు విధిస్తే వాటి సంగతి వేరు. అప్పుడు ప్రపంచ ప్రయోజనాలు మొత్తంగా పరిగణన లోకి తీసుకునే వీలుంటుంది. కాని ఈ ఏకపక్ష ఆంక్షలు వేరు. సామ్రాజ్యవాద దేశాల ఆదేశాలను వ్యతిరేకించి నందుకు క్యూబా నుంచి వెనిజులా వరకు, సిరియా నుండి లిబియా వరకు పలు దేశాలు ఈ విధమైన ఏకపక్ష ఆంక్షలకు లోను కావలసి వచ్చింది. ఈ ఏకపక్ష ఆంక్షలకు అనుగుణంగా నడుచుకోవడం అంటే మన దేశం కూడా సామ్రాజ్యవాద దేశాల దూకుడుకు, దానిలో భాగంగా అమలు చేసే కుట్రలకు ఆమోదం వేసినట్టే అవుతుంది.



ఈ ఏకపక్ష ఆంక్షలకుండే ప్రత్యేక లక్షణం: అవి ప్రజలను దెబ్బ తీస్తాయి. నిజంగానే ఈ తరహా ఆంక్షలు ప్రజలను దెబ్బ తీయడానికే ఉద్దేశించ బడినటు వంటివి. ఎంత బలంగా అవి ప్రజలను దెబ్బ తీస్తాయో అంతబాగా ఈ ఆంక్షలు అమలు జరిగినట్టు లెక్క. యుద్ధ సమయంలో సాధారణ పౌరులమీద బాంబుదాడులు చేయకూడదు. కాని కొన్ని సార్లు బాంబు దాడులు జరుగు తూంటాయి (ప్రస్తు తం గాజాలో మాది రిగా). అప్పుడు సాధారణ ప్రజానీ కాన్ని మూకుమ్మడిగా శిక్షించడానికి పూనుకున్నట్టే లెక్క. అదే మాదిరిగా ఈ ఆంక్షలు కూడా సామాన్య ప్రజలను, వారు చేసిన నేరం ఏమీ లేకపోయినా, శిక్షిస్తాయి. నాల్గవ జెనీవా సదస్సు తీర్మానం లోని 33వ అధికరణం ప్రకారం ఆవిధంగా చేయడం యుద్ధ నేరంగా పరిగణించబడుతుంది. అదే మోతాదు ప్రభావాన్ని ప్రజల మీద కలిగించే ఆంక్షలు కూడా యుద్ధ నేరంతో సమానమే. ఇప్పుడు జెలెన్‌స్కీ ఆ నేరాన్నే చేయమని మన దేశాన్ని మోడీ ద్వారా అడుగు తున్నాడు! ఈ ఆంక్షలు రష్యా దేశ ప్రజలను ఎంతవరకూ దెబ్బ తీశాయన్నది ఇక్కడ అప్రస్తుతం. ఆంక్షల వెనుక లక్ష్యమే ఇక్కడ ప్రధానం. ఆ లక్ష్యం యుద్ధ నేరానికి పాల్పడిన దానితో సమానం.

ఆ దేశం తప్పు చేసింది కాబట్టే మేం ఆంక్షలు విధించాం అంటున్నది సామ్రాజ్యవాదం. తమ చర్యను ఈ విధంగా సమర్థిం చుకోవడం వెనుక న్యాయబద్ధత ఏమీ లేదు. ఆంక్షలకు గురైన దేశంలోని ప్రభుత్వం ఆ దేశపు ప్రజానీకపు మద్దతుతో నడిచేదే ఐతే, అప్పుడు ఈ ఆంక్షలు ఒక ప్రజామోదం పొందిన ప్రభుత్వపు సార్వభౌమాధికారాన్ని దెబ్బ తీసినట్టు అవుతుంది. వారిని సమిష్టిగా శిక్షించినట్టు అవుతుంది. అందుచేత ఇది సామాన్య పౌరులను బాంబు దాడులతో మూకుమ్మడిగా చంపడం వంటి యుద్ధ నేరంతో సమానమే.

నిజానికి ఈ ఆంక్షల ప్రభావం పౌరుల మీద జరిపే బాంబు దాడులు కలిగించే ప్రభావం కన్నా ఎక్కువ. బాంబు దాడులు ఎటువంటి మిలిటరీ లక్ష్యమూ లేకుండా, సామాన్య పౌరుల మీద జరుగుతాయి. అయితే వాటి ప్రభావం ఆ దాడులు జరిగిన ప్రాంతం మీదనే పడుతుంది. కాని ఆంక్షల ప్రభావం ఒక దేశ ప్రజానీకం మొత్తం మీద పడుతుంది. బాంబు దాడుల నుండి తప్పించుకోడానికి వేరే ప్రదేశానికి తరలిపోవచ్చు. కాని ఆ దేశంలో ఎక్కడినుంచి ఎక్కడికి తరలిపో యినా, ఆంక్షల నుండి తప్పించుకోలేం. రెండవది: బాంబు దాడులు కొద్ది పరిమిత కాలం పాటే సాగుతాయి. కాని ఈ ఆంక్షలు అలా నిరవధికంగా కొనసాగుతూనే వుంటాయి. క్యూబానే తీసుకోండి. ఆ దేశం మీద ఆంక్షలు కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. ఇరాన్ మీద కూడా అదే విధంగా కొనసాగుతున్నాయి. మూడవది: బాంబు దాడులవలన సంభవించే మరణాల కన్నా ఆంక్షల వలన మరణించేవారు ఎక్కువగా ఉంటారు. ఆంక్షలకు గురయ్యే దేశాల ప్రజానీకానికి ఆహారం, ఔషధాలు సరఫరా జరగకు ండా నిషేధించినందు వలన జరిగే మరణాలు చాలా ఎక్కువ. ఇప్పటి దాకా ఆంక్షలకు గురైన దేశాలన్నీ దాదాపుగా ఆహార కొరతను, ఔషధాల కొరతను చవిచూశా యి. నాలుగవది: ఈ కారణం గానే ఆంక్షలు ప్రత్యేకించి వృద్ధుల మీద, చిన్న పిల్లల మీద, గర్భవతుల మీద ఎక్కువ హానికర ప్రభావాన్ని చూపిస్తాయి. మామూలుగా యుద్ధ సమయాల్లో ఈ తరగతుల ప్రజానీకాన్ని లక్ష్యంగా చేసుకోకూడదు. కాని ఈ ఆంక్షలు వారినే ముఖ్య లక్ష్యంగా చేసుకుంటాయి.

ఈ విధంగా ఆంక్షలకు గురయ్యే దేశాలలో ఆ ఆంక్షలను తట్టుకుని నిలబడి తమ ప్రజానీకానికి కావలసిన ఆహారాన్ని, ఔషధాలను, ఇతర అవసరాలను అందించడానికి పూనుకునే సత్తా ఉన్నవి కొన్ని ఉండవచ్చు. కాని వాటిని వేరే ఇతర మార్గాల్లో సేకరించవలసి వస్తుంది. అప్పుడు దాని ఫలితంగా ఆ దేశాలలో ద్రవ్యోల్బణం బాగా పెరిగిపోతుంది. అప్పుడు ఆ ఆహారం గాని, ఔషధాలు గాని చాలా మందికి అందుబాటులో లేకుండా పోతాయి. ఈ విధంగా ధరలు పెరగడానికి రెండు కారణాలు ఉంటాయి. మొదటిది: ప్రజలందరి అవసరాలనూ తీర్చగలిగేం తగా ఆ అత్యవసర సరుకులను అందించడం ఆంక్షల నేపథ్యంలో సాధ్యపడదు. అందుచేత వాటికి కొరత ఏర్పడి, ధరలు పెరుగుతాయి. రెండవది: ఆంక్షల ఫలితంగా ఆ దేశపు కరెన్సీ మారకపు రేటు పడిపోతుంది. అప్పుడు దిగుమతులకు చెల్లించే విదేశీ మారకపు ద్రవ్యం విలువ పెరుగుతుంది. దాని ఫలితంగా ధరలు పెరుగుతాయి. పైగా, ఆ దేశంలోకి విదేశీ పెట్టుబడుల రాక దాదాపు నిలిచిపోతుంది. దానివలన కూడా విదేశీ మారకపు ద్రవ్యంలోటు పెరుగుతుంది. పైగా ఆ దేశపు విదేశీ మారకపు నిల్వ లు ఏదైనా విదేశీ బ్యాంకుల్లో దాచివుంటే ఆ బ్యాంకులు ఈ ఆంక్షల కారణంగా ఆ ఖాతాలను స్తంభిం పజేస్తాయి. అందుచేత కొన్ని మిత్ర దేశాలు తోడుగా నిలిచినప్పటికీ, ఆంక్షలు ఆ దేశఆర్థిక వ్యవస్థ ను, ముఖ్యంగా సామాన్య ప్రజానీకాన్ని దారుణంగా దెబ్బ తీస్తాయి.

దీన్నిబట్టి ఆంక్షలు విధించడం అంటే అది ప్రచ్ఛన్న యుద్ధం సాగించడమే. అంతే కాదు, ప్రత్యక్ష యుద్ధం కన్నా ఎక్కువ ప్రమాదకరం. కాని పైకి అలా కనపడదు. ఆంక్షల ఫలితంగా ఆస్పత్రులలో అవసరమైన ఔషధాలు లభించక మరణించేవారి సంఖ్య పెరిగిపోతుంది. సరైన తిండి లేక మరణించేవారి సంఖ్య పెరుగుతుంది. లేదా, జబ్బుల పాలయేవారి సంఖ్య పెరిగిపో తుంది. కాని ఈ ప్రభావం యుద్ధంలో బాంబు దాడుల వలన మరణాలు సంభవించినట్టుగా కొట్టొచ్చినట్టు కనిపించదు. ఈ పరిస్థితులన్నీ ఇప్పుడు రష్యాలో నెలకొన్నాయని చెప్పలేం. రష్యా ఈ ఆంక్షలను తట్టుకోగలుగుతోంది. సోవియట్ యూనియన్ కాలం నుండీ అందివచ్చిన వారసత్వంగా రష్యాకు అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థఉంది. నిజానికి సామ్రాజ్యవాద దేశాలు ఒక అభివృద్ధి చెందిన దేశం మీద ఆంక్షలు విధించినది తొలిసారిగా రష్యా పైనే. బలహీనంగా ఉండే మూడవ ప్రపంచదేశాల కన్నా రష్యా ఈ ఆంక్షలను తట్టు కోగలుగుతోంది. పైగా ఏకకాలంలో పలు దేశామీద ఆంక్షలు కొనసాగుతున్నాయి. దీని వలన ఆ ఆంక్షల ప్రభావం పలుచనైపోతోంది.

అయితే, ఈ కారణాల రీత్యా ఆంక్షలను తక్కువ చేసి చూడనక్కరలేదు. ఈ ఆంక్షలు మూడవ ప్రపంచ దేశాల ప్రజల మీద ప్రయోగించడానికి సామ్రాజ్యవాదులు సిద్ధం చేసివుంచు కున్న ఒక అత్యంత ప్రమాదకర ఆయుధం. ఈ విధంగా ఏకపక్షంగా ఆంక్షలను విధించడాన్ని ఐరాస నిషేధించాల్సిందే. ఐతే, అటువంటి నిషేధాలేవీ ఐరాస భద్రతా మండలి ఆమోదం లేకుండా అమలు లోకి రావన్నది తెలిసినదే. ఐనప్పటికీ, ఐరాస ఆంక్షలను నిషేధించడం అనేది ఒక నైతిక బలాన్ని బాధిత దేశాలకు సమకూరుస్తుంది. భారత దేశాన్ని రష్యా మీద జరిగే ఆర్థిక యుద్ధంలో చురుకైన భాగస్వామిగా మార్చాలన్నదే జెలెన్‌స్కీ ప్రతిపాదన సారాంశం. ఇది యుద్ధ నేరానికి తోడ్పడటం కన్నా తక్కువేమీ కాదు.

(స్వేచ్ఛానుసరణ)

అయితే, ఈ కారణాల రీత్యా ఆంక్షలను తక్కువ చేసి చూడనక్కరలేదు. ఈ ఆంక్షలు మూడవ ప్రపంచ దేశాల ప్రజల మీద ప్రయోగించడానికి సామ్రాజ్యవాదులు సిద్ధం చేసివుంచుకున్న ఒక అత్యంత ప్రమాదకర ఆయుధం. ఈ విధంగా ఏకపక్షంగా ఆంక్షలను విధించడాన్ని ఐరాస నిషేధించాల్సిందే. ఐతే, అటువంటి నిషేధాలేవీ ఐరాస భద్రతా మండలి ఆమోదం లేకుండా అమలు లోకి రావన్నది తెలిసినదే. ఐనప్పటికీ, ఐరాస ఆంక్షలను నిషేధించడం అనేది ఒక నైతిక బలాన్ని బాధిత దేశాలకు సమకూరుస్తుంది. భారత దేశాన్ని రష్యా మీద జరిగే ఆర్థిక యుద్ధంలో చురుకైన భాగస్వామిగా మార్చాలన్నదే జెలెన్‌స్కీ ప్రతిపాదన సారాంశం. ఇది యుద్ధ నేరానికి తోడ్పడటం కన్నా తక్కువేమీ కాదు.

బీమాపై జీఎస్టీ- బీజేపీ విన్యాసాలు

దేశవ్యాప్తంగా ఏఐఐఈఏ (అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం)కి చెందిన యూనిట్లు దాదాపు 300 మంది పార్లమెంట్ సభ్యులను కలిసి బీమా రంగంపై జీఎస్టీ భారాన్ని తగ్గించమని వినతి పత్రాలు అందజేశాయి. ఈ ఏడాది యూనియన్ బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా దీనిపై చర్చించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌ను విపక్షాలు పట్టుబట్టాయి. అయితే దీనికి సమాధానం చెప్పకపోగా కేంద్రం వ్యూహాత్మక మౌనం పాటించింది. నేటికీ ఒక నిర్ణయంగానీ, పరిష్కార మార్గంగానీ లభించలేదు. బీమా ప్రీమియంపై 18 శాతం పన్ను విధించడాన్ని వ్యతిరేకిస్తూ గత ఏడేండ్లుగా (ఏఐఐఈఏ) స్ఫూర్తిదాయక పోరాటాన్ని కొనసాగిస్తున్నది. బీమా రంగంలో జీఎస్టీ భారాన్ని తగ్గించాలని ఉద్యోగులు, ఏజెంట్లతో కలిసి దేశవ్యాప్తంగా 46 లక్షల పాలసీదారుల చేత ఆ నాటి ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీకి లేఖలు రాయించింది. దాదాపు 400 మంది పార్లమెంట్ సభ్యులను కలిసి వినతి పత్రాలను అందజేసింది. అనేక రాష్ట్రాలలో ఉన్న ఆర్థిక మంత్రులను కలిసి ఈ అంశాన్ని జీఎస్టీ కౌన్సిల్‌లో చేపట్టమని అభ్యర్థించింది.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు యూనియన్ తరపున వినతి పత్రాలు సమర్పించింది. కేరళ, తమిళనాడు



ఆర్థిక మంత్రులు జీఎస్టీ కౌన్సిల్‌లో ఈ అంశాన్ని లేవనెత్తే ప్రయత్నం చేసినా దానికి కేంద్రం అంగీకరించలేదు. గత పార్లమెంట్‌లోనూ, ప్రస్తుత పార్లమెంట్‌లోనూ అనేకమంది పార్లమెంట్ సభ్యులు ఈ అంశాన్ని ప్రస్తావించినా, జీఎస్టీ కౌన్సిల్‌లో కేంద్ర అనుమతి లేకుండా ఏ ప్రతిపాదన ఆమోదం పొందే అవకాశం లేకపోవడంతో ఈ అంశం అపరిష్కృతంగానే ఉంది.

బీమా రంగాన్ని ప్రోత్సహించాలి

ఆహారం, దుస్తులు, నివాసం తర్వాత, సామాజిక భద్రత ప్రజలకు ముఖ్యమైన అవసరం. సార్వత్రిక భద్రత లోపించిన మన దేశంలో బీమా రంగం ప్రజలకు సామాజిక భద్రత అందించే ముఖ్యమైన సాధనం. కనుక, కేంద్రమే బీమారంగాన్ని ప్రోత్సహించాలి. పన్ను రాయితీలు ఇవ్వడం ద్వారా బీమా పథకాల ద్వారా పొదుపును ప్రోత్సహించాలి. అప్పుడు మాత్రమే బీమా పాలసీలను కొనుగోలు చేయడానికి బీమా చేయదగిన ప్రజలు ఆకర్షితులవుతారు. ఇది దేశంలో ఎక్కువ బీమా వ్యాప్తికి సహాయ పడుతుంది. పాలసీదారు అకాల మరణం సంభవించినప్పుడు అతని కుటుంబానికి అవసరమైన ఆర్థిక భద్రతను అందించడమే కాకుండా, దేశ నిర్మాణ కార్యకలాపాల కోసం ప్రజల దీర్ఘకాలిక పొదుపును పెట్టుబడి పెట్టడంలో ప్రభుత్వానికి సహాయం చేస్తుంది.జీవిత బీమా ఉత్పత్తులపై జీఎస్టీని నిర్ణయించేటప్పుడు ప్రభుత్వం ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుంటుందని అందరూ భావించారు. జీవిత బీమా ఉత్పత్తులు, ప్రీమియంలపై అంత పెద్ద మొత్తంలో జీఎస్టీ విధించడం పాలసీదారులపై భారం మోపడమే అవుతుంది. అంతేగాక వారి పొదుపును నిరుత్సాహ పరుస్తుంది. బీమా పరిశ్రమ వృద్ధికి ఇది ప్రతిబంధకంగా మారుతున్నది. దేశంలో అందరికీ సామాజిక భద్రత లేని పరిస్థితుల్లో, బీమా చేయించుకోవడం తప్పనిసరి అవుతుంది. అన్ని నిత్యావసర వస్తువులు, సేవలు జీఎస్టీ పరిధిలోంచి తప్పిస్తున్న నేపథ్యంలో, బీమా ప్రీమియంపై ఇంత పన్ను భారం మోపడం సహేతుకంగా లేదని ఐఆర్‌డిఏ (బీమా నియంత్రణ సంస్థ) పూర్వ సభ్యులు నీలేష్ సాఠే అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో ఏ దేశంలో కూడా బీమా ప్రీమియం మీద ఇంత పన్ను వేయట్లేదని, యాన్యుటీ పాలసీలపై కూడా ఇంత పన్ను భారమా అని నీలేష్ సాఠే వాపోయారు.విలాస వస్తువులైన బంగారంపై 3 శాతం, నగిషీ చెక్కిన డైమండ్లపై 0.25 శాతం పన్ను విధిస్తూ, ప్రాణాధార మందులు, ప్రాణ వాయువుపై 12 నుండి 18 శాతం జీఎస్టీ భారమా?ప్రజలకు సామాజిక భద్రత, ఆరోగ్య బీమా సేవలు అందిస్తున్న బీమా రంగంపై 18 శాతం జీఎస్టీనా? ప్రపంచంలో ఏ దేశంలో కూడా సామాజిక భద్రతపై 18 జీఎస్టీ పన్ను లేదు. ప్రజల పొదుపుపై అధిక జీఎస్టీ విధించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి!

దేశ ఆర్థిక వ్యవస్థలో ఎల్ఐసిది కీలకపాత్ర

31 మార్చి 2023 నాటికి ఎల్ఐసి మన దేశ ఆర్థిక వ్యవస్థలో రూ.43,97,204.59 కోట్ల పెట్టుబడులు పెట్టింది. ఇందులో రూ. 31,37,315 కోట్ల నిధులను కేంద్ర, రాష్ట్ర సెక్యూరిటీలలో, హౌసింగ్, నీటిపారుదల సౌకర్యాల కల్పన కోసం ఎల్ఐసి కేటాయించింది. దేశీయ బీమా రంగంలో ప్రయివేటు బీమా కంపెనీల ప్రవేశం జరిగి 24 ఏండ్లయినా, ఎల్ఐసి ప్రీమియమ్ ఆదాయంలో దాదాపు 60 శాతం మార్కెట్ వాటా, పాలసీలలో 72 శాతం మార్కెట్ వాటాతో ఇప్పటికీ మార్కెట్ లీడర్‌గా ముందుకు సాగుతోంది. ఎల్ఐసి ద్వారానే కేంద్ర ప్రభుత్వానికి ఏటా లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు అందుతున్నాయి. ప్రభుత్వ అంతర్గత నిధుల సమీకరణలో ఎల్ఐసి వాటా 25 శాతం పైబడి ఉంది.'స్విస్ రే' సంస్థ అంచనాల ప్రకారం 2032 నాటికి భారత్ ప్రపంచంలో ఆరవ అతి పెద్ద బీమా మార్కెట్‌గా ఎదగనుంది. 2021లో కోవిడ్ మహమ్మారి దెబ్బకు మన దేశంలో 22.5 శాతం ఆరోగ్య బీమా ప్రీమియమ్‌లు అధికమయ్యాయి. 2022లో ఆర్థిక వ్యవస్థ కోవిడ్ తదనంతర పరిస్థితుల నుంచి కోలుకున్నాక, మోటార్ ప్రీమియమ్‌లు సైతం దాదాపు 2.9 శాతం పైబడి పెరిగాయి. మరి ఆరోగ్య బీమాపై, థర్డ్ పార్టీ ప్రీమియంపై 18 శాతం పన్ను భారం మోపడం, ప్రజలు తమకు తాము కల్పించుకునే సామాజిక భద్రతపై భారం వేయడం కాదా!! ఇప్పటికైనా మోడీ, బీజేపీ అండ్ కో బీమాపై విధించిన జీఎస్టీ విషయమై చేస్తున్న విన్యాసాలు, ఆడుతున్న నాటకాలు మానుకోవాలి. జీఎస్టీ భారాన్ని తగ్గించాలి. ప్రభుత్వ బీమా రంగాన్ని ప్రోత్సహించాలి.

- పి.సతీష్, 9441797900

కంగనా నోటిదురుసు- బీజేపీ కంగారు

నోటి దురుసు సెలబ్రిటీగా పేరు మోసిన నటి కంగనా రనౌత్ ఇందిరాగాంధీ పాత్రలో నటించి, దర్శకురాలిగా ఉన్న 'ఎమర్జెన్సీ' సినిమా బీజేపీకి తలనొప్పిగా మారింది. చరిత్రను వక్రీకరించటమే గాక తమను దేశద్రోహులు, ఉగ్రవాదులుగా చిత్రీకరించారని, అది తమపై విద్వేషాన్ని రెచ్చగొట్టే అవకాశం ఉన్నందున ఆ చిత్రంపై నిషేధం విధిం చాలంటూ దేశవ్యాపితంగా సిక్కులు డిమాండ్ చేస్తున్నారు. ఖలిస్తాన్ మద్దతుదార్లు కంగనాను చంపివేస్తామంటూ బెదిరింపులకు దిగారని వార్తలు. దీంతో ఈనెల ఆరున విడుదల తేదీని ప్రకటించిన కంగనా ఇప్పుడు దానికి సెన్సార్ బోర్డు ఆమోదం తెలిపినా కొందరి ఒత్తిడి కారణంగా ధృవీకరణ పత్రం నిలిపివేశారని చెబుతున్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జీవితం, ఆమె ప్రధానిగా ఉన్నపుడు 21 నెలల అత్యవసర పరిస్థితి విధింపు తదితర అంశాల ఆధారంగా ఈ సినిమా తీసినట్లు గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆగస్టు 14వ తేదీన ట్రైలర్‌ను విడుదల చేయగా 50 లక్షల మంది చూశారని, కేవలం 461 మంది మాత్రమే ఇష్టపడి నట్లు నమోదైనట్లు 'ఇండియాటుడే' పేర్కొన్నది. ప్రతి ఒక్క ఓటునూ లెక్కించుకుంటున్న బీజేపీ ఇప్పటికే దేశంలో ఉన్న మూడు కోట్ల మంది సిక్కులు వ్యతి రేకంగా ఉన్నారు. ఈ సినిమాతో వారు మరింత దూరమౌతారని, పక్కా వ్యతిరేకులుగా మారతారని ఆ పార్టీ భయపడు తోంది. అక్టోబరులో జరిగే హర్యా నా, కాశ్మీరు ఎన్నికలపై ప్రతికూల ప్రభావం పడు తుందని భావిస్తున్నారు. గతంలో బీజేపీ మిత్ర పక్షంగా ఉన్న అకాలీదళ్ కూడా అదే డిమాండ్ చేసింది.

బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ వివాదాస్పద వ్యాఖ్యలకు పేరుమోసిన సంగతి తెలిసిందే. రైతుల గురించి నోరుపారవేసుకున్న ఉదంతం సమసిపోక మందే కులగణన గురించి చేసిన వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని బీజేపీ చెప్పుకుంది. ఆ పార్టీలో ఇలాంటి వారికి కొదవలేదు. అవి పార్టీ కొంప ముంచుతున్నాయి. ఆగస్టు చివరి వారంలో దైనిక్ భాస్కర్ అనే పత్రికతో మాట్లాడిన కంగన 2020-21లో జరిగిన రైతు ఉద్యమం గురించి నోరు పారవేసుకున్నారు. ఆ సందర్భంగా మృతదేహాలు వేలాడాయని, మానభంగాలు జరిగాయని ఆరోపించారు. రైతు ఉద్యమం జరిగిన హర్యానాలో లోక్‌సభ ఎన్నికల్లో పదికి గాను ఐదు సీట్లు పోగొట్టుకున్న బీజేపీ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దూరం కానుందనే భయంతో ఉంది. సరిగ్గా ఈ తరుణంలో ఆమె చేసిన వ్యాఖ్యలు హర్యానా రైతాంగాన్ని మరింతగా రెచ్చగొట్టేవే. పార్టీకి నష్టం కలిగిస్తాయని హర్యానా పార్టీ నేతలు గగ్గోలు పెట్టారు. దాంతో కేంద్ర బీజేపీ వెంటనే కంగనామాటలతో పార్టీకి సంబంధం లేదని చెప్పుకుందే, తప్ప కనీసంగా ఆమెను మందలించలేదు. బంగ్లాదేశ్‌లో మాదిరి పరిస్థితిని భారత్‌లో సృష్టించే పథకం ఉందని, రైతుల నిరసనల వెనుక చైనా, అమెరికా హస్తం ఉందని కూడా అంతకు ముందు ఆరోపించారు. పార్టీ విధానాల గురించి ప్రకటనలు చేసేందుకు కంగనా రనౌత్‌కు అధికారం లేదా అనుమతి ఇవ్వలేదని, భవిష్యత్‌లో అలాంటి ప్రకటనలు చేయకూడదని కోరినట్లు బీజేపీ ప్రకటించింది. తాను నటించిన ఎమర్జెన్సీ సినిమా గురించి ప్రచారం చేసుకొనేందుకు దైనిక భాస్కర్ పత్రికతో మాట్లాడినపుడు ఈ వ్యాఖ్యలు చేశారు. అందరూ వాటిని ఎక్కడ చదవరనో లేదా మరింత ప్రచారం కోసమో సదరు పత్రిక వార్తను తన 'ఎక్స్' ఖాతాలో ఆగస్టు 25న పోస్టు కూడా చేశారు. లోక్‌సభ ఎన్నికల పుడు హర్యానా మాజీ ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను బీజేపీ తరఫున గ్రామాల్లో ప్రచారానికి అక్కడి రైతులు రానివ్వని ఉదంతాలను చూసిన బీజేపీ నేతలు కంగన మాటలతో తమ పని అయిపోయినట్లే భావించారు. నష్ట నివారణ చర్య తీసుకున్నప్పటికీ కంగన మాటలు రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ఒక అస్త్రంగా మారటం అనివార్యం. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఒక తీర్మానం కూడా చేసింది. రెండవసారి శంభు సరిహద్దులో ఆందోళన ప్రారంభించి రెండు వందల రోజుల సందర్భంగా జరిగే నిరసనకు రెజ్లర్ వినేష్ ఫోగట్ రానున్నట్లు వార్తలు.



ఆగస్టు చివరి వారంలో దైనిక్ భాస్కర్ అనే పత్రికతో మాట్లాడిన కంగన 2020-21లో జరిగిన రైతు ఉద్యమం గురించి నోరు పారవేసుకున్నారు. ఆ సందర్భంగా మృతదేహాలు వేలాడాయని, మానభంగాలు జరిగాయని ఆరోపించారు. రైతు ఉద్యమం జరిగిన హర్యానాలో లోక్‌సభ ఎన్నికల్లో పదికి గాను ఐదు సీట్లు పోగొట్టుకున్న బీజేపీ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దూరం కానుందనే భయంతో ఉంది. సరిగ్గా ఈ తరుణంలో ఆమె చేసిన వ్యాఖ్యలు హర్యానా రైతాంగాన్ని మరింతగా రెచ్చగొట్టేవే. పార్టీకి నష్టం కలిగిస్తాయని హర్యానా పార్టీ నేతలు గగ్గోలు పెట్టారు. దాంతో కేంద్ర బీజేపీ వెంటనే కంగనామాటలతో పార్టీకి సంబంధం లేదని చెప్పుకుందే, తప్ప కనీసంగా ఆమెను

రైతులపై నోరు పారవేసుకున్న కంగనా మాటలు ఇంకా చెవుల్లో గింగురు మంటుండగా తగ్గేదేలే అంటూ కులగణన జరగదు అని మరొక ప్రకటన వదిలారు. వెంటనే అది మా వైఖరి కాదంటూ దానికి కూడా జనానికి బీజేపీ సంజాయిషీ చెప్పుకోవాల్సి వచ్చింది. 'న్యూస్ 24' అనే టీవీతో మాట్లాడుతూ కులగణన తప్పకుండా చేయాలా అన్న ప్రశ్నకు అవసరమే లేదు అంటూ కంగన చెప్పేశారు. కులగణన మీద యోగి ఆదిత్యనాథ్ వైఖరే తనదని, అందరం కలసి ఉంటేనే మంచిదని, విడిపోతే నాశనం అవుతామన్నారు. "కులగణన జరపకూడదు. నటుల కులమేమిటో మనకు తెలియదు. ఎవరికీ ఏమీ తెలియదు. నా చుట్టూ ఉన్నవారు కులం గురించి పట్టించుకోరు. దాన్ని ఎందుకు ఇప్పుడు తేల్చాలి. గతంలో మనం చేయలేదు, ఇప్పుడూ అవసరం లేదు" అన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కావాలంటే రాష్ట్రాలు కుల గణన చేసుకోవచ్చు తప్ప కేంద్ర ప్రభుత్వం చేపట్టదని, ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని బీజేపీ నేతలు పదే పదే చెప్పిన సంగతి తెలిసిందే. సరిగ్గా ఎన్నికలకు ముందు మరోసారి ఎన్డీయే కూటమిలో చేరిన జెడియు నితీష్‌కుమార్ బీహార్‌లో కులగణన చేశారు. అనేక రాష్ట్రాలలో అలాంటి డిమాండ్ ముందుకు వచ్చింది. కేంద్రమే జనాభా లెక్కలతో పాటు జరపాలని ప్రతిపక్ష పార్టీలు కోరాయి. ఎన్నికలో బీజేపీకి సంపూర్ణ మెజారిటీ రాలేదు, మిత్రపక్షాల మీద ఆధార పడాల్సి వచ్చింది. దాంతో వాటి ఒత్తిడికి లొంగిపోయింది. కంగన ప్రకటన మరోసారి బీజేపీని ఇరుకున పెట్టింది. "అవసరం తలెత్తితే తాము కులగణన చేస్తామని హోంమంత్రి చెప్పారని, కనుక కంగన చెప్పిన మాటలు పార్టీ వైఖరిని ప్రతిబింబించవు" అని బీజేపీ జాతీయ ప్రతినిధి గురు ప్రకాష్ పాశ్వాన్ ప్రకటించాల్సి వచ్చింది. అయితే ఇంతవరకు కుల గణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

తోటకూర నాడే మందలించి ఉంటే అనే సామెత తెలిసిందే. గతంలో కంగనా రనౌత్ చేసిన అనేక వివాదాస్పద ప్రకటనలు, ప్రత్యర్థులపై ఎదురు దాడికి దిగినపుడు బీజేపీ నోరు మెదపలేదు. దాడి జరపటాన్ని ఆస్వాదించింది. పరిస్థితి మారిన తరువాత ఇప్పుడు ప్రతి మాట వల్లా పార్టీకి ఎదురు దెబ్బ తగులుతోంది. అయినా సరే. ఆమె ఎక్కడా తగ్గటం లేదు. తన సినిమా గురించి ప్రచారం చేసుకుంటూ చౌకబారు, తెలివి తక్కువ ప్రకటనలు, వివాదాస్పద వ్యాఖ్యలతో ఉచిత ప్రచారం పొందాలని చూస్తున్నట్లు కనిపిస్తున్నది. నరేంద్ర మోడీ అధికారానికి వచ్చిన 2014లోనే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని 2021లో చెప్పారు. స్వీయ అనుభవంతో తానీ మాటలు చెబుతున్నట్లు, తన అతి మంచితనం కారణంగా వ్యవస్థ తనను దేశం విడిచి అమెరికా వెళ్లేట్లు చేసిందని, మోడీ అధికారానికి వచ్చాక తాను తిరిగి వచ్చానని అందుకే అసలైన స్వాతంత్ర్యం వచ్చినట్లు భావిస్తున్నట్లు చెప్పుకున్నారు. అదే విధంగా కత్రీనా కైఫ్ వంటి విదేశీ హీరోయిన్లు ఎంతో రాణించారని కానీ 2014 తరువాత స్వదేశీ నటీనటులు, కథలకు ప్రాధాన్యత ఇస్తున్నారని, విదేశీయుల నృత్యాలు ఆపాలని జనం చెప్పారని, ఇటాలియన్ ప్రభుత్వాన్ని తొలగించి ఒక చారువాలాను ప్రధానిని చేశారని కూడా సెలవిచ్చారు. సుభాస్ చంద్రబోస్‌ను భారత తొలి ప్రధాని అని చెప్పటమే కాదు, ఆయన అజాద్ హింద్ ప్రభుత్వాన్ని ఏర్పరచిన కారణంగా బోసే ప్రథమ ప్రధాని అని సమర్థించుకున్నారు. తనను విమర్శించిన వారికి రెండు రకాల మెదడు కణాలు ఉంటాయని వారికి ఇది అర్థం కాదని కూడా ఎదురు దాడి చేశారు. రామనాథ్ కోవింద్‌ను 'కోవిడ్'గా పలకటమేగాక, ప్రథమ దళిత రాష్ట్రపతిగా వర్ణించి తరువాత నాలుక కరుచుకున్నారు. అలాంటి కంగనా సినిమా ఎమ ర్జన్సీ గురించి సెన్సార్ బోర్డు ఏం చేస్తుందో, బీజేపీ ఏం చెబుతుందో వాటి మీద స్పందనలు ఎలా ఉంటాయో వేచిచూడాల్సిందే!

- సత్య

అకాల వర్షాలకు నష్టపోయిన వరద
బాధితులను ఆదుకోవాలి

సీఎం రేవంత్ రెడ్డికి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి

నవతెలంగాణ-ఖమ్మం

అకాల వర్షాలకు నష్టపోయిన వరద బాధితులను ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డికి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వరదలు నగరాన్ని ముంచెత్తాయన్నారు. నగరంతో సహా జిల్లాలో సుమారు పదివేల కుటుంబాలు నష్టపోయాయి అన్నారు. నగరంలో వేలాదిమంది గృహాలు పూర్తిగా మునిగిపోయి



కట్టుబట్టలతో మిగిలినారన్నారు. మున్నేరు పరివాహక ప్రాంతంలో పంటలు దెబ్బతిన్నాయని, సర్వం కోల్పోయిన ప్రజలకు ప్రభుత్వం అండగా నిలవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పూర్తిగా మునిగి దెబ్బతిన్న గృహాలకు మూడు లక్షల పరిహారం ఇవ్వాలని, పాక్షికంగా దెబ్బతిన్న గృహాలకు లక్ష రూపాయలు పరిహారం ఇవ్వాలని, వరదల్లో కొట్టుకుపోయి మరణించిన వారికి 20 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని, దెబ్బతిన్న పంటలకు ఎకరాకు 20వేల నష్టపరిహారం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితులకు సాయం

నవతెలంగాణ-ఖమ్మం



ఖానాపురం హవేలి వరదయ్యనగర్ వరద బాధితులకు సీపీఐ(ఎం) సానుభూతిపరులు కాటేపల్లె క్రాంతి కుమార్ ఉదయం టిఫిన్, సీపీఐ(ఎం) ఖానాపురం హవేలి కార్యాలయం సత్తెనపల్లి రామకృష్ణ భవన్‌లోనూ, అలాగే మధ్యాహ్నం భోజనం వరదయ్యనగర్ నివాస ప్రాంతంలోనూ ఏర్పాటు చేయడం జరిగింది. అదే విధంగా వన్ టౌన్ ఐద్వా నాయకురాలు డాక్టర్ ప్రశాంతి వరద బాధితులకు దుస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సెక్రటేరియట్ సభ్యులు వై.విక్రమ్, హవేలి కార్యదర్శి దొంగల తిరుపతిరావు, ఎస్ఎఫ్ఐ ప్రవీణ్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పిన్నింటి రమ్య, క్రాంతి బృందం వై.కోటి, యాలనాటి రమేష్, నల్లమోతు లక్ష్మణ్, ఎక్స్ ఎంపీటీసీ ఎస్.కె.అలీమ్, ముప్ప చంద్రశేఖర్, రవికుమార్, అక్రమ్, సమీర్, ఐద్వా నాయకులు భాగం అజిత, మెహరున్నిసా బేగం, ఇతర హవేలి నాయకులు పాల్గొన్నారు.

ఆదుకోవటంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలం

- ముగ్గురు మంత్రులున్నా కదలని యంత్రాంగం
- పూర్తిగా మునిగిపోయిన ఇండ్లకు రూ.3లక్షలు,
- పాక్షికంగా దెబ్బతిన్న గృహాలకు లక్ష రూపాయలు
- చనిపోయిన వారికి రూ.20 లక్షలు ఇవ్వాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం



వరదల నుండి ప్రజలను కాపాడటంలో జిల్లాలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. సోమవారం సుందరయ్య భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ అధికార యంత్రాంగం కదల లేదన్నారు. ఖమ్మం చరిత్రలో ఎన్నడూ లేనంతగా వరదలు ముంచెత్తడం ఒక రికార్డు అయితే, అధికార యంత్రాంగం వైఫల్యం మరొక రికార్డు అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిన ఈ కాలంలో పైనుండి వస్తున్న మున్నేరు వరద ప్రవాహాన్ని, వర్షపాతం తీవ్రతను తెలుసుకోలేకపోవటం, గత మూడు రోజులుగా వాతావరణ శాఖ అనేక హెచ్చరికలు చేస్తున్నప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోవడంలో, జిల్లా కేంద్రంలో హెలికాప్టర్‌ను, ఎన్‌డిఆర్ఎఫ్ ఫోర్సును అందుబాటులో ఉంచలేదన్నారు. ఖమ్మంనగరంలో మోతీనగర్, కాల్వొడ్డు, వెంకటేశ్వరనగర్, సమ్మక్క సారక్క నగర్, బొక్కలగడ్డ, సుందరయ్యనగర్, వరదయ్య నగర్, కవి రాజనగర్, అగ్రహారం కొత్తూరు కాలనీ, జలగంనగర్, పెద్దతండా, వరంగల్ క్రాస్‌రోడ్, కరుణగిరి, రాజీవ్ గృహకల్ప ప్రాంతాలు, దానవాయిగూడెం ప్రాంతంలో పదివేల కుటుంబాలు వరద బారిన పడ్డాయన్నారు. అత్యధికులు కట్టుబట్టలతో బయటకు వచ్చారని, సర్వస్వం కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిగా మునిగి దెబ్బతిన్న గృహాలకు మూడు లక్షలు, పాక్షికంగా దెబ్బతిన్న వాటికి లక్ష రూపాయలు, చనిపోయిన వారికి 20 లక్షలు ఇవ్వాలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ముంపు ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని నియమించి, పారిశుద్ధ్య పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి సమీక్షలో అధికారుల నిర్లక్ష్యం పైన చర్చించాలని, తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజలను ఆదుకోవటంలో సిపిఎం కార్యకర్తలు

వరదలు ముంచెత్తిన వెంటనే సీపీఐ(ఎం) కార్యకర్తలు, నాయకులు అనేక ప్రాంతాల్లో ప్రజలను బయటకు తీసుకురావడంలో ఎంతో శ్రమించారని చెప్పారు. పార్టీ కార్యాలయాలను నిర్వాసిత కేంద్రాలుగా ఉపయోగించుకోవాలని పార్టీ జిల్లా కమిటీ జిల్లా అధికారులకు తెలిపిందన్నారు. ముంపునకు గురైన వారిని పార్టీ కార్యాలయానికి తరలించి వారికి వసతి భోజనాలు, కప్పుకోవడానికి దుప్పట్లు కొనిచ్చామని, దాతల సహాయంతో అనేక ప్రాంతాల్లో సుమారు 4వేల భోజనాలు అందించామని నున్నా తెలిపారు. సహాయ కార్యక్రమాలలో పాల్గొన్న వారికి అభినందనలు, సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, వై.విక్రం పాల్గొన్నారు.

బిక్కుబిక్కుమంటూ...!

వరద ప్రభావంతో సర్వస్వం కోల్పోయిన ప్రజలు

- బాధితుల వైపు కన్నెత్తి చూడని అధికారులు, అధికార పార్టీ నాయకులు
- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బాధితులకు భోజనం
- గ్రామాల్లో పర్యటించి బాధితులను ఓదార్చిన సీపీఐ(ఎం) బృందం

నవ తెలంగాణ-ఖమ్మంరూరల్





మండలంలోని జలగంనగర్, కస్నాతండా, తనగంపాడు, నాయుడుపేట, రాజీవ్ గృహ కల్ప, కోట నారాయణ పురం గ్రామాలను మున్నేరు తీవ్ర వరదతో ముంచెత్తడంతో ప్రజలు సర్వస్వం కోల్పోయి దిక్కుతోచని స్థితిలో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. వరద బాధిత గ్రామాల్లో సోమవారం సీపీఐ(ఎం) బృందం పర్యటించి బాధితులను పరామర్శించి, మనోధైర్యం కల్పించి వారికి అండగా ఉన్నారు. పురుగు మందుల షాపు పూర్తిగా వరదలో కొట్టుకుపోయిందని, లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని బాధితుడు బాణోత్ లక్ష్మణ్ కన్నీరు మున్నీరుగా విలపిస్తూ బృందానికి తెలిపారు. ఇండ్లు మొత్తం నీట మునిగి టీవీలు, ఫ్రిడ్జ్‌లు, వాషింగ్ మిషన్లు, కంప్యూటర్లు, పుస్తకాలు, డబ్బులు, బట్టలు, ధాన్యం ఇతరత్రా వస్తువులు పూర్తిస్థాయిలో వరద పాలయ్యాయని ప్రజలు విలపిస్తూ బాధిత బృందానికి మొరపెట్టుకున్నారు. ఇంటి నిండా, వీధుల వెంట బురద పేరుకుపోయి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు బురదతో పేరుకుపోయి ఉన్న దృశ్యాలు చూసి బందం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. నాయుడుపేట గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) నందిగామకృష్ణ, జలగంనగర్ గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) నాయకులు మోరబోయిన పుల్లయ్య, పలువురు సీపీఐ(ఎం) నాయకుల ఇండ్లు పూర్తిగా వరదలో మునిగాయి. అలాగే కరుణగిరి ప్రాంతంలో నివాసం ఉంటున్న నవతెలంగాణ ఖమ్మంప్రాంతీయప్రతినిధి కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఇల్లు కూడా పూర్తిగా వరదలో మునిగింది. భారీ ఆస్తినష్టం జరిగింది. ఏడీవీటీ ఇన్‌చార్జి గుమ్మడి నర్సయ్య ఇల్లు కూడా పూర్తిగా వరదలో మునిగింది.

ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్య వీరభద్రం మాట్లాడారు. వరద బాధిత గ్రామాల్లో అధికారులు పర్యటించి, నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి పూర్తిస్థాయిలో బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఇటువంటి పరిస్థితుల్లో కూడా అధికారులు అలసత్వం వహించడం దారుణమన్నారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తక్షణమే వరద గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వపరంగా పూర్తిస్థాయిలో ప్రజలను ఆదుకోవాలని కోరారు. ఒక్కో ఇంటికి రెండు లక్షల రూపాయల నష్టపరిహారం ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాచిరాజుగూడెం, పెద్దతండా, తీర్థాల గ్రామాల్లో వరి పొలాలు పూర్తిగా నీట మునిగాయి. వరద నీటితో రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ములకలపల్లి బ్రిడ్జి పూర్తిగా నేలమట్టం అయింది. దీంతో ఖమ్మం-కొరివి-మహబూబాబాద్ వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాయుడుపేట వద్ద ఖమ్మం వెళ్లే మార్గంలో రోడ్డు పూర్తిగా దెబ్బ తినడంతో ప్రమాదం పొంచి ఉంది.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బాధితులకు భోజనం

కస్నాతండా, మద్దులపల్లి సీపీఎం గ్రామ శాఖల ఆధ్వర్యంలో మండలంలోని కస్నాతండా, కోట నారాయణపురం గ్రామాల్లోని వరద బాధితులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఉరడీ సుదర్శన్‌రెడ్డి, మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, మండల నాయకులు తోట పెద్ద వెంకటరెడ్డి, వడ్లమూడి నాగేశ్వరరావు, పొన్నం వెంకటరమణ, భూక్య నాగేశ్వరరావు, అవిరేణి గురవయ్య, అవిరేణి నాగరాజు, ఊరుబండి చంద్రయ్య, కోటయ్య, భూక్య నాగరాజు, అవిరేణి భారతమ్మ, పెంట్యాల నాగేశ్వరరావు, కర్లపూడి వెంకటేశ్వర్లు, నంబూరి నారాయణరావు, మంగమ్మ, ఏటుకూరి సతీష్, పొన్నం భాస్కర్, మురళి, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.







కన్నీళ్లు మిగిల్చిన తుఫాన్

- ముష్టికుంట్ల, చొప్పకట్లపాలెం చెరువులకు గండి
- వర్షపు నీటితో నిండిన కేజీబీవీ
- ముష్టికుంట వద్ద ప్రధాన రోడ్డుకు గండిపెట్టిన అధికారులు

నవతెలంగాణ - బోనకల్



ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా కురిసిన వర్షాల మండల ప్రజలకు కన్నీటి గాధను మిగిల్చాయి. మండల వ్యాప్తంగా రాత్రి, పగలు జోరుగా వర్షాలు కురిశాయి. ఈ వర్షాల ప్రభావంతో అనేక రకాల ఇబ్బందులు ప్రజలు ఎదుర్కొన్నారు. ప్రధానంగా బోనకల్ - ఆళ్లపాడు రోడ్డు తెగిపోయింది. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అదే విధంగా కలకోట రాళ్లవాగు పై వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అక్కడ కూడా రాకపోకలు నిలిచిపోయాయి. మండల పరిధిలోని ముష్టికుంట్ల, చొప్పకట్లపాలెం చెరువులకు గండ్లు పడ్డాయి అధికారులు సకాలంలో స్పందించి ఆ రెండు చెరువుల గండ్లను పూడ్చారు. మండల కేంద్రంలో గల కేజీబీవీ వర్షపు నీటితో పూర్తిగా నిండిపోయింది. తహసీల్దార్ అనిశెట్టి పొన్నం చందర్ రాత్రంతా అక్కడే ఉండి మోటార్ ద్వారా వర్షపు నీటిని బయటకు పంపించారు. ముష్టికుంట్లలో బీసీ కాలనీ వర్షపు నీటిలో మునిగిపోయింది. దీంతో మండల అధికారులు బోనకల్- ఖమ్మం ప్రధాన రోడ్డుకి ముష్టికుంట్ల వద్ద గండిపెట్టి నీటిని బయటికి పంపించారు. ఆ తర్వాత పూడ్చి వేశారు. మండల వ్యాప్తంగా అనేక ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరి రెండు రోజుల పాటు అనేక కుటుంబాలు ఇబ్బందులు పడ్డారు. పత్తి, వరి పొలాలు నీట మునిగాయి. స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్ వరదపు నీటితో తెల్లవారులు రాకపోకలకు ఇబ్బందులు కలిగించింది. బోనకల్- ఆళ్లపాడు రోడ్డు తగ్గిపోవడంతో కలకోట, రాయన్నపేట, మోటమర్రి, గోవిందాపురం గ్రామాలకు రెండు రోజులుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆళ్లపాడు, మోటమర్రి, రాయన్నపేట, గోవిందపురం, కలకోట గ్రామాలు దాదాపుగా జలదిగ్బంధంలో రెండు రోజులు పాటు ఉన్నాయి. బోనకల్-ఖమ్మం ప్రధాన రహదారిలో చింతకాని మండలం నాగలవంచ వద్ద నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద పెద్ద ఎత్తున రోడ్డుపై వర్షపునీరు ప్రవహిస్తుండటంతో రెండు రోజులుగా బోనకల్-ఖమ్మంకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి బోనకల్-ఖమ్మం ప్రధాన రోడ్డు ఏర్పడిన తర్వాత మొట్టమొదటగా వర్షాల ప్రభావంతో వరుసగా మూడు రోజుల పాటు రాకపోకలు నిలిచిపోవడం ఇదే మొదటిసారి. వరద ఉఉధృతిని జిల్లా అదనపు కలెక్టర్ డి మధుసూదన్ నాయక్ రాత్రి సమయంలో వచ్చి పర్యవేక్షించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. తాసిల్దార్ అని శెట్టి పొన్నం చందర్ జానకిపురంలోని బాలర వసతి గృహాన్ని ఆదివారం రాత్రి సందర్శించారు. విద్యార్థులకు తగు ధైర్యం చెప్పి ఎటువంటి ఆందోళన చెందవద్దని చెప్పారు అదేవిధంగా మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం వర్షపు నీటితో పూర్తిగా నిండిపోవడంతో తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలను తీసుకెళ్లారు. వర్షపు నీటిని ప్రహరీ గోడకు గండిపెట్టి బయటకు మోటార్ ద్వారా రోజంతా పంపించారు. ఈ విధంగా తుఫాన్ మండల ప్రజలను మూడు రోజులుగా తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది.

బ్రిడ్జి మరమ్మతు పనులు పరిశీలించిన ఎంపీ

నవతెలంగాణ- ఖమ్మం



ఇటీవలి వరదలతో దెబ్బతిన్న నగరంలోని బైపాస్ రోడ్డు బ్రిడ్జి మరమ్మతు పనులను ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సోమవారం పరిశీలించారు. ఖమ్మంరూరల్ మండలంలోని నాయుడు పేట, జలగంనగర్, పెద్దతండా, రాజీవ్ గృహకల్ప, కరుణగిరి, తీర్థాల తదితర వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి.. ప్రజలకు బాసటగా నిలిచి వస్తుండగా బ్రిడ్జిపై ఆగారు. ఇక్కడ మరమ్మతులు జరుగుతుండడాన్ని చూసి.. తన వాహనం ఆపి అక్కడికి వెళ్లి పరిశీలించారు. నాణ్యతగా పనులు జరగాలని.. వాహనాల రాకపోకలకు అంతరాయం జరగకుండా చూడాలని సూచించారు. సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి వెంట కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, చావా శివ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పంట నష్టం సర్వే చేయాలి

- షరతులు లేకుండా రుణమాఫీ నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలి
- సాగు భూమి కోతకు గురైనా ఇసుక మేటలు వేసినా ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలి
- పంట నష్టం వాటిల్లితే ఆహార పంటలకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు రూపాయలు పరిహారం అందించాలి
- చనిపోయిన వారికి రూ.25 లక్షలు, గాయపడిన వారికి రూ.5 లక్షలు, పశువులకు లక్ష రూపాయలు చెల్లించాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర విస్తృత సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టిన బొంతు రాంబాబు

నవతెలంగాణ-ఖమ్మం



రాష్ట్రంలో కురుస్తున్న భారీ, అతి భారీ వర్షాలు, వరదలు మూలంగా జరిగిన నష్టంపై ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర విస్తృత సమావేశం డిమాండ్ చేసింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం కేంద్రంలో గత మూడు రోజులుగా జరుగుతున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర రైతు శిక్షణా తరగతులు సోమవారం ముగింపు సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బొంతు రాంబాబు వరద సహాయక చర్యలు చేపట్టాలని, షరతులు లేకుండా రుణమాఫీ నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలి అని తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో అతి భారీ వర్షాలు కురిసి నది పరివాహక ప్రాంతాల్లో, ఏర్లు, వాగులు, వంకలు సమీపంలో పంట నష్టంతో పాటు భూములు కోతకు గురై, ఇసుక మేటలు వేసి సాగుకు అనువైన పరిస్థితి లేదని అన్నారు, అనేక ప్రాంతాల్లో విద్యుత్ మోటార్లు పంపులు వరద ప్రవాహంలో కొట్టుకుపోవడం, బురదలో కురకపోయి కోట్ల రూపాయలు నష్టం వాటిల్లింది అన్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువతో పాటు అనేక మధ్యంతర ప్రాజెక్టుల కాలువలకు గండ్లు పడి నష్టం జరిగిందన్నారు. భారీ వర్షాలు, వరదలతో చనిపోయిన వారికి 25 లక్షల రూపాయలు, గాయపడిన వారికి 5 లక్షల రూపాయలు, పశువులకు లక్ష రూపాయలు, ఆహార పంటలకు ఎకరాకు రూ.25వేలు, వాణిజ్య పంటలకు 50 వేల రూపాయలు అదనంగా కోతకు గురైన, ఇసుక మేటలు వేసిన పొలాలకు 50 వేల రూపాయలు పంట నష్టపరిహారంతో పాటు అదనంగా కలిపి ప్రభుత్వం అందించాలని కోరారు. కౌలు రైతులకు, పట్టాదారు పాస్ పుస్తకాలు లేని రైతులకు పరిహారం అందించేందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. తిరిగి వ్యవసాయం ముందుకు సాగటం కోసం వ్యవసాయ విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, చెరువులు కుంటలు కాలువలు, గండ్లు సత్వరమే పూడ్చడానికి ప్రత్యేక నిధులు మంజూరు చేసి సకాలంలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల వాగ్దానం ప్రకారం షరతులు లేకుండా రుణమాఫీ చేయాలన్నారు. సాంకేతిక సమస్యలు ప్రభుత్వం సృష్టించి కాలయాపన చేయడం సరికాదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్ళలో 40 వేల కోట్ల రూపాయలు రుణమాఫీకి అవసరం అని అంచనా వేసి ఎనిమిది నెలల తర్వాత 15 వేల కోట్ల రూపాయలు కోత విధిస్తే రైతులకు రుణమాఫీ కాదని రుణమాఫీకి అవసరమైన నిధులు ప్రభుత్వం సమకుర్చుకొని బ్యాంకులో అప్పు ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలి అని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, కార్యదర్శి తీగల సాగర్, ఉపాధ్యక్షులు జంగారెడ్డి, బొంతల చంద్రారెడ్డి, మూడ్ శోభన్‌తో పాటు ఖమ్మం జిల్లా నుంచి చింతనిప్పు చలపతిరావు వాసిరెడ్డి ప్రసాద్, ఎస్‌కె మీరా, మందా సైదులు, యనమద్ది రామకృష్ణ, రాయల శ్రీనివాసరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంతాపం

అతి భారీ వర్షాలు వరదలతో చనిపోయిన వారికి సంతాపం తెలుపుతూ ఖమ్మం జిల్లా కారేపల్లికి చెందిన యువ వ్యవసాయ శాస్త్రవేత్త రాయాపూర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో పనిచేస్తున్న అశ్విని అకేరు వరదలో మృతిచెందారు. అశ్వినికి సమావేశం శ్రద్ధాంజలి ఘటించింది.

జ్వరంతో యువతి మృతి



నవతెలంగాణ-పెనుబల్లి

కర్రాలపాడు గ్రామానికి చెందిన బిటెక్ పూర్తి చేసిన మేకల సాత్విక(21) తీవ్ర జ్వరంతో చికిత్స పొందుతూ హైదరాబాదులో మృతి చెందింది. స్థానికుల వివరాల ప్రకారం పెనుబల్లి మండలం కర్రాలపాడు గ్రామానికి చెందిన మేకల సాత్విక హైదరాబాద్‌లో బిటెక్ పూర్తి చేసి హైదరాబాదులో హాస్టల్‌లో ఉంటూ సాఫ్ట్ వేర్ కంపెనీలో ట్రైనింగ్ తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో శనివారం జ్వరం రావడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిందని వైద్యులు డెంగ్యూ సోకినట్లు నిర్ధారించారని తెలిపారు. అర్ధరాత్రికి హైదరాబాద్ నుండి సాత్విక మృత దేహాన్ని స్వగ్రామం కారాలపాడు తరలించి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఎంతో భవిష్యత్ ఉన్న కుమార్తె జ్వరం బారిన పడి రెండు రోజుల వ్యవదిలో అకాల మరణం చెందంతో తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

చింతలకుంట చెరువు సందర్శన



నవతెలంగాణ-పెనుబల్లి

మండలంలో భారీ వర్షాల కారణంగా లంకసాగర్‌లోని చింతల కుంట చెరువు అలుగు పడటంతో అక్కడ పరిస్థితులను ఆయకట్టు రైతులు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దృష్టికి తీసుకెళ్లడంతో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా మట్టా దయానంద్ అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. చెరువు అలుగుకు అడ్డంగా మట్టికట్ట పోయడం వలన చెరువు కట్ట బలహీనపడి తెగిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. అలుగుకు అడ్డంగా పోసిన మట్టి కట్టను తక్షణమే తొలగించాలని అధికారులు ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట ఇరిగేషన్ డిపార్ట్ మెంట్ అధికారులు, తహసీల్దార్ ప్రతాప్, ఎస్ఐ వెంకటేష్, ఏఎంసీ చైర్మెన్ దోమ ఆనందబాబు, కాంగ్రెస్ గ్రామ కార్యకర్తలు కొల్లి ప్రసాదరావు, కొల్లి శ్రీనివాసరావు, కొల్లి రాజా పాల్గొన్నారు.

16.10 అడుగుల నీటిమట్టంతో 'బేతుపల్లి' కళకళ

- అలుగు ద్వారా అవుట్ ఫ్లో 3265 క్యూసెక్కులు దిగువకు

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి మండలంలో ప్రధాన జలవనరైన బేతుపల్లి పెద్దచెరువు నీటి సామర్థ్యం 16.0 అడుగులకు గాను 16.10 అడుగులకు చేరి కళకళలాడుతోంది. చెరువుకు పైనున్న అటవీ ప్రాంతాల నుంచి 3265 క్యూసెక్కులు నీరు ఇన్‌ఫ్లో అవుతుండగా అంతే స్థాయిలో అవుట్ ఫ్లో అలుగు (మత్తడి) ద్వారా దిగువ ప్రాంతాలకు వెళ్తోంది. గత నాలుగు రోజులుగా ఎడతెరిపీ లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు బేతుపల్లి పెద్దచెరువు పూర్తిస్థాయికి చేరుకుంది. ఇంతకు ముందు కురిసిన వర్షాలకు చెరువు నిండిన క్రమంలో మిగులు జలాలను సత్తుపల్లి, వేంసూరు మండలాల్లోని 58 చెరువులకు ఐబీ అధికారులు ఎన్టీఆర్ కెనాల్ ద్వారా పంపించడం జరిగిందని సత్తుపల్లి ఐబీ డీఈఈ సంపతి వెంకటేశ్వరరావు తెలిపారు.

వరద తాకిడికి గురై కోడి పిల్లలు మృతి

నవతెలంగాణ-పెనుబల్లి



మండలంలోని వియం బంజర్ గ్రామం బుడగ జంగాల కాలానికి చెందిన తూరపాటి అబ్బుస్వామి ప్రౌలి రైతు కాలనీ శివారులో గత 10 సంవత్సరాల నుండి బాయిలర్ కోళ్లఫామ్ నిర్వహిస్తున్నాడు. గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శనివారం రాత్రి వరద ప్రవాహం పోటెత్తి కోళ్ల ఫామ్‌లోకి ప్రవేశించడంతో 11రోజుల వయసు గల 2 వేలు కోడి పిల్లలు మృతి చెందాయి. వరద ఉధృతిని నివారించడానికి అన్నిరకాల ప్రయత్నాలు చేసినప్పటికి వీలు కాలేదని వరద నీరు పోటెత్తి ప్రౌలి ఫామ్‌లోకి ప్రవేశించి రూ.3,150 విలువ కలిగిన 10 బస్తాలు కోళ్ల మేత, 2 వేలు కోడి పిల్లలు మృతి చెందంతో రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లిందని ప్రౌలిఫామ్ నిర్వాహకుడు అబ్బు స్వామి ఆవేదన వ్యక్తం చేశాడు. మరి కొన్ని రోజులకు ఒక్కొక పిల్ల రెండు 2.5 కేజీలు బరువు వస్తాయని సుమారు రూ. 4లక్షలు రాబడి వస్తుందని వరద బీభత్సానికి పూర్తిగా నష్ట వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

ప్రాణాలు మీదకి తెచ్చుకోవద్దు

వాగులపై సాహసాలు చేయవద్దు

- ఇటుకరాళ్ల చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే
- ఆగమేగాల మీద గండిని పూడ్చిన అధికారులకు ప్రశంస

నవతెలంగాణ-కల్లూరు



పొంగుతున్న వాగులపై సాహసాలు చేసి ప్రాణాల మీద తెచ్చుకోవద్దని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయ దయానంద్ ప్రజలను కోరారు. పట్టణ పరిధిలోని ఇటుక రాళ్ల చెరువును ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్ట దయానంద్ విజయకుమార్ కలిసి సోమవారం పరిశీలించారు. తుఫాన్ కారణంగా భారీ వర్షాలకు ఇటుక రాళ్ల చెరువు కట్టకు ఆదివారం గండి పడింది. రెవెన్యూ, జలవనుల శాఖ అధికారులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆయకట్టురైతుల సహకారంతో జెసిబి యంత్రాల సహాయంతో తాత్కాలికంగా చెరువు గండిని పూడ్చివేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ ఆయకట్టు రైతులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు, అధికారులు సకాలంలో స్పందించి సమన్వయంతో వ్యవహరించి సహాయక చర్యలు చేపట్టి తాత్కాలికంగా గండి పూడ్చి వేయటం పట్ల అభినందనలు తెలిపారు. ఇటుకరాల చెరువు కట్టను పట్టిష్ట పరిచి గండి పడ్డ తూము ప్రదేశంలో శాశ్వతంగా తూము ఏర్పాటు చేసి భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు రైతులకు కలగకుండా నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. అదేవిధంగా పంట నష్టపోయిన రైతుల వివరాలు సేకరించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా తుఫాను వర్షాలతో చెరువు అలుగులు,వాగులు వంకలు పొంగి పలు ఇళ్లల్లో నీళ్ల చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారని అదేవిధంగా పంటలు మునిగి రైతులకు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. విపత్తుల సమయంలో పార్టీ నాయకులు కార్యకర్తలు సకాలంలో స్పందించి ప్రజలకు సహాయక చర్యల్లో పాల్గొంటున్నారన్నారు. నియోజకవర్గంలోని కల్లూరు తల్లాడ, పెనుబల్లి, వేంసూరు మండలాలలో తుఫాను ప్రభావంతో వరద ముంపుకు గురైన ప్రాంతాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. వరద ముంపు ప్రాంతాల్లోని ప్రజలను పునరావసకేంద్రాలకు తరలించి ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అనవసరంగా వాగులు వంకలు దాటే ప్రయత్నాలు చేసి ప్రమాదాలకు గురికావద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేంద్ర గౌడ్, తాసిల్దార్ పులి సాంబశివుడు, జల వనరుల శాఖ ఈఈ లక్ష్మీనారాయణ, డిఈ రాజా రత్నాకర్, స్థానిక ఏఎస్ఐ చారి, కల్లూరు, సత్తుపల్లి మండలాల ఏఎంసీ చైర్మన్లు భాగం నీరజాదేవి, దోమ ఆనందబాబు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏనుగు సత్యంబాబు భాగం ప్రభాకర్ చౌదరి, ఆళ్లకుంట నరసింహారావు పలువురు కార్యకర్తలుఅభిమానులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలి

- జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ వీ. సుబ్బారావు

నవతెలంగాణ-ఖమ్మం

జిల్లాలో అధిక వర్షపాతం నమోదు కావటం వలన, వరదలు ఒచ్చి అనేక గ్రామాలు రాకపోకలు అంతరాయం ఏర్పడి, వారికోసం రిహాబిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేయటం జరిగిందని, ప్రతి రెహాబిలిటేషన్ సెంటర్‌లో వైద్య ఆరోగ్య శాఖ ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని, సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు వహించాలని, ఎటువంటి ఆరోగ్య సమస్యతో ఉన్న వెంటనే సంప్రదించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వీ. సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సీజనల్ వ్యాదుల పట్ల జాగ్రత్త వహించాలని, నివారణ కార్యక్రమాలు చేస్తూ, వ్యక్తి గత, పరిసరాలు పరిశుభ్రత పాటించాలని, వరద ప్రాంతాలలో నీటిని వేడి చేసి చల్లార్చి త్రాగాలని, పరిశుభ్రమైన ఆహారాన్ని భుజించాలని పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్ 9502248398ను ఏర్పాటు చేశామని, 24 గంటలు అందుబాటులో ఉంటుందని, ఆరోగ్య సమస్యలు ఉంటే ఆ నెంబర్‌కు కాల్ చేసి ఆ సమస్యకు తగిన చికిత్సలు, సలహాలు పొందాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఉంటే వారికి తగిన పరీక్షలు, చికిత్సలు అందించే విధంగా వైద్యాధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని చెప్పారు.

సహాయక చర్యలు సమన్వయంతో చేయాలి

నవతెలంగాణ-వేంసూరు

భారీ వర్షాలు కారణంగా గ్రామాలలో ప్రత్యేక అధికారులు సహాయక చర్యలు సమన్వయంతో చేపట్టాలని తహసీల్దార్ ఎంఎ. రాజు అన్నారు. సోమవారం కలెక్టర్ ఆదేశాలు మేరకు తహసీల్దార్ కార్యాలయం నందు అన్ని శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, వీధులలో నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి మీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్లలో నీరు చేరిన ఇళ్ళను గుర్తించి నీటిని బయటకు పంపించే చర్యలు చేపట్టి ఇల్లు కూలిపోయిన వారికి తక్షణ సహాయం కింద పది కేజీల బియ్యం అందజేయాలని ఆదేశించారు. ప్రత్యేక అధికారులు గ్రామాలలో పర్యటించి ప్రజల సమస్యలను గుర్తించాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి రాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఐబీడీఈ ఏఈలు, పీఆర్ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్ శాఖ వైద్యాధికారితోపాటు ఆర్ఐ చిరంజీవి పాల్గొన్నారు.

వరద బాధిత కుటుంబాలకు భరోసా

- ఆహారం, మంచినీరు పంపిణీ చేసిన ఏఐఎస్ఎఫ్ బృందం

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని కాల్వ ఒడ్డు వెంకటేశ్వర కాలనీలోకి మున్నేరు వాగు పొంగటంతో పలు కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయి. ఈ వరదలు విపత్తుపై స్పందించిన సోమవారం ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా బృందం అక్కడికి చేరుకుని వరద బాధిత కుటుంబాలకు ఆహార పదార్థాలు, మంచినీళ్ళ, ఇంటింటికి తిరిగి అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ మాట్లాడుతూ దేశంలో జరిగిన ప్రకృతి-విపత్తు సమయాల్లో ఏఐఎస్ఎఫ్ ఎప్పుడూ బాధితులకు అండగా నిలిచిందన్నారు. పోరాటాలు ఉద్యమాలు తోపాటు సేవా కార్యక్రమాలు చేయటం అభినందనీయమన్నారు. మున్నేరు వాగు వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు పోటు పూర్ణచంద్రరావు, మేకల రవి, ఖమ్మం జిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, జిల్లా నాయకులు రాకేష్, సునీల్, హరికృష్ణ, ప్రతాప్, నరేష్, సాయి, గోపి, ఉమా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంటల పరిశీలిన

నవతెలంగాణ-మధిర

మండలంలోని కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన వరి, పత్తి పంటలను, రుణమాఫీ సర్వేని జిల్లా వ్యవసాయ అధికారి డీ.పుల్లయ్య, సహాయ వ్యవసాయ సంచాలకులు, మధిర యస్. విజయ చంద్ర సోమవారం తనిఖీ చేశారు. మండల పరిధిలోని మాటూరు గ్రామంలో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న వరి, పత్తి పంటలను జిల్లా వ్యవసాయ అధికారి డీ.పుల్లయ్య, ఏ డి ఏ ఎస్ .విజయ చంద్ర పరిశీలించారు. షెడ్యూల్ ప్రకారం రేషన్ కార్డు లేని రైతులు ఆయా గ్రామాలలో ధ్రువీకరణ పత్రంతో పాటు, కుటుంబ సభ్యుల ఆధార్ జిరాక్సులు, లోన్ అకౌంట్ జిరాక్సులు, పట్టాదారు పాస్బుక్ నకలు వంటి వివరాలతో మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారుల బృందాన్ని సంప్రదించాలని జిల్లా వ్యవసాయ అధికారి, ఏడిఏ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు నికిత, అమృత, వంశీ కృష్ణ, సుష్మా, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మహారాజ శ్రీ గౌరవ ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు నందు
E.P.NO: 2/2020
IN
O.S.NO: 74/2016
బిట్వీన్:
మలిశెట్టి మయూరి ...DHr/వాది
మరియు
కొత్తా రాజేంద్ర ప్రసాద్ ...Jdr/ప్రతివాది
To,
Jdr/ప్రతివాది
కొత్తా రాజేంద్రప్రసాద్ తండ్రి : సీతారామయ్య వయస్సు: 54 సం॥ లు, వృత్తి:వ్యాపారం R/o.Flat No: G-4, Skyline Towers, ఇందిరానగర్, ఖమ్మం.
నోటీసు
పైన పేర్కొన్నటువంటి మీరు Jdr/ప్రతివాదిగా వున్న పైన తెలిపిన E.P. నందు మీరు ఉద్దేశ పూర్వకంగా కోర్టు నోటీసులు తీసుకొనుట లేదు. కావున కోర్టు వారి అనుమతితో ఇట్టి నోటీస్ ఇవ్వనైనది. ఇట్టి E.P. యొక్క వాయిదా ది:17-09-2024 న పై కోర్టు నందు వున్నది. కావున మీరు స్వయంగా గాని, లేదా న్యాయవాది గారి ద్వారా గాని కోర్టు వారి ఎదుట హాజరు కావల్సిందిగా తెలియపరచనైనది. లేనిచో మీ తరపున వాదనలు లేనట్టుగా భావించబడును.
(కోర్టువారి అనుమతితో)
Sd/-
M.K. JALEEL,
MD.M.IRSHAD,
Advocates,Khammam.
Cell:9390574510.



రైతు బాంధవుడు, విద్యా ప్రదాత 'రాజశేఖరుడు'

- ఎమ్మెల్యే రాగమయి దయానంద్
- సత్తుపల్లిలో ఘనంగా వైఎస్సార్ వర్ధంతి వేడుక

నవతెలంగాణ-సత్తుపల్లి

రైతు బాంధవుడు, పేదల ఆరోగ్య రక్షకుడు, పేద విద్యార్థుల మరిచిపోలేని విద్యా ప్రదాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి ప్రజల హృదయాల్లో చెరగని ముద్రగా నిలిచి పోయారని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ అన్నారు. వైఎస్సార్ 15వ వర్ధంతిని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సత్తుపల్లిలో కాంగ్రెస్ శ్రేణులు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ దంపతులు మాట్లాడారు. వైఎస్సార్ భౌతికంగా మననుంచి దూరమై 15యేండ్లు గడిచినా పేద వర్గాలకు ఆయన అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలు అనుక్షణం ఆయన్ను గుర్తు చేస్తూనే ఉన్నాయన్నారు. వైఎస్సార్ ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మెన్ దోమ ఆనంద్‌కుమార్, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ తోట సుజలరాణి, కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ కమల్‌పాషా, మందపాటి ముత్తారెడ్డి, మలిరెడ్డి మురళీరెడ్డి, పింగిలి సామేలు, మందపాటి రవీంద్రరెడ్డి, వనమారెడ్డి నాగిరెడ్డి, గొర్లమారి రామ్మోహనరెడ్డి, ఖలీల్, దొడ్డా గోపాలరావు, విరివాడ నాగభూషణం, గణేశ్, సందీప్, కౌన్సిలర్లు కంటె నాగలక్ష్మి, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

వరద బాధితులను అన్ని రకాలుగా ఆదుకోవాలి

- సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం



అకాల వర్షాల కారణంగా ఖమ్మం నగరంలో నష్టపోయిన వరద బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మాస్‌లైన్ పార్టీ ప్రతినిధి బృందం బొక్కలగడ్డ, ప్రకాష్ నగర్, పంపింగ్ వెల్ రోడ్డు, రాజీవ స్వగృహ తదితరుల ప్రాంతాలలో సందర్శించి వరద బాధితులతో మాట్లాడారు. వారి బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముందస్తు ఆదేశాలు ఉన్నప్పటికీ జిల్లా యంత్రాంగం ప్రభుత్వం తగినంత జాగ్రత్తలు తీసుకోకపోవడం కారణంగా ఎక్కువ ఆస్తి నష్టం జరిగిందన్నారు. బోట్లు హెలికాప్టర్ తదితరులు ఏర్పాటు చేయకపోవడం వల్ల ఎక్కువ సేపు ప్రజలు ఇబ్బంది పడ్డారని తెలిపారు. భోక్కల గడ్డ, సుందరయ్య నగర్, పంపింగ్వెల్ రోడ్డు, రాజీవ్ స్వగృహ ఏరియాలో నివసిస్తున్న పేదల కట్టుబట్టలు తప్ప ఏమీ మిగలకుండా కోల్పోయారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వరదల కారణంగా ఇండ్లు బజార్ లు బురదమయం అయ్యాయని, తాగునీరు, ఇండ్లు శుభ్రం చేసుకోవడానికి నీరు, భోజనాలు కూడా లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ముంపు ప్రాంతాల్లో కనీస వసతులు కల్పించాలని కోరారు. ముంపుకు గురైన ప్రతి ఇంటికి 2 లక్షల రూపాయల ఆర్థిక సహకారం అందించాలని అని డిమాండ్ చేశారు. ముంపు ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న బురదను తొలగించేందుకు కార్పొరేషన్ ముమ్మరం చర్యలు చేపట్టాలన్నారు. ఇండ్లు కోల్పోయిన వారికి తక్షణమే ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహకారం చేయాలని కోరారు. ద్విచక్ర వాహనాలు, ఫోర్ వీలర్స్, ఆటోలు, పిల్లల పుస్తకాలు సర్టిఫికెట్లు సైతం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు తిరిగి పుస్తకాలు పంపిణీ చేయాలని, ప్రభుత్వ ప్రవేట్ రుణాల ఈఎంఐ లును కూడా వాయిదా వేయించాలని ఆయన కోరారు. ఇప్పటికైనా అన్ని రకాల చర్యలు చేపట్టి త్వరగా నగరాన్ని క్లీన్ చేసి విష జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుని వరద బాధితులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి రామయ్య, సి .వైపుల్లయ్య, ఆవుల అశోక్, నాయకులు కే. శ్రీను, సురేష్, సత్తార్, వెంకటేష్, శ్రీను, ప్రసాదు, వెంకటేష్, పండు, యశ్వంత్ పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులని తక్షణమే ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మడిపల్లి గోపాలరావు

నవతెలంగాణ-చింతకాని

గత రెండు రోజుల నుండి కురిసిన భారీ వర్షాలతో వచ్చిన వరదల వల్ల పంటలు కొట్టకపోయి అనేక ఇబ్బందులు పడుతున్న రైతులని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మడిపల్లి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా అత్యధిక వర్షపాతం నమోదయి రైతులని పూర్తిస్థాయిలో ముంచేసిందన్నారు. పత్తి, మిరప ముఖ్యంగా పెసర పంటలు చేతికి వచ్చిన తరుణంలో నేలమట్టమై పూర్తిగా నష్టపోయిన పరిస్థితి మండలంలో కనిపిస్తోంది. దీనికి వ్యవసాయ శాఖ అధికారులు సర్వే నిర్వహించి ఎకరానికి 20 నుండి 30 వేల రూపాయలు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా చూసినప్పుడు ఖమ్మం జిల్లా చింతకాని మండలం మధిర నియోజకవర్గం లో ఎక్కువ వర్షపాతం నమోదయి అత్యధిక వరదలు వచ్చి రైతులు భారీ స్థాయిలో నష్టపోయారని, ప్రభుత్వం నిర్ణయం తీసుకొని నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

తండ్రీ కూతురు మృతితో శోకసముద్రంలో గంగారంతండా

నివాళ్లర్పించిన ఎంపీ, ఎమ్మెల్యే

నవతెలంగాణ-కారేపల్లి

భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో విధులలో చేరటానికి వెళ్తున్న యువశాస్త్రవేత్త నూనావత్ అశ్విని, అమె తండ్రి నునావత్ మోతీలాల్‌లు ఆకేరువాగు బలి తీసుకున్న ఘటన మండలంలోని ప్రతి ఒక్కరిని కదిలిస్తుంది. తండ్రి కూతుర్ల మృతితో గంగారంతండా యావత్తు శోకసముద్రంలో నిండిపోయింది. తండాలో చదువు ఆవశ్యకత్తను తెలియజేసి చదువు ఉంటేనే గుర్తింపు వస్తుందని, జీవితానికి సార్థకత వస్తుందని నిత్యం తోటి యువతకు భోధించే అశ్విని తమ కండ్లకు దూరం కావటం గ్రామ యువత జీర్ణించుకోలేక పోతుంది. ఆకేరువాగులో కొట్టుకపోయిన తండ్రి, కూతుర్లు ముందుగా యువశాస్త్రవేత్త డాక్టర్ నూనావత్ అశ్విని మృతదేహం ఆదివారమే లభించగా మృతదేహాన్ని స్వగ్రామం గంగారంతండా తీసుకవచ్చారు. తండ్రి నూనావత్ మోతీలాల్ మృతదేహం సోమవారం ఉదయం లభించటంతో దానిని మహబూబాబాద్ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం గంగారంతండాకు తీసుకవచ్చారు. తండ్రి, బిడ్డల మృతదేహాలను చూచిన గ్రామస్తులు కన్నీరుమున్నీరైనారు. వారి అంతిమయాత్రలో వందలాది మంది పాల్గొన్నారు. హిందు సాంప్రదాయం ప్రకారం యువ శాస్త్రవేత డాక్టర్ అశ్విని మృతదేహాన్ని కననం చేయగా తండ్రి మోతీలాల్ దహనం చేశారు.

అంచెలంచెలుగా ఎదుగుతూ...

చిన్నతనంలో చదువులలో చురుకుగా ఉంటే నూనావత్ అశ్విని పదోతరగతి వరకు కారేపల్లిలోని బ్రిలియంట్స్ స్కూల్ నభ్యసించింది. ఇంటర్ బైపీసీని విజయవాడలోని ఎన్ఆర్ఐ కళాశాలలో చదుకున్న ఆమె ఆశ్వరావుపేట వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేసింది. పీజీని డిల్లీలో పూర్తి చేసిన అమె హైదరాబాద్‌లో పీహెచ్‌డీ చేశారు. ఇదే క్రమంలో అశ్విని జెనెటిక్స్ అంజ్ ప్లాంట్ బ్రీడింగ్‌లో శాస్త్రవేత్తగా ఎంపికై జాతీయ స్థాయిలో ప్రధమ స్థానంలో నిలిచింది. రాయపూర్ వ్యవసాయపరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తగా పని చేస్తుంది. వ్యవసాయరంగంలో అశ్విని చేస్తున్న పరిశోధనలకు గాను ఈ ఏడాది ఏప్రిల్ 19, 20, 21 తేదిలలో రాయపూర్‌లో జరిగిన అంతర్జాతీయ 4వ అగ్రిమీట్‌లో ఉత్తమ యవశాస్త్రవేత్త అవార్డును పొందారు.

మృతులకు నివాళ్లు అర్పించిన ఎంపీ, వైరా ఎమ్మెల్యే

ఆకెరు వాగులో పడి మృతి చెందిన తండ్రి, బిడ్డలు నునానవత్ మోతీలాల్, డాక్టర్ నూనావత్ అశ్విని మృతదేహాలను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ సందర్శించి నివాళ్లు అర్పించారు. మృతదేహాలను చూచి చలించి పోయారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువశాస్త్రతను కోల్పోవటంతో దేశానికి తీరని నష్టమన్నారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా కుటుంబానికి అదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కుటుంబానికి ఎమ్మెల్యే రూ.50 ఆర్థిక సాయం చేశారు. లంబాడీ ఐక్యవేధిక వ్యవస్థాపక అధ్యక్షులు రాజ్‌కుమార్‌జాదవ్ మృతదేహాలను సందర్శించి నివాళ్లు అర్పించారు. అశ్విని కుటుంబ సభ్యులు తల్లి నేజీ, సోదరుడు అశోక్‌లను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో సోసైటీ అధ్యక్షులు దుగ్గినేని శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, బానోత్ రాంమ్మూర్తి, ఇమ్మడి తిరుపతిరావు, అడ్డగోడ ఐలయ్య, మేదరి వీరప్రతాఫ్(టోనీ), దారావత్ వినోద్, ఎండీ.యాకుబ్ అలీ, మల్లెల నాగేశ్వరరావు, గుగులోత్ భీముడు, బానోత్ హీరాలాల్, ఎండీ.హనీఫ్, నునావత్ సాయికిరణ్, బీఆర్ఎస్ నాయకులు హన్మకొండ రమేష్, సామేల్ తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట కాలనీలో వరద బాధితుల ఆందోళన

తమను పట్టించుకునే నాధుడే కరువయ్యారని రాస్తారోకో

తహశీల్దార్ హామీతో ఆందోళన విరమణ

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం 60 వ డివిజన్లోని రామన్నపేట కాలనీలో వరద బాధితులు తమని పట్టించుకోవడంలేదని నిరసిస్తూ సోమవారం ఖమ్మం డోర్నకల్ రోడ్డుపై రామన్నపేట కాలనీ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు బాధితులు రాస్తారోకులు నిర్వహించారు. చివరికి మీడియాలో కథనాలు రావడంతో స్పందించిన అధికారులు ప్రజాప్రతినిధులు ఖమ్మం అర్బన్ తాసిల్దార్ స్వామి అక్కడికి చేరుకొని బాధితులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు .అయిన బాధితులు తమ ప్రాంతాన్ని పరిశీలించాలని తమ ఇల్లు పూర్తిగా పూర్తిగా ధ్వంసం అయ్యాయని, ఎవరు ఇంతవరకి రాలేదని తమను పట్టించుకోలేదని, రాత్రి నుంచి నిద్ర అకారాలు మాని సాయం కోసం ఎదురుచూస్తున్నామని ,తమకు న్యాయం చేసే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని తాసిల్దార్ తో వాపోయారు. దీంతో తాసిల్దార్ కాలనీలోని అన్ని ప్రాంతాలు పరిశీలన చేసి త్వరలోనే అందరకు న్యాయం చేసే విధంగా పై అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన నిర్మించారు. నీతో రహదారిపై 6 గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తమకు జిల్లా మంత్రులు న్యాయం చేయాలని, లేనియెడల అవసరమైతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తాము సర్వం కోల్పోయామని ఈ వరదల్లో కట్టుబట్టలతో మిగిలామని ఒక్కొక్కరికి పది నుంచి 15 లక్షలు నష్టం వాటిలిందని ఎవరికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

అధికారుల నిర్లక్ష్యమే భారీ నష్టానికి కారణం

ప్రతి ఇంటికి లక్ష రూపాయల తక్షణ సాయం అందించాలి

సీపీఐ నాయకులు బాగం హేమంతరావు

నవతెలంగాణ- ఖమ్మం కార్పొరేషన్

వరదలను అధికారులు అంచనా వేయడంలో వైఫల్యం చెందడం వల్లే ఖమ్మం నగరంతో పాటు మున్నేరు పరివాహక ప్రాంత ప్రజలు భారీగా నష్ట పోయేందుకు కారణమైందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. 30, 31 తేదీలలో భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ పలుమార్లు హెచ్చరించినా మున్నేరు ప్రభావిత ప్రాంతాలలో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదవుతుందని తెలిసి కూడా ప్రజలను అప్రమత్తం చేయలేదని హేమంతరావు ఆరోపించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ సహా సిపిఐ బృందం పలు ప్రాంతాలలో పర్యటించింది. వెంకటేశ్వరనగర్. బొక్కలగడ్డ, సూరీ నగర్, పంపింగ్ వెల్ రోడ్, ప్రకాష్‌నగర్, జలగంనగర్, నాయుడుపేట, రాజీవ్ గృహకల్ప, నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీ, కస్నాతండా ప్రాంతాలలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు యానాలి సాంబశివరెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గృహాల మధ్య నిల్వ ఉన్న నీటిని వెంటనే తొలగించండి

బీసీ, సోషల్ వెల్ఫేర్ హాస్టల్, డబల్ బెడ్ రూమ్‌లను పరిశీలించిన తహశీల్దార్

నవతెలంగాణ-కల్లూరు

వర్షాలకు గృహాల మధ్య ఖాళీ ప్రదేశాల్లో ఉన్న నీటిని వెంటనే తొలగించాలని తహశీల్దార్ పులి సాంబశివుడు గ్రామపంచాయతీ అకారులను ఆదేశించారు. సోమవారం గ్రామపంచాయతీ ఈవో ఎం.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను తహసిల్దార్ పరిశీలించారు. నీటి నిల్వ ఉంటే దోమ ఉధృతి పెరిగి మళ్లీ ప్రజలు అనారోగ్యం పాలవుతారని, వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పూడిపోయిన సైడ్ కాలవలను, నిల్వ ఉన్న నీటిని జెసిబిలు పెట్టి శుభ్రం చేశారు. అనంతరం బీసీ హాస్టల్‌ను సందర్శించి అక్కడి విద్యార్థులను వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్ సందర్శించి చుట్టూ పరిసరాలను, వంటగదిని పిల్లలకి అందిస్తున్న వంట సామాగ్రిని పరిశీలించారు. అనంతరం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించారు. డబల్ బెడ్ రూమ్ ఇల్లు పైనుంచి కారుతున్నాయని, గృహాల వారు అధికారుల దృష్టి తీసుకొచ్చారు. దీంతో ఆర్అండ్‌బి ఏఈని తాత్కాలిక మరమ్మత్తులు చేయాలని ఆదేశించారు. లక్ష్మీపురం కల్లూరు మధ్యలో ఉన్న పెద్ద చెరువును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ ఏనుగు సురేష్, గ్రామపంచాయతీ నాగేశ్వరరావు, ఆర్ఐ తదితరులు ఉన్నారు.

అధైర్య పడొద్దు అండగా ఉంటాం

- వరదకు గురైన గ్రామాలలో పర్యటించిన పాయం

నవతెలంగాణ-మణుగూరు



ప్రకృతి విపత్తు వల్ల జరిగిన వరదల్లో నష్టపోయిన బాధితులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వరద కుటుంబాలకు భరోసా ఇచ్చారు. శనివారం సృష్టించిన వరద బీభత్సాన్ని గురైన గ్రామాలు మున్సిపాలిటీలోని సుందరయ్య నగర్, మేదర్ బస్తి, ఆదర్శనగర్ మండలంలోని సమితి సింగారం, కూనవరం గ్రామాలలో సోమవారం పాయం పర్యటించారు. వరద బాధితులతో మాట్లాడుతూ అన్నిరకాలు ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. వరదకు ముంపుకు గురైన ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బ్లీచింగ్ చేయించాలని అధికారులు ఆదేశించారు. సమితి సింగారంలో ఎస్సి బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు పిరినాకీ నవీన్, అధిక సంఖ్యలో నాయకులు కాంగ్రెస్ పాల్గొన్నారు.

ఒక్కడై..ముందడుగై

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడలేదు... ఆ ఒక్కడు తానై ముందడుగు వేశాడు... చేతన మీసేవ రంజిత్ నాయక్. భద్రాచలంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఆర్అండ్‌బి రహదారి సిపిఐ ఆఫీస్‌కు వెళ్లే దారిలో రోడ్డు పై పెద్ద గోతులు ఏర్పడాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆ గొయ్యి ఇంకా పెరిగింది. నిండి ఉన్న వర్షపు నీటితో ఆ గొయ్యి కనపడక ద్విచక్రవాహనదారులు, పాదాచారులు పడి గాయపడ్డ సందర్భాలు ఉన్నాయి. దీనిని గమనించిన రంజిత్ నాయక్ ముందుకు కదిలి వచ్చాడు. రిక్షాతో మట్టి తెప్పించి భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు భూక్యా మాన్ సింగ్ భద్రాచలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బానోత్ బాసు ధరావత్ భాస్కర్‌ల సహాయంతో ఆ గుంతలను మట్టితో నింపారు. ఇది తాత్కాలికమే అయినప్పటికీ అధికారులకు కనువిప్పు కలిగే విధంగా ఉపశమనం కలిగించాడు. ఇప్పటికైనా సదరు శాఖ అధికారులు స్పందించి శాశ్వత మరమత్తు పనులను చేపట్టాలని కోరుతున్నాడు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాన్‌సింగ్, భాస్కర్, బాసు, గౌడబనేని చందు పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

- పట్టణ సిఐ సంజీవరావు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గణేష్ ఉత్సవాల్లో భాగంగా మండపాల ఏర్పాటుకు అన్ని శాఖల అనుమతి తప్పనిసరిగా ఉండాలని భద్రాచలం పట్టణ సీఐ సంజీవరావు కోరారు. మండపాల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా వాటర్ డ్రమ్ములల్లో నీరు ఇసుక ఫైర్ ఎక్స్‌టింగిషర్ మండపాల వద్ద ఏర్పాటు చెయ్యాలని ఆయన సూచించారు. అదేవిధంగా మండపాలు ఏర్పాటు చేసే ప్రదేశంలో ఇంటి యజమాని అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. గణేష్ ఉత్సవ నిర్వాహకులు అన్ని శాఖల అనుమతులు తీసుకొని వాటిని జతపరిచి పట్టణ పోలీస్ స్టేషన్లో సమర్పించాలని సిఐ సంజీవరావు కోరారు.

మణుగూరును సీఎం సందర్శించాలి

నవతెలంగాణ-మణుగూరు

భారీ వర్షాలు ఎన్నడూ లేని విధంగా మణుగూరును ముంచెత్తయని తెలంగాణ ముఖ్యమంత్రి మణుగూరును సందర్శించి, ప్రజలకు భరోసా ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ నాయకులు అంగోత్ మంగీలాల్ కోరారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ...మణుగూరు ప్రజలు కనీ వినీ ఎరగని రీతిలో వరద ముంపునకు గురయ్యారని, మణుగూరు చరిత్రలోనే ఇంత వరద తొలిసారన్నారు. అననుకూల వాతావరణ పరిస్థితులలో సైతం పోలీస్, రెవెన్యూ, విపత్తు నిర్వహణ, ఇతర శాఖలు స్వచ్ఛంద సంస్థలు రాజకీయ నాయకులు సైతం కాపాడటం, బాధితులకు అండగా నిలబడటం నిరాశ్రయులకు అన్న పానీయాలు అందజేయటంలో కూడా మణుగూరుకున్న ప్రత్యేకతను మరోసారి నిరూపించాలని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కే.గురుమూర్తి, కే.నాగేశ్వరరావు, మెట్ల సాంబయ్య, గోపి, నాగరాజు, శంకర్, శ్రీనివాస్, నాగేశ్వరరావు, రజబ్ అలీ పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణల వల్లే విలువైన ప్రాణాలు పోతున్నాయి

- రహదారి ఆక్రమిత విస్తరణ పనులు చేపట్టిన ఎంపీఓ

నవతెలంగాణ-పినపాక



రోడ్డు కొలత వరకు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వలన ప్రమాదాలు జరిగే విలువైన ప్రాణాలు పోతున్నావని ఎంపీఓ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక సెక్రటరీ ఖాజా హుస్సేన్‌తో కలిసి జానంపేట గ్రామంలో రహదారి ఆక్రమిత విస్తరిత పనులను చేపట్టారు. జానంపేట గ్రామపంచాయతీలో తారు రోడ్డు మీదికి మట్టిని పోయడంతో రెండు రోజుల క్రితం బైక్ పై నుండి జారిపడి సాయి అనే యువకుడు మృతి చెందాడన్నారు. ప్రమాదాలు నివారించే కార్యక్రమంలో భాగంగా పినపాక మండలంలో ఈ బయ్యారం క్రాస్ రోడ్, సీతంపేట పినపాక గ్రామాలలో ఇప్పటికే రహదారి ఆక్రమిత విస్తరణలో ఉన్న ఆక్రమిత నిర్మాణాలను తొలగించామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ పనులకు సహకరించాలని ఎంపీఓ కోరారు. సాయి నగర్ గ్రామంలో రహదారిపై రోడ్డు నీరు నిల్వ ఉండడం గమనించిన ఎంపీఓ తక్షణమే పంచాయతీ డాక్టర్ల సహకారంతో మట్టిని తెచ్చి నీరు నిలువ లేకుండా రహదారి పనులను మరమ్మతులు చేపించారు. దిగినేపల్లి గ్రామపంచాయతీలో పంచాయతీ నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో సెక్రటరీలు ఉమామహేశ్వరరావు, సాంబశివరావు, తరుణ్, నాగేశ్వరరావు, ఉపేందర్, సంధ్యారాణి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాలు మాఫీ చేయాలి

- ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు సీతామాలక్ష్మి

నవతెలంగాణ-దుమ్ముగూడెం



రాష్ట్ర ప్రభుత్వం రైతులు వ్యవసాయ పెట్టుబడుల కోసం తీసుకున్న రుణాలను ఏ విధంగా మాఫీ చేశారో డ్వాక్రా మహిళలు తమ కుటుంబ అవసరాల నిమిత్తం తీసుకున్న రుణాలను సైతం మాఫీ చేయాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు డి.సీతామహాలక్ష్మి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ములకపాడు యలమంచి సీతారామయ్య భవనంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మండల మహాసభ కాశీనగరం జీపీ మాజీ సర్పంచ్ పూనేం కనకదుర్గ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీతా మహాలక్ష్మి మాట్లాడుతూ.. అరులైన పేదలందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని, ఒంటరి మహిళలకు, వితంతువులకు, వికలాంగులకు, వృద్ధాప్య పెన్షన్లు ఇవ్వాలని అన్నారు. 12వ తేదీన జరిగే అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నాయకురాలు ఎన్.లీలావతి, మచ్చా రమాదేవి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి గౌతమి, ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ మిడియం జయ, మడివి విజయలక్ష్మి, శ్వేత, అలివేలు, మడకం లక్ష్మి, కొమరం భద్రమ్మ, నాగమణి, సోయం సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహశీల్దార్

నవతెలంగాణ-బూర్గంపాడు



ఎడతెరపి లేని వర్షాలను దృష్టిలో పెట్టుకొని మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ముజాహిద్ అన్నారు. గోదావరి మంగళవారం రాత్రికి రెండవ ప్రమాద హెచ్చరిక 48 అడుగులు చేరుకొనే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే జారే

నవతెలంగాణ-ములకలపల్లి



మండలం కేంద్రం మంగపేట ప్రభుత్వ ఆసుపత్రిని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం రోగులు మందులు సరిగా ఇవ్వడం లేదని తెలపగ సిబ్బందిని వివరణ అడగగా మందుల కొరత ఉందని చెప్పడంతో వెంటనే ఆయన కలెక్టర్, డీఎంహెచ్ఓతో ఫోన్‌లో మాట్లాడి మందుల కొరత ఉందని తెలపగా రేపటి వరకు మందుల కొరత ఉండదని తెలిపారు. సిబ్బంది విధులలో అలసత్వం వహిస్తే సహించనని అన్నారు. అయన వెంట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బత్తుల అంజి, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య
- పంటలను పరిశీలించిన సీపీఐ(ఎం) బృందం

నవతెలంగాణ-పాల్వంచ రూరల్



పాల్వంచ మండలం బంగ్రిగుండ పంచాయతీ పరిధిలో కోయ గట్టు గ్రామంలో సీతారామ ప్రాజెక్టు కాలువ తెగి సుమారు 50 ఎకరాల పత్తి, వరి, కంది చేలు నేలమట్టం అయ్యాయి. వర్షాలకు కొట్టుకుపోయిన పంటలను సీపీఐ(ఎం) బృందం సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలలో ఏడు లక్షల ఎనభై ఏడు వేల ఎకరాల సాగు భూమికి నీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వాలు సీతారామ ప్రాజెక్టు పనులు ప్రారంభించారని, కాలువల పని పూర్తికాకుండానే హంగు, ఆర్భాటాలతో మా ప్రభుత్వం హయాంలోనే ప్రాజెక్టు పూర్తి చేసి ప్రారంభించామని గొప్పలు చెప్పుకోవడం కోసం గత నెల ముఖ్యమంత్రి సీతారామ ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభించారన్నారు. కానీ నిర్మించిన కాలువల నిర్మాణంలో నాణ్యత లోపించడం వల్ల కాలువ తెగి పంట పూర్తిగా నష్టపోయిందని, కేవలం ప్రభుత్వం పనిలో పర్యవేక్షణ లేకపోవడం నాణ్యతను పరిశీలించకపోవడం వలన కాలువలు తెగి భారీ వర్షాలకు పంట నేల పాలు అవుతుందని ఆయన ఆరోపించారు. కేవలం ఆర్భాటమే తప్ప పనిలో నాణ్యతను పరిశీలించడం లేదని, నాశిరకంగా కాలువలు నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పనిలో నాణ్యత లేకపోవడం వలన వేలకోట్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని, వీటితోపాటు కాలువ పక్కన ఉన్న పంటలు కూడా నష్టపోతున్నాయని ఆయన అన్నారు. టేకుల చెరువు దగ్గర వాగు పొంగి సీతారామ కాలవలోకి వస్తున్నాయి అని డైవర్షన్ ఇవ్వకపోవడం వలన ఆ నీళ్ల మొత్తం ఫ్లోటింగ్ ఎక్కువై సీతారామ కాలవలోకి వచ్చి చేరుతున్నాయని అన్నారు. గత నెలలో ముఖ్యమంత్రి గారు ప్రారంభించిన లిఫ్ట్ ఇరిగేషన్ ట్రయల్ రన్ వేసిన నీరు కాలువలో ఉండటం అలాగే టెకుల చెరువు దగ్గర నిన్నటి వానకు వచ్చిన వరద కాలువలో చేరడం వలన ఫ్లోటింగ్ ఎక్కువై కాలువ తెగిపోయిందని అన్నారు.

ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపోయిన పంటను అంచనావేసి రైతులకు నష్టపరిహారం అందించాలని అలాగే తిరిగి రైతాంగం మళ్లీ వ్యవసాయం చేసుకోవడానికి కావలసిన సహాయాన్ని ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, కొండబోయిన వెంకటేశ్వర్లు, ముదిగొండ రాంబాబు, నాయకులు నిమ్మల మధు, రాజు, భద్రయ్య, లక్ష్మయ్య, కోయగట్టు గ్రామ రైతులు పాల్గొన్నారు.

గోదావరి ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ



రాబోయే రెండు రోజుల్లో ఎగువ నుంచి వచ్చే వరద ఉధృతితో భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం పెరిగే అవకాశం ఉంటుందని దీన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు, ప్రజలు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా అశ్వాపురం, భద్రాచలం, బూర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెం, మణుగూరు, పినపాక మండలాల పరిధిలోని లోతట్టు గ్రామాలకు చెందిన ప్రజలు నిరంతరం గోదావరి ఉధృతిని గమనించాలని సూచించారు. అధికారులు ఈ గ్రామాల విషయంలో వెంటనే స్పందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ తగిన జాగ్రత్త చర్యలను ఎప్పటికప్పుడు చేపట్టాలని ఆదేశించారు. ముంపు ప్రాంత గ్రామాల విషయంలో తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలను వెంటనే చేపట్టాలన్నారు. అవసరమైన రెస్క్యూ టీములు మర బోట్లు సమకూర్చుకోవాలన్నారు. అత్యవసరమైతే వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించే విధంగా వాహనాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అటు పునరావాస కేంద్రాల్లోనూ ప్రజలకు అవసరమైన నిత్య అవసరాలను సమకూర్చుకోవాలని పేర్కొన్నారు.

ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ



ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, అగ్నిమాపక, విద్యుత్, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడానికి పకడ్బందీ చర్యలు తీసుకావాలని అన్నారు. అన్ని గణేష్ మండపాలను తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ముందస్తుగా గణేష్ మండలి నిర్వాహకులు పూర్తి వివరాలు అందించాలని, ఇది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండల స్థాయిలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు మొదటి రోజు నుండి నిమజ్జనం వరకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రశాంత వాతావరణంలో అవాంఛనీయ సంఘటనలు తావు లేకుండా నిర్వహించాలని చెప్పారు. మండపాలకు విద్యుత్ ఏర్పాటుకు తప్పని సరిగా విద్యుత్ శాఖ నుండి అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలుపై విద్యుత్ అధికారులు మండపాల్లో ఆడిట్ నిర్వహించాలని చెప్పారు. విద్యుత్ తీగలకు తగల కుండా ఎత్తు తక్కువ ఉండే విగ్రహాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. మండపాల్లో మైక్ ఏర్పాటుకు పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని చెప్పారు. ప్రతి గణేష్ మండపం వద్ద అవసరమైన మేర బందోబస్తు ఏర్పాటు చేయాలని, గణేష్ నిమజ్జనం సజావుగా జరిగే విధంగా కట్టు దిట్టమైన భద్రత వ్యవస్థ ఏర్పాట్లుచేయాలని కలెక్టర్ సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో ఉచిత మట్టిగణపతులు పంపిణీ చేయనున్నామని, ప్రజలు మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వర్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీపీఓ చంద్రమౌళి, డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీవోలు మధు, దామోదర్ రావు, భద్రాచలం ఆలయ ఈఓ, మున్సిపల్ కమిషనర్లు, పాల్గొన్నారు.

ప్రజలు అధైర్యపడొద్దు...నష్టనివారణ చర్యలు ప్రారంభించాం

- పంట నష్టపై సత్వరమే సర్వేచేపట్టి రైతులను ఆదుకుంటాం
- పర్యటనలో ఎమ్మెల్యే సాంబశివరావు

నవతెలంగాణ-పాల్వంచ రూరల్



భారీ వర్షాలకు ముంపుగురై ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రజలు అధైర్యపడొద్దని యుద్ధ ప్రాతిపదికన నష్టనివారణ చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ మండల పరిధిలో వర్షాలు, వరదలకు ముంపుకు గురైన ఉల్వనూరు, మందెరకలపాడు, మల్లారం, కిన్నెరసాని, రాళ్ళవాగు, యానంబైలు ప్రాంతాలను సోమవారం కూనంనేని సందర్శించారు. మండల తహశీల్దార్, ఎంపిడీవో, నీటిపారుదల, వ్యవసాయ, అటవీశాఖ, విద్యుత్, రోడ్లు భవనాల శాఖ అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. మందెరకలపాడు వంతెనకు గండి ఏర్పడటంతో సుమారు ఏడువూర్లకు రాకపోకలు స్తంబించడంతో స్పందించిన కూనంనేని అధికారులను ఆదేశించడంతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించారు. ముందస్తు సమాచారం అందించినప్పటికి గ్రామీల సందర్శనకు గైర్హసరైన వ్యవసాయ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ రోడ్లు, విద్యుత్ పునరుద్ధరణపనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, పంటల నష్టంపై వ్యవసాయ అధికారులు తక్షణమే సర్వేచేపట్టి నివేదికను ప్రభుత్వానికి అందించాలని ఆదేశించినట్లు తెలిపారు. పర్యటనలో కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె.సాబీర్ పాషా, జిల్లా నాయకులు ముత్యాల విశ్వనాథం, వి.పూర్ణచంద్రావు, ఏ.సాయిబాబు, బండి నాగేశ్వరావు, రాహుల్, నాగరాజు, మన్నెం వెంకన్న ఆదినారాయణ, అన్నారపు వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు నాగసీతారాములు, బరపటి వాసుదేవరావు, ఎర్రంశెట్టి ముత్తయ్య, మండల అధికారులు తదితరులు ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-భద్రాచల రూరల్



అధిక వర్షాలు పడుతున్నందున ఆశ్రమ పాఠశాల గురుకులాలలో చదివే విద్యార్థినీ, విద్యార్థుల పట్ల హెచ్‌ఎం, వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారి ఆరోగ్య స్థితిగతులతో పాటు అనధికారికంగా పిల్లలు బయటికి వెళ్లకుండా ఎప్పటికప్పుడు సంబంధిత ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలని ఐటీడీసీ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం నాడు ఐటీడీఏ సమావేశం మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్ అధికారిక పనులపై వెళ్లి అందుబాటులో లేనందున వివిధ సదూర ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుండి ఆయన యూనిట్ అధికారుల సమక్షంలో అర్జీలు స్వీకరించి తన పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించి, మిగతా వాటిని సంబంధిత అధికారులకు పంపుతూ వీలైనంత తొందరగా అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశ పెట్టే సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేయాలని ఆయన అన్నారు. గిరిజన దర్బార్‌లో సమర్పించిన అర్జీలు అన్ని ఆన్లైన్ ద్వారా ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, ఆర్‌సిఓ గురుకులం నాగార్జున రావు, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ తానాజీ, కొండరెడ్ల అధికారి నరేష్, ఏపీఓ పవర్ మునీర్ పాషా, డిటిఆర్ఓ ఎఫ్ఆర్ శ్రీనివాస్, మేనేజర్ ఆదినారాయణ, డిడి ట్రైబల్ వెల్ఫేర్ పర్యవేక్షకురాలు ప్రమీల బాయ్, మిషన్ భగీరథ ఏఈ నారాయణరావు, డీఎస్ఓ ప్రభాకర్ రావు, హెచ్ఈఓ నాయక్, ఎస్‌డిసి ముదిరాజు, జేడీఎం హరికృష్ణ, భద్రమ్మ, పాల్గొన్నారు.

వరదల నుండి రక్షణ కోసమే అందుబాటులో తెప్పలు

- తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్

నవతెలంగాణ-దుమ్ముగూడెం



గోదావరి వరదలు, వర్షం వరదల సమయంలో ఆపదలో ఉన్న వారిని అత్యవసరంగా ఆదుకునేందుకుగాను నీళ్లలో తేలాడే తెప్పలను అందుబాటులో ఉంచినట్లు తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్ తెలిపారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాల మేరకు ముందస్తు జాగ్రత్తలు భాగంగా 9 తెప్పలను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. గోదావరి వరదలు, అధిక వర్షాలతో గ్రామాలను రహదాలను సమయంలో ఈ తెప్పల ద్వారా నీటిపై రాకపోకలు సాగించడంతోపాటు, నీళ్లలో చిక్కుకున్న వారిని రక్షించడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు లక్ష్మయ్య, కల్లూరి వెంకటేశ్వరరావు, ఓడ బలిజ సంఘం మండల అధ్యక్షులు ఎంబడి అర్జున్ రావుతో పాటు రెవిన్యూ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

లేత గెలలు అన్నీ అశ్వారావుపేట పరిశ్రమకే తరలించాలి

- ఆయిల్ఫెడ్ జీఎం టి.సుధాకర్ రెడ్డి

నవతెలంగాణ-అశ్వారావుపేట

నూతనంగా ప్రారంభం అయిన ఆయిల్ పాం సాగు నుండి 5 నుండీ 8 సంవత్సరాలు వయస్సు గల లేత తోటల పామ్ ఆయిల్ గెలలును అశ్వారావుపేట ఫ్యాక్టరీకి మాత్రమే తరలించాని ఆయిల్ ఫెడ్ జనరల్ మేనేజర్ టి.సుధాకర్ రెడ్డి సోమవారం ప్రకటించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, గద్వాల, నారాయణపేట, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట జిల్లాలో సాగు చేస్తున్న ఆయిల్ పాం సాగు దారులు తమ గెలలను అశ్వారావుపేట పరిశ్రమకు తరలించి సంస్థకు సహకరించాలని ఆయన కోరారు.

చనిపోయిన కుటుంబానికి రూ.25 లక్షలు ఇవ్వాలి

- ఇందిరమ్మ ఇల్లు కట్టించి ఇవ్వాలి

నవతెలంగాణ-మణుగూరు



మణుగూరు వరదల్లో చనిపోయిన బాధితులకు తక్షణ సహాయంగా రూ.10 లక్షలు, మొత్తం రూ.25 లక్షలు బాధిత కుటుంబానికి అందించాలని వరదల్లో మునిగిన ప్రతి కుటుంబానికి 5 క్వింటాళ్ల బియ్యం, 25 కిలోల పప్పు, నిత్యావసర సరుకులు అందజేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మణుగూరు కట్టవాగు వరద బాధితులు సర్వం కోల్పోయారని అన్నారు. ప్రతి కుటుంబానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇల్లు కూలిపోయిన వారికి ఇందిరమ్మ ఇల్లు కట్టించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ పోషం నరసింహారావు, పీఏసీఎస్ నాగేశ్వరరావు, మండల పట్టణ అధ్యక్షులు ముత్యం బాబు, అడప అప్పారావు, రాంబాబు, కృష్ణ, యాదగిరి గౌడ్, కుంట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య బృందాలను గ్రామాలకు పంపండి

- జ్వరాల నియంత్రణకు చర్యలు చేపట్టండి
- సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-చర్ల



చర్ల మండల వ్యాప్తంగా ప్రబలుతున్న విష జ్వరాల తీవ్రత అధికంగా ఉందని ఏ గ్రామంలో చూసినా ప్రతి ఇంట్లో ఒకరి నుంచి ముగ్గురు వరకు జ్వరాలతో బాధపడుతున్నారు. డెంగ్యూ, టైఫాయిడ్, చికెన్ గున్యా, వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో మండల వ్యాప్తంగా ఉన్న అన్నీ గ్రామాలకు ప్రత్యేక వైద్య బృందాలను పంపించాలని, ప్రతి ఒక్కరికీ రక్తపరీక్షలు చేయాలని, జ్వరాల నియంత్రకు చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మచ్చా రామారావు డిమాండ్ చేశారు. జ్వరాల తీవ్రతని తట్టుకోలేక అనేకమంది చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డెగ్యూ, చికెన్ గున్యాకి వైద్యం చర్లలో అందుబాటులో లేని కారణంగా గ్రామీణ వైద్యుల వద్ద వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారన్నారు. మండల కేంద్రంలో ఉన్న కామన్ హెల్త్ సెంటర్‌లో, కొయ్యూరు, సత్యనారయణ పురం ప్రాథమిక వైద్య శాలలో ఉన్నత డాక్టర్ చదువులు చదివిన వైద్యులను నియమించాలన్నారు. చిన్నమిడిసిలేరు గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. అదేవిధంగా మండల పరిధిలోని పూసుగుప్ప గ్రామంలో ప్రబలుతున్న విష జ్వరాల పై సంబంధిత అధికారులు దృష్టి సారించి వెంటనే వైద్య బృందాలను పంపించి వెంటనే వైద్యం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు సమ్మక్క, బాలాజి, బందెల చంటి, ఉడుగుల చార్వాణి, వరదల వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



నేడు లేబర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ధర్నా

నవతెలంగాణ-ఇల్లందు

సంక్షేమ బోర్డు ద్వారానే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాల అమలు చేయాలని, ఈ పథకాల అమలును ఇన్స్యూరెన్స్ కంపెనీలకు అప్పగించే టెండర్లు రద్దు చేయాలని నేడు లేబర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్టు సీఐటీయూ డిమాండ్ చేసింది. స్థానిక బిల్డింగ్ అడ్డా వద్ద జరిగిన సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ తాళ్లూరి కృష్ణ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మన్యం మోహన్ రావు, లక్ష్మణ్ పాసి, నాగరాజు, మహమూద్, రాజు, శ్రీను, విజయ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దానధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజనాల పంపిణీ

నవతెలంగాణ-మణుగూరు



దానధర్మ ట్రస్ట్ చైర్‌పర్సన్ గంటా రాధా ఆధ్వర్యంలో సోమవారం వరద బాధితులకు మండలం మేదర్ బస్తి కాలనీలో 250 కుటుంబాలకు పైగా భోజనాలు ఏర్పాటు చేసినట్టు రాధా తెలిపారు. కోడిపుంజుల వాగు, పాత పోలీస్ స్టేషన్, అశోక్ నగర్ కాలనీలో 60 మందికి భోజనాలు అందజేశారు. ఈ సందర్భంగా సహకరించిన ట్రస్ట్ సభ్యులకు దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దవాగు బ్రిడ్జికి మరమ్మతులు

- పనులను పరిశీలించిన ఇరిగేషన్, పోలీస్ శాఖ అధికారులు

నవతెలంగాణ-కరకగూడెం



కరకగూడెం, చిరమళ్ళ గ్రామాల ప్రధాన రహదారి పెద్దవాగు బ్రిడ్జి రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కోతకు గురైంది. పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సోమవారం ఇరిగేషన్ శాఖ ఎస్ఈ వెంకటేశ్వర రెడ్డి ప్రమాద భరితంగా ఉన్న బ్రిడ్జిని పరిశీలించారు. పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతో యుద్ధ ప్రతిపాదికన బ్రిడ్జి కోతకు గురైన ప్రాంతం వద్ద ఇరిగేషన్ శాఖ అధికారుల మరమ్మతులు నిర్వహిస్తున్నారు. అనంతరం ఏడుల్లా బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, స్థానిక ఎస్ఐ రాజేందర్ మండలంలో భారీ వర్షాలతో దెబ్బతిన్న రహదారులు, కరకగూడెం పెద్దవాగు బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండల ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు ఈఈ వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఈఈ రమేష్ బాబు, ఏఈ సాక్రు, పంచాయతీరాజ్ డీఈ రామనాథం, టీడీపీ రాష్ట్ర నాయకులు చందా మధు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, సీనియర్ నాయకులు యర్ర సురేష్, తదితరులు పాల్గొన్నారు.

లాభాల వాటా వెంటనే ప్రకటించాలి

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి సంస్థకు వచ్చిన వార్షిక లాభాలను యాజమాన్యం వెంటనే ప్రకటించాలని, కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని టిబిజికేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కొత్తగూడెం ఏరియాలోని అన్ని మైన్స్ డిపార్ట్మెంట్స్‌లలో రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కూసాన వీరభద్రం, ఏరియా వైస్ ప్రెసిడెంట్ గడప రాజయ్య ఆధ్వర్యంలో మైన్స్ మేనేజర్లకు, డిపార్‌మెంట్ ఇన్‌చార్జీలకు కొత్తగూడెం ఏరియా జీఎం.షాలేంరాజుకు మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గడిచిన 2023-24 ఆర్థిక సంవత్సరాల 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి అయిందని చెప్పారు. దాదాపు నాలుగు వేల కోట్ల పైన సంస్థకు లాభాలు వచ్చినట్లు ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారని తెలిపారు. సంస్థకు వచ్చిన లాభాన్ని సింగరేణి యాజమాన్యం వెంటనే ప్రకటించాలని, కార్మికులకు 35శాతం వాటా ఇవ్వాలని కోరారు. అధికారులకు ఇచ్చిన ఈ మెమోరాండంను చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ మెంబర్స్ కాగితపు విజయకుమార్, రాసూరి శంకర్, రాజ్ కుమార్, వెంకటేశ్వర్లు, అశోక్, రాజేందర్, రఫీ, నాగరాజు, కరీం, సత్యనారాయణ, సురేష్, రామకృష్ణ కోటి, కృష్ణ సాంబమూర్తి, దేవ్‌సింగ్, గణేష్, రమేష్, కుమార్, పూర్ణ చందర్, చందు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్

నవతెలంగాణ-కొత్తగూడెం



రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షాలకు కొత్తగూడెం మునిసిపాలిటీలో వర్షాలకు ఎక్కువగా ప్రభవితం అయ్యే అవకాశాలున్న ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మునిసిపల్ సిబ్బందితో అప్రమత్తంగా ఉంటున్నారు. సోమవారం రామవరంలోని ఎస్సీబీ నగర్ 12వ వార్డులో స్థానిక కౌన్సిలర్ విజయలక్ష్మితో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి పర్యటించారు. ఆయా వార్డు ప్రజలతో ఆమె మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్తగూడెం మునిసిపాలిటీ ఎస్సీబీ నగర్‌లో చేపట్టిన కల్వర్టు నిర్మాణం వలన ఎడతెరిపి లేకుండా పడిన వర్షానికి ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. 3వ వార్డులోని పాత కొత్తగూడెం ప్రాంతాన్ని స్థానిక కౌన్సిలర్ కౌడగానీ పరమేష్ యాదవ్‌తో కలిసి పర్యటించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న కొన్ని కుటుంబాలకు తగు సూచనలు చేస్తూ, అప్రమత్తంగా ఉండాలనిక కోరారు. వర్ష ప్రభావం ఎక్కువ అయ్యే పరిస్థితి ఉంటే వెంటనే పునరావాస కేంద్రానికి తరలి రావాలని కోరారు. వర్ష తీవ్రత తగ్గేంతవరకు మునిసిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శేష అంజనేయ స్వామి, డిఇ. రవి కుమార్, శానిటరి ఇన్‌స్పెక్టర్స్ అశోక్ చౌహాన్, వీరభద్రా చారీ, జవాన్లు నాగేశ్వరరావు, రాజేష్‌లు తదితరులు పాల్గొన్నారు.

మా ఇండ్ల స్థలాలు మాకు ఇప్పించండి

- తహసీల్దార్‌కు గ్రామస్తులు వినతి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

తమ పూర్వీకుల నుండి ఇల్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్న మా ఇంటి స్థలాలు మాకు ఇప్పించాలని కోరుతూ మండలంలోని కె వీరభద్రపురం గ్రామానికి గిరిజనులు సోమవారం తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కేశవపట్నం గ్రామంలో 83/1,83/2 సర్వే నెంబర్ గల 6 ఎకరాల 223/4 గుంటల స్థలాన్ని వేముల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి పేరిట పట్టా చేయించుకోవడం జరిగిందన్నారు. అట్టి భూమిలో తమ పూర్వీకులు సుమారు 30 కుటుంబాలు జీవనం సాగించేవారని పేర్కొన్నారు. 1986లో వచ్చిన గోదావరి వరదలకు మా గ్రామం నీట మునిగి ఇండ్లు మొత్తం కొట్టుకుపోవడం జరిగిందన్నారు. అప్పటి తహసీల్దార్ కే వీరభద్రపురం గ్రామంలో ఇంటి స్థలాలు కేటాయించడంతోపాటు ఇల్లు నిర్మించి ఇవ్వడం జరిగిందన్నారు. ఇంటి స్థలాలను పట్టా చేయించుకున్న సదరు వ్యక్తి పట్టా రద్దుచేసి తమకు న్యాయం చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన తహసిల్దార్ వారి నుండి వాంగ్మూలాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో గ్రామస్తులు పాండ్రు అచ్చిరాజు, ఎన్ జోగారావు, కాక బుచ్చిరాజు, అనసూర్య నరసమ్మ, జయమ్మ రత్తమ్మ, శివరావు, రమేష్, ఆదిలక్ష్మి తదితరులు ఉన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో హుచ్‌మెన్ వర్ధంతి

నవతెలంగాణ-ఇల్లందు

వియత్నాం విప్లవ వీరుడు హెచ్ మెన్ వర్ధంతి సందర్భంగా మండలంలోని సుందరయ్య నగర్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆలేటి కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో అబ్దుల్ నబి పాల్గొని మాట్లాడుతూ దశాబ్దాల క్రితం వియత్నాంలో ఉన్న ఫాసిస్టు పాలన, దోపిడీ, అణిచి వేతకు వ్యతిరేకంగా హెూచ్ మెన్ కార్యకర్తలను కార్యోన్ముఖులను చేసే కార్యచరణలో కార్యకర్తలు ఇప్పుడున్న పరిస్థితులలో విప్లవం జయప్రదం కావడం సాధ్యం కాదని అంటే స్వయంగా తానే విప్లవ సాధనే లక్ష్యంగా దేశం మొత్తం పర్యటనకు శ్రీకారం చుట్టారన్నారు. మంచి కమ్యూనిస్టు ఎలా ఉండాలో అనేక రచనలు చేసిన మహనీయుడు హెూచ్ మెన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేటీ కిరణ్ కుమార్ మన్యం మోహన్ రావు, ఎండీ జైబున్నిసా, అబ్బాస్, కోడెం బోస్, విజయ్ మోహన్ సింగ్, సోమకృష్ణ, బాయమ్మ, రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన గెలల దిగుబడి, ధర

- ఆగస్టులో టన్ను ధర రూ.14392
- టన్నుకు రూ.564 పెరుగుదల

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఆయిల్ ఫాం గెలలు దిగుబడి, ధర జులై నెలతో పోల్చితే ఆగస్టులో స్వల్పంగా పెరుగుదల కనిపిస్తుంది. ఆ నెలలో గెలలు 22 వేల టన్నులు రాగా గడిచిన నెలలో 35810 టన్నులు దిగుబడి అయ్యాయి. ధర సైతం ఆ నెలలో టన్ను గెలలు రూ.13828లు ఉండగా గత నెలకు టన్ను గెలలు ధర రూ.14392లుగా ఆయిల్ ఫెడ్ సోమవారం ప్రకటించింది. దీంతో జులై నెల కంటే ఆగస్టులో టన్నుకు రూ.564లు పెరిగింది. దీంతో ధర పెరిగినప్పటికీ గతేడాది కంటే ఈ ఏడాది గెలలు దిగుబడి తగ్గిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఆగస్టులో 40 టన్నుల గెలలు దిగుబడి ఉండగా ఈ ఏడాది గడిచిన ఆగస్టులో 35810 టన్నులు మాత్రమే దిగుబడి వచ్చింది.

నెల	ధర	వ్యత్యాసం
జనవరి	12,681	
ఫిబ్రవరి	13,135	+ 454
మార్చి	14,174	+ 1,039
ఏప్రియల్	14,229	+ 55
మే	13,438	- 791
జూన్	13,705	+ 267
జులై	13,828	+ 123
ఆగస్ట్	14,392	+ 564



24 గంటలు బురదలో మేదరబస్తీ వాసులు

- అధికారులు సందర్శించలేదని రాస్తారోకో

నవతెలంగాణ-మణుగూరు



శనివారం రాత్రి సృష్టించిన వరద బీభత్సం కారణంగా నివాస గృహాల్లోకి సింగరేణి బొగ్గు బురద పేరుకుపోయింది. 24 గంటలైనా మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని సోమవారం మేదరబస్తీ వాస్తులు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మణుగూరు ప్రధాన రహదారిపై బైఠాయించి మాట్లాడారు. ఇంతవరకు మున్సిపాలిటీ సిబ్బంది, కమిషనర్, తహసీల్దార్ వచ్చిన దాఖలా లేవంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు మా గ్రామానికి రావాలని నినాదాలు చేశారు. మంచినీళ్లు లేక తినడానికి సరైన తిండి లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. తక్షణమే సహాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి

- సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

నవతెలంగాణ-పాల్వంచ



ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసిన అభ్యర్థులను వివరాలను అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని శాఖల వారీగా అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్‌లో కొన్ని ఫిర్యాదులు ఇలా ఉన్నాయి జూలూరుపాడు మండలం మాచినపేట గ్రామానికి చెందిన బి.ప్రవీణ్ అమ్మానాన్నను చిన్నప్పుడే చనిపోయినందున ఇంటర్ వరకు చదువుకున్న తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అట్టి దరఖాస్తును పరిశీలించి జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్‌కు ఎండార్స్ చేశారు. రుద్రంపూర్‌కు చెందిన జోగు చంద్రావతి వికే-7 వల్ల తమ ఇల్లు కూల్చివేశారని, 100 గజాల స్థలం ఇచ్చారని, ఇల్లు కట్టుకునేందుకు ఇందిరమ్మ ఇల్లు పథకంలో అవకాశం కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ హౌసింగ్ శాఖకు ఎండార్స్ చేశారు. పాల్వంచ నవభారత్ పాఠశాల, గాంధీ నగర్ ఏరియా చెందిన విద్యార్థులు స్థానికులు తమ ఏరియాలో కోతులు బెడద అధికంగా ఉందని వీటి విషయంలో, తాము ఇబ్బందులు పడుతున్నామని వినతిపత్రం అందజేయగా దరఖాస్తును పరిశీలించి సంబంధిత మున్సిపల్ శాఖ అధికారులకు ఎండార్స్ చేశారు. వివిధ మండలాల నుంచి వచ్చిన సంబంధిత దరఖాస్తును పరిశీలించి కలెక్టర్ ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు.

ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్డీఓ విద్యా చందన,వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలి

నవతెలంగాణ-బూర్గంపాడు



మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల నష్ట పోయిన రైతులను ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకో వాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కృష్ణసాగర్ పంచాయతీ పరిధిలో బత్తుల నగర్ గ్రామంలో సోమవారం వర్షం వల్ల నష్టపోయిన పంట పొలాలను ఆయన పరిశీలించి, మాట్లాడారు. వర్షాల వల్ల పత్తి, వరి రైతుల పంట పొలాలన్నీ బాగా దెబ్బతిని కొట్టుకొని పోయాయి అన్నారు. ఒక బత్తుల నగర్ గ్రామంలో సుమారు 50 ఎకరాల పత్తి పంట వర్షానికి దెబ్బతిని కొట్టుకుపోయిందని ఆయన పేర్కొన్నారు. నష్ట పరిహారం ప్రభుత్వం వెంటనే చెల్లించాన్నారు. ఈ కార్యక్రమంలో సోందె గోవిందు, జలక లక్ష్మయ్య కృష్ణ, కుర్స తిరుపతమ్మ, సోడే శాంత, పొందె కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు నిధులను టెండర్ల ద్వారా ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించొద్దు

- యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మచారి
- నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా : సీఐటీయూ

నవతెలంగాణ-కొత్తగూడెం



భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను టెండర్ల ద్వారా ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వటాన్ని వ్యతిరేకిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సిఐటియూ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు, ఈ ధర్నాను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మచారి విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెంలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీసమావేశంలో బ్రహ్మచారి మాట్లాడారు. వెల్ఫేర్ బోర్డు సిఐటియు ఆధ్వర్యంలో అనేక సంవత్సరాల నుంచి పోరాడితే 2007 సంవత్సరంలో చట్టం చేసి 2009 నుంచి అమలు చేస్తున్నారు. భవన నిర్మాణ కార్మికలకు సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులు పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు చనిపోతే రూ.6 లక్షల 30వేలు, సాధారణ మరణానికి రూ.1లక్ష 30వేలు, పెండ్లి, ప్రసూతి కానుకలు రూ.30వేలు, ఇలాంటి పథకాలు కొన్ని అమలైతున్నప్పటికీ గత ప్రభుత్వ హయాంలో నిధులు పెంచే ప్రయత్నం చేయలేదని ఆరోపించారు. బోర్డుకు అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనంటూ సంక్షేమ బోర్డు నిధులను టెండర్ల పేర్లతో ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పచెబితే చిన్న చిన్న కారణాలు చెప్పి పథకాన్ని నీరుగారిచే పరిస్థితి ఏర్పడుతుందని ఆరోపించారు. బోర్డును ప్రభుత్వమే నిర్వహించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగినది.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, పట్టణ నాయకులు లిక్కి బాలరాజు పాల్గొన్నారు.

మందులు కొరత ఉంటే నా దృష్టికి తీసుకురావాలి

- ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్
- రోగులకు అందుతున్న సేవలు గురించి ఆరా
- పరిసరాల అపరిశభ్రతపై ఆగ్రహం

నవతెలంగాణ-కొత్తగూడెం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జిల్లా సరోజన ఆస్పత్రిని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సోమవారం సాయంత్రం ఆకస్మికంగా పరిశీలించారు. ఇటీవల ఆసుపత్రి తీరు...మందుల కొరత....ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పడ్డ పరిశుభ్రతపై వార్త కథనాలు వెలువడిన నేపథ్యంలో కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. ఆసుపత్రిని స్వయంగా పరిశీలించారు. హాస్పిటల్ ప్రాంగణంలో డ్రైనేజీ ఏరులై పారుతున్న తీరుపై సంబంధిత అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆది ఆసుత్రిఏనా....? అని, దీని వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఈ విషయంలో సంబంధిత కాంటాక్ట్ నుంచి నివేదిక కావాలని కోరారు. ఆసుపత్రి ప్రాంగణంలోని అపరిశుభ్రంగా ఉన్నట్లయితే వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మందుల కొరకు ఉన్నట్టు తన దృష్టికి వచ్చిందని ఏఏ మందుల కొరత ఉందో వెంటనే నివేదిక అందజేయాలని ఆదేశించారు. డ్యూటీ డాక్టర్లకు ప్రత్యేక రుమ్‌ల ఏర్పాటు చేస్తామన్నారు. వార్డులో రోగులను పలకరించారు. వారికి అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, ఆసుపత్రి సూపరింటెండెంట్,వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో భారజల ఉద్యోగుల కాలనీ

- పవర్ ప్లాంట్‌లోకి నీళ్లు రావడంతో సరఫరా నిలిపివేత
- అవస్థలు పడుతున్న కాలనీవాసులు

నవతెలంగాణ-అశ్వాపురం



మండల కేంద్రంలోని భారజల ఉద్యోగుల నివాస కేంద్రమైన గౌతమి నగర్ కాలనీలో గత రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇక్కడి వాసులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. తీవ్రమైన వర్షాభావంతో మునుపెన్నడూ లేని విధంగా ఆకస్మికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తాగునీటితో పాటు నిత్యవసరాలకు వాడుకోవలసిన నీళ్లు కావలసినన్ని నీటి సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అయితే విద్యుత్ సరఫరా నిలపకముందు ప్లాంట్ ద్వారా ఇక్కడి ట్యాంకులకు కొన్ని నీళ్లను నింపడంతో ఆ నీటిని రోజుకో గంటా, రెండు గంటల వరకు నీటిని సరఫరా చేస్తున్నారు. హెవీ వాటర్ ప్లాంట్‌ను తీవ్రమైన వర్షాలు, వరదల కారణంగా క్యాపిటల్ పవర్ ప్లాంట్, సిపిపిలోకి నీళ్లు రావడంతో ముందస్తు జాగ్రత్తగా కర్మాగార ఉన్నతాధికారులు ప్లాంటును పూర్తిగా ట్రిప్ చేశారు.

ప్లాంటును ఆన్ చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న అధికారులు

వరుణుడు శాంతించడంతో సోమవారం మండలంలో వాతావరణం పొడిగానే ఉంది. దీంతో ప్లాంటులో వరద నీరు సైతం పూర్తిగా ఖాళీ అవ్వడంతో భారజల అధికారులు హెవీ వాటర్ ప్లాంట్‌ను పునర్ ప్రారంభించేందుకు కర్మాగార అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ కర్మాగారంలో పవర్ సరఫరా యూనిట్లు కూడా పూర్తిగా నిలిపివేయడంతో మరలా వీటిని పునరుద్ధరించేందుకు సన్నగా చర్యలు చేపడుతున్నారు.

నోటరీ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలి

- కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని

నవతెలంగాణ-కొత్తగూడెం



నోటరీ న్యాయవాదుల నియామకం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ కోరారు. సోమవారం కొత్తగూడెం బార్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో దాదాపు 40 వేల మంది న్యాయవాదులు ప్రాక్టీస్ చేస్తున్నారన్నారు. అందులో దాదాపు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన న్యాయవాదులు ఎక్కువ మంది ఉన్నారని, వారు పూర్తిగా వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు విడుదల చేసిన నోటిఫికేషన్ తర్వాత నేటి వరకు రాష్ట్ర నోటరీ నోటిఫికేషన్ విడుదల చేయలేదని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమాలు పోరాటాలలో న్యాయవాదులు అత్యంత చురుకైన పాత్ర పోషించారని గుర్తుచేశారు.

ఈ 13 సంవత్సరాల కాలంలో నోటరీ నోటిఫికేషన్ లేక ఒక్క నోటరీ నియామకం కూడా జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెంటనే స్పందించి నోటరీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, తెలంగాణ న్యాయవాదులకు భరోసా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు దూదిపాల రవికుమార్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి తనిఖీలో ఎమ్మెల్యే తెల్లం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఏజెన్సీ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ఉన్నాయని విష జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు కోరారు. సోమవారం భద్రాచలం ఏరియా హాస్పిటల లో సీజనల్ వ్యాధులతో ఇబ్బంది పడుతున్న రోగులను పరామర్శించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ... వైద్యులు ఎవరు కూడా సెలవులు తీసుకోకుండా అందుబాటులో ఉంటూ హాస్పిటల్‌కి వచ్చిన ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలని ఆదేశించారు. అనంతరం హాస్పిటల్‌లో ఉన్న ప్రజలతో మాట్లాడి వైద్యులు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ ముదిగొండ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రావు, మండల నాయకులు రత్నం రమాకాంత్, బొంబోతుల రాజీవ్, భోగాల శ్రీనివాస్ రెడ్డి, అరికెల తిరుపతిరావు, నర్రా రాము, భీమవరపు వెంకటరెడ్డి, పుల్లగిరి నాగేంద్ర, రసమళ్ళ రాము, గాడి విజయ్, ఆకుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పక్షపాతి వైయస్ రాజశేఖర్ రెడ్డి

- వర్ధంతి వేడుకల్లో ఎమ్మెల్యే తెల్లం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసి ప్రజాపక్షపాతి ముఖ్యమంత్రిగా డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి చిరకాలం ప్రజల గుండెల్లో నిలిచే ఉంటారని భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు అన్నారు. రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక పాత మార్కెట్‌లో ఉన్నటువంటి వైయస్ఆర్ విగ్రహానికి తెల్లం వెంకట్రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెల్లం మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతు రుణమాఫీ, రైతులకు ఉచిత విద్యుత్ ఉచిత అంబులెన్స్ సేవలు, ఫీజు రీయింబర్స్మెంట్ ప్రారంభించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రత్నం రమాకాంత్, రాజీవ్, శ్రీనివాస్ రెడ్డి, రాము, సుధాకర్, భీమవరపు వెంకటరెడ్డి, చెగొండి శ్రీనివాస్, చింతాడి రామకృష్ణ, నాగేంద్ర, రసమళ్ళ రాము, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి : రైతుల ఆత్మబంధువు ఉమ్మడి రాష్ట్ర దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి అని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన 15వ వర్ధంతిలో ఎమ్మెల్యే పాల్గొని వైయస్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బత్తుల అంజి, మాజీ సొసైటీ చైర్మెన్లు పర్వతనేని అమర్నాథ్, కృష్ణ, మాజీ సొసైటీ వైస్ చైర్మెన్, మంగపతి, అభిమానులు పాల్గొని నివాళులు అర్పించారు.

దుమ్ముగూడెం : మండల కేంద్రమైన లక్ష్మీనగరం గ్రామంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి 15 వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్ఆర్ అభిమానులు ఘనంగా నిర్వహించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు గద్దం బాలాజీ మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు లంక శ్రీనివాసరావు, స్వామి, కెల్లా శేఖర్, సత్యనారాయణ రెడ్డి, జిల్లా సోషల్ మీడియా మాజీ అధ్యక్షులు కనుబుద్ది దేవా, గ్రామస్తులు పాల్గొన్నారు.

మణుగూరు : వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి మణుగూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రజా భవన్ నిర్వహించారు. ఎమ్మెల్యే పాయం వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినాకి నవీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి : ఎమ్మెల్యే కోరం కనకయ్య నాయకత్వంలో టేకులపల్లి బోడు రోడ్ సెంటర్లో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు సోమవారం అర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు భూక్యా దేవా నాయక్, ఎస్‌సీ సెల్ జిల్లా కన్వీనర్ రసమళ్ళ నరసయ్య, జిల్లా మహిళా జనరల్ సెక్రటరీ బండ్ల రజిని, జిల్లా నాయకలు సురేందర్, గణేష్, మధు రెడ్డి, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

పినపాక : ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో వైయస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి మండల అధ్యక్షులు గొడిశాల రామనాథం నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు బషీరుద్దీన్, గున్నయ్య, లక్ష్మారెడ్డి, సాంబ, వెంకటేశ్వర రెడ్డి, నిశాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వైయస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

బూర్గంపాడు మండల కేంద్రంతో పాటు సార పాక, రెడ్డిపాలెం, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలను నిర్వహించారు. బూర్గంపాడులో కాంగ్రెస్ పార్టీ నాయకులు భజన ప్రసాద్, భజన సతీష్, మందా నాగరాజుల ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు నిర్వహించారు. సారపాక ప్రధాన సెంటర్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, వైఎస్ఆర్ అభిమానులు వర్ధంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంక టేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ భట్టా విజయ్ గాంధీ, మండల మహిళా బీ-బ్లాక్ అధ్యక్షురాలు బర్ల నాగమణి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి : మండల పరిధిలోని రాజపురం గ్రామంలో గల ప్రధాన సెంటర్ నందు వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు దుబాకుల రాము ఆధ్వర్యంలో పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, లాలయ్య, నాగిరెడ్డి, ప్రసాద్, రాజేష్, గణపతి రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోండి : టీడీపీ

నవతెలంగాణ-ఇల్లందు

రాష్ట్రవ్యాప్తంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వరదలకు లోతట్టు ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వారికి సరైన సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలని టిడిపి నియోజకవర్గ నాయకులు ముద్రగడ వంశీ సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వరదల వల్ల చనిపోయిన మృతులకు తక్షణమే రూ.ఐదు లక్షల నష్టపరిహారం ప్రకటించాలన్నారు. ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తక్షణ సహాయం కింద ఐదు కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | సెప్టెంబర్ 03, 2024 | www.navatelangana.com

సహాయక చర్యలు ముమ్మరం చేయాలి

- విలేకరుల సమావేశంలో ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పుట్టెడు దుఃఖంతో ఉన్న ప్రజల్ని ఆదుకునేందుకు సహాయక చర్యలు మరింత ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు.తక్షణ సహాయక చర్యలు చేపట్టడంలో జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఘోరంగా విఫలమయ్యారని వరద బాధితులు ఆక్రోశంతో ఉన్నారని అన్నారు. తొలుత ప్రముఖులతో కలిసి మున్నేరు వరద ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలించిన అనంతరం ఖమ్మం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇటువంటి



విపత్తులు చోటు చేసుకున్నప్పుడు తమ బీఆర్ఎస్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టి ప్రజల్ని కాపాడే వాళ్లమన్నారు. హెలికాప్టర్స్‌ను వెంటనే రంగంలోకి దింపే వాళ్లమని, ఎటువంటి ప్రాణ నష్టమూ జరుగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకునే వాళ్లమమన్నారు. ముంపు ప్రాంతాలలో తిరిగినప్పుడు బాధితుల కష్టాలు, వారికి జరిగిన నష్టాన్ని చూసి కన్నీళ్లు పెట్టుకున్నామన్నారు. కనీవినీ ఎరుగని రీతిలో మున్నేరు ఉగ్రరూపం దాల్చిందని, గతేడాది వరద వచ్చినప్పుడు సహాయక చర్యలు చేపట్టడడం జరిగిందన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో తాను, పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామ తదితర పెద్దలతో పాటు కలిసి వరద శాశ్వత నివారణకు కరకట్ట నిర్మాణానికి 690కోట్లు మంజూరు చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. ముంపునకు గురైన ప్రాంతాలలో ఇండ్లు బురదతో నిండి ఉన్నాయని, పాములు తిరుగాడుతున్నాయని, సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వరద కారణంగా ప్రాణాలు కోల్పోయిన తొమ్మిది మందికి ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు 25లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. అదే విధంగా వరదలో కొట్టుకుపోయి అశ్విని, ఆమె తండ్రి మోతీలాల్ మృతి చెందడం తీవ్ర బాధాకరమన్నారు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువ శాస్త్రవేత్త అశ్విని అకాల మృతి దురదృష్టకరమన్నారు. ఆమె కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. వరదల కారణంగా దెబ్బతిన్న ఇండ్లకు తక్షణ సహాయం కింద 2లక్షలు, నిత్యావసర వస్తువులు అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సహాయక చర్యల్లో బీఆర్ఎస్ శ్రేణులు చురుగ్గా పని చేస్తున్నాయన్నారు. విష జ్వరాలు ప్రబలకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సలహానిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రాకేష్‌రెడ్డి, ఆర్జేసీ కృష్ణ, పగడాల నాగరాజు, బమ్మెర రాంమూర్తి, శీలంశెట్టి వీరభద్రం, తోట రామారావు, తోట వీరభద్రం, గుండ్లపల్లి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్
- కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

నవతెలంగాణ-పాల్వంచ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ వెంకటేశ్వర్లు, రేపాకుల శ్రీనివాస్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా, చికెన్ గున్యా జ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం వెంటనే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రజలు ప్రాణాలు కాపాడాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులలో ప్లేట్ లెట్స్ మిషన్లు లేక రోగులను ప్రైవేటు ఆసుపత్రులకు పంపిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో



డెంగ్యూ, టైఫాయిడ్, చికెన్ గున్యా, మలేరియా పరీక్షలు చేసేవిధంగా సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని, ప్రతి కుటుంబానికి దోమ తెరలు పంపిణీ చేయాలని, గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో ఫాగింగ్ చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం స్వీకరించిన జిల్లా కలెక్టర్ రక్తం పరీక్షల నిర్వహణకు కావలసిన పరికరాల కోసం ఆర్డర్ పెట్టామని, ఖాళీ పోస్టుల భర్తీకి, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శెట్టి వినోద, మర్మం చంద్రయ్య, జిల్లా కమిటీ సభ్యులు తేజావత్ వెంకన్న, కోట బాలక్రిష్ణ, సిద్దెల రాములు, రఘు, జబ్బ సంధ్యారాణి, నాగదుర్గ, రుహీన, మెస్సు రామకోటమ్మ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచిన వర్షం

- 640 ఎకరాలలో పత్తి, 500 ఎకరాలలో వరి నష్టం

నవతెలంగాణ-బూర్గంపాడు

వదలని వర్షం బూర్గంపాడు మండలంలోని రైతులను నట్టేట ముంచింది... గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. నిన్నటి, మొన్నటి వరకు గోదావరి, కిన్నెరసాని నది పరి వాహక ప్రాంతాల్లో వరద గోదావరి, కిన్నెరసాని నది ఉధృత వల్ల నష్టపోయిన రైతులు ఇప్పుడిప్పుడే కోరుకుంటున్న తరుణంలో భారీ వర్షం రైతులను కోలుకోలేని దెబ్బ కొట్టింది. కిన్నెరసాని గోదావరి నది పరివాహ ప్రాంతంలో గోదావరి వరద వల్ల నష్టపోయిన రైతులు మరలా వరి పంట వేసేందుకు నారుమడులు సిద్ధం చేసుకున్నారు. మరికొందరు రైతులు వరి నాట్లు సైతం వేసు కున్నారు. ఆగస్టు గండం ముగిసింది కదా.. సెప్టెంబర్లో పంటలకు ఎలాంటి ఇబ్బందులేదని అను కుంటున్నా క్రమంలో రైతులను భారీ వర్షం అతలాకుతలం చేసింది. వ్యవసాయ శాఖ అధికారులు వర్షం వల్ల నష్టపోయిన రైతుల పంటపొలాలను సర్వే చేసింది. ప్రాథమికంగా బూర్గంపాడు మండలంలో 640 ఎకరాలలో పత్తి పంట తీవ్రంగా



దెబ్బతిందని అంచనాలు చేశారు. అదే విధంగా 500 ఎకరాల్లో వరి పంట పూర్తి గా దెబ్బతిన్నట్లు సర్వేలో తేలింది. మరికొంత నష్టం జరిగే అవ కాశం ఉందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండల పరిధిలోని సంజీవరెడ్డిపాలెం సమీపంలోని చింతలచెరువు పూర్తిస్థాయిలో నిండి గండి పడే ప్రమాదం ఉండటంతో రైతుల విజ్ఞప్తి మేరకు తహశీల్దార్ ముజాహిద్ సోమవారం చెరువును సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎంపీపీ, రైతు కైపు రోశిరెడ్డిని చెరువు సామర్థ్యం, ఎంతమంది రైతులు ఈ చెరువు ఆయకట్టు కింద పంటలు సాగుచేస్తున్నారని అడిగి తెలుసుకుని గండి ప్రమాదం ఉండటంతో గండి పడకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ. ముత్తయ్య, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

నీటమునిగిన పొలాలను పరిశీలించిన ఏవో

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద కారణంగా మండలంలో నీటమునిగిన పొలాలను మండల వ్యవసాయాధికారి శంకర్ సోమవారం ఏఈవోలతో కలిసి పరిశీలించారు. మండల కేంద్రమైన బూర్గంపాడుతో పాటు నాగినేని ప్రోలు రెడ్డిపాలెం, కొమ్ము నకిరిపేట, పోలవరం, కృష్ణసాగర్ తదితర గ్రామాల్లో రైతులు వేసిన వరి, పత్తి పంటలను పరిశీలించారు. వరద తాకిడికి వేసిన పత్తి, వరి పూర్తిగా కొట్టుకు పోవడంతో రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లినట్లు గుర్తించి పంట నష్టం అంచనా వేశారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందిస్తుందని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు ప్రసాద్, శృతి, వైష్ణవి, రైతులు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తా...

- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

నవతెలంగాణ-చంద్రుగొండ

మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. వరద సమస్యతో ఇబ్బందులు పడ్డ లబ్ధిదారుల నుండి సమస్యలను సోమవారం అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, సిసి రోడ్ల నిర్మాణం ఇండ్ల మరమ్మత్తులు వంటి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వరదల సమయంలో అధికారులకు సహకరించాలని కోరారు. ఈ



కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాలేరు జలాశయం నీటి ఉధృతిని పరిశీలించిన సీఎం

నవతెలంగాణ-కూసుమంచి



పాలేరు జలాశయానికి ప్రమాద స్థాయిలో వరద చేరుకుంది. మండలంలోని నాయకన్‌గూడెం గ్రామం వద్ద బైపాస్‌రోడ్‌పై నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం పాలేరు జలాశయం నీటి ఉధృతిని, తెగిపోయిన పాలేరు పెద్ద కాల్వను, దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉన్నారు.



నష్టపోయిన కుటుంబాలను అదుకోవాలి

- ముంపు ప్రాంతాలను పరిశీలించిన సీపీఐ(ఎం)

నవతెలంగాణ-కారేపల్లి

భారీ వర్షాలతో పంటలు, ఇండ్లు, అస్తినష్టం జరిగిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లాకమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆది, సోమవారాలలో వరదలతో నష్టపోయిన పంటలను, వరద ముంపు ప్రాంతాలను సీపీఐ(ఎం) బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా కారేపల్లిలో కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతులు సాగు చేస్తున్న పత్తి, మిర్చి, వరి ఇతర పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన ప్రతి రైతుకి న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. పేదల నివాసాలు వర్షాలకు దెబ్బతిన్నాయని వారి తక్షణమే పక్కా ఇండ్లు మంజూరు చేయాలన్నారు. దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్తు లైన్లను యుద్ధప్రాతిపదికను మరమ్మత్తులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. వర్షాలతో విష జ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు గ్రామాలలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆకేరు వాగులో కొట్టుకపోయిన మృతి చెందిన గంగారంతండాకు చెందిన యువ శాస్త్రవేత్త నునావత్ అశ్విని, నూనావత్ మోతిలాల్ కుటుంబానికి ప్రభుత్వం ఎక్ష్రేషియా ప్రకటించి అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. కస్తూర్బా గాంధీ విద్యాలయంను ముంపు నుండి రక్షించటానికి విద్యాలయం వైపు కరకట్ట నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) కారేపల్లి మండల కార్యదర్శి కే.నరేంద్ర, నాయకులు వజ్జా రామారావు, రేగల మంగయ్య, తలారి దేవప్రకాష్ దాసరి మల్లయ్య, కొండబోయిన ఉమాపతి, బానోత్ బన్సీలాల్, యనమనగల రవి, భూక్య లక్ష్మణ్, పండగ కొండయ్య, కరపటి సీతారాములు, పాపినేని నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నూతన ఎస్సైగా షేక్ సైదా రహూఫ్ బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-అశ్వాపురం



అశ్వాపురం పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా షేక్ సైదా రహూఫ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యువకులు చెడు వ్యాసనాలకు బానిసలు కాకుండా సన్మార్గంలో నడుస్తూ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని కోరారు.

పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలి

నవతెలంగాణ-జూలూరుపాడు



జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం మెయిన్ రోడ్డు సెంటర్లో గల రెవెన్యూ భూమి సర్వేనెంబర్ 264 /ఆ లో ఉన్న రెండు కుంటల రెవెన్యూ భూమిలో కొంత భూమిని పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించడం కోసం వెంగన్నపాలెం గ్రామపంచాయతీకి కేటాయించాలని కోరుతూ సోమవారం జూలూరుపాడు ఎంఆర్ఓకి వినత పత్రం అందించడం జరిగిందని భారతీయ గోర్ బంజారా పోరాట సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు బానోత్ దుర్గాప్రసాద్ బహుజన్ సమాజ్ పార్టీ జూలూరుపాడు మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు, టిడిపి నాయకులు కారం బాబు, బిఎస్పి మండల కార్యదర్శి గార్లపాటి సైదులు తదితరులు పేర్కొన్నారు. ఈఎస్‌జి నిధుల్లో నుంచి వెంగన్నపాలెం మెయిన్ సెంటర్ నందు పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించుట కొరకు నిధులు కేటాయించాలని కోరుతూ మండల ఏపీఓకి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

రక్తదాన శిబిరం

నవతెలంగాణ-జూలూరుపాడు

మండల కేంద్రంలోనీ స్థానిక ప్రభుత్వాసుపత్రిలో జెపిఆర్ ఫౌండేషన్, పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షుడు శిరంశెట్టి వినోద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు డాక్టర్ తేజస్విని, జి జి ఎస్, డాక్టర్ సౌమ్య ,సిహెచ్‌ఓ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, జెపిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఇడుపుల రాజు, శీరం శెట్టి నరేష్, గౌతమ్, రాజు, విజయ్, అభిలాష్, గాంధీ, సాయి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెగిన చెరువులు, రహదారులకు వెంటనే మరమ్మతులు చేయాలి

వరద బాధితులను ఆదుకోవాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

గత రెండు రోజుల నుండి కురిసిన వర్షాల కారణంగా తిరుమలాయపాలెం మండలంలో చెరువులు, కుంటలు, రహదారులు తెగిపోయిన చోట వెంటనే ప్రభుత్వం మరమ్మతులు చేయాలని, వరదకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొమ్ము శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో తెగిపోయినటువంటి రహదారులు, చెరువులు, కుంటలను వారు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బీభత్సానికి సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలన్నారు. పంటనష్టపోయిన రైతులను ఆదుకొని, రహదారులను పునర్ధరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు తుళ్లూరు నాగేశ్వరరావు, అంగిరేకుల నరసయ్య, బింగి రమేష్, పప్పుల ప్రసాద్, మహేందర్, మాచర్ల రాజశేఖర్, తంగేళ్ల రమేష్, కొత్తపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మున్నేరు ఉధృతితో లారీల నిలిపివేత

కల్లూరు : భారీ వర్షాల కారణంగా ఖమ్మం మున్నేరు వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో భారీ వాహనాలను పట్నం పరిధిలోని ఎన్ఎస్పీ క్రాస్ రోడ్ వద్ద నిలిపి వేస్తున్నారు. సోమవారం జిల్లా అధికారుల చూసిన మేరకు ఎస్సై ఎస్.కె షాకీర్ భారీ వాహనాలను కల్లూరు ఎన్ఎస్పి సెంటర్ నుండి ఖమ్మం వైపు వెళ్లకుండా ఆపేస్తున్నారు. ప్రజలు కూడా అవసరం అయితేనే తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలు చేయాలని, అనవసరంగా బయటికి రావద్దు అన్నారు.

ఇద్దరు వృద్ధులు మృతి బాధాకరం

- చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే పాయం

నవతెలంగాణ-అశ్వాపురం

మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా తోగువాగు వరద ఉధృతికి కొట్టుకుపోయి ఇద్దరు మృతి చెందడం బాధాకరమని కలెక్టర్ జితేష్ వీ.పాటిల్ అన్నారు. సోమవారం మొండికుంటలోని యూనియన్ బ్యాంక్ సమీపంలో మరణించిన వెంకటాపురం గ్రామానికి చెందిన కల్లూరి నీలమయ్య, తాటి ఆదెమ్మ కుటుంబాలకు చెరో రూ. 5 లక్షల చొప్పున వారి కుటుంబ సభ్యులకు



చెక్కులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో ఆయన అందజేశారు.

వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం

మండలంలోని మొండికుంటలో వరద ముంపుకు గురైన ఇండ్లను ఎమ్మెల్యే పాయం సందర్శించి బాధితులతో మాట్లాడారు. అదేవిధంగా తుమ్మల చెరువు అలుగు ఉధృతిని పరిశీలించి నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. వరదల కారణంగా నష్టాలకు గురైన వారిని ప్రభుత్వం ఆదుకునేలా తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లిపాక పిఎసిఎస్ అధ్యక్షులు తుక్కాని మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీలు కొల్లు మల్లారెడ్డి, ముత్తినేని సుజాత, మాజీ ఎంపీటీసీలు కమటం నరేష్ బేతం రామకృష్ణ, నాయకులు ఓరుగంటి బిక్షమయ్య, గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, తూము రాఘవులు పాల్గొన్నారు.

ముగ్గురు మంత్రులుండి ఏం లాభం..?

- తుఫాను బీభత్సవానికి నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి
- జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ లింగాల కమల రాజు

నవతెలంగాణ- ఎర్రుపాలెం

గత మూడు రోజుల నుండి కురుస్తున్నటువంటి భారీ వర్షాలకు జిల్లాలో ముగ్గురు మంత్రులు వుండి కూడా వరద బాధితులను పట్టించుకోలేదని పునరావాస కేంద్రాలలో ఉన్న వారికి కావాల్సిన ఆహారాన్ని మంచి నీటిని సరఫరా చేయలేదని బాధితులు ఆవేదన చెందుతున్నారని జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ లింగాల కమల్‌రాజు విమర్శించారు. తొలుత మండల పరిధిలోని అగ్రహారం గ్రామానికి చెందిన మలిశెట్టి సాంబశివరావు (20) గత మూడు రోజుల క్రితం వాగు దాటే క్రమంలో కొట్టుకొని పోయి మరణించిన సంగతి పాఠకులకు విదితమే. ఆ విషయాన్ని తెలుసుకొని వారి కు టుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి తీవ్ర ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆ కుటుంబానికి ప్రభుత్వ పరంగా 25 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేసియా చెల్లించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భీమవరం గ్రామంలో మాజీ జెడ్పిటిసి శీలం కవిత గృహంలో జరిగిన సమావేశంలో కమల్ రాజు మాట్లాడుతూ ఇంతటి దారుణ మైన విపత్కర పరిస్థితిలో జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయడంలో విఫలమయ్యారని, వరధ బాధితులను ఆదుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందారని విమర్శించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పంబి సాంబశివరావు, మాజీ వైస్ ఎంపీపీ సూరనేని రామకోటేశ్వరరావు, నాయకులు యన్నం శ్రీనివాస్ రెడ్డి, సంక్రాంతి కృష్ణారావు, మల్లికార్జున్ రెడ్డి, కోట శ్రీనివాసరావు, ఎర్రమల భాస్కర్‌రెడ్డి, సగ్గుర్తి కిషోర్ బాబు, శేగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మందడపు చినబాబు, ఇనుపనూరి భాస్కరరావు, గద్దల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదల గొంతుక 'పాటి వెంకటి'

- ప్రలోభాలతో ప్రజా ఉద్యమాలను బలహీనపర్చేయత్నం

నవతెలంగాణ-కారేపల్లి

పేదల గొంతుక అమరజీవి పాటి వెంకటి అని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.నరేంద్ర అన్నారు. సోమవారం కారేపల్లి మండలం చీమలపాడులో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులుపాటి వెంకటి 12వ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా కే.నరేంద్ర మాట్లాడుతూ ఎర్రజెండాయే పేదలకు అండగా ఉంటుందని, కడవరకు నమ్మిని నికార్సైన నేత పాటి వెంకటి అని కొనియాడారు. పాలకులు ఎవరైనా ప్రజలకు భ్రమలు కల్పించి అధికారం చేపట్టటం తర్వాత ప్రజలను మోసం చేయటం రివాజుగా మారిందన్నారు. పాలకుల తీరుపై ప్రజాగ్రహంతో చేస్తున్న ఉద్యమాలను ప్రలోభాలు, మత, కుల విద్వేషాలతో బలహీనపర్చే ఎత్తుగడలను బూర్జువా పార్టీలు అనుసరిస్తున్నాయన్నారు. చట్ట సభలకు పేదలు వెళ్లే పరిస్థితి లేదని, ఎన్నికలలో కోటానుకోట్లు ఖర్చు పెట్టే స్థోమత ఉన్న వారే వెళ్తున్నారన్నారు. ఎన్నికలలో కోట్లు ఖర్చు చేసిన వారు తమ స్వలాభం తప్ప ప్రజా సేవ ఎలా చేస్తారని ప్రశ్నించారు. కార్పొరేట్లకు రూ.16 లక్షల కోట్లు రుణాలు రద్దు చేసిన కేంద్రం రైతుల రుణమాఫీపై మాత్రం స్పందించటం లేదన్నారు. మనువాద భావజాల ప్రభావంతో దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకు ముందు పాటి వెంకటి స్తూపం వద్ద సీపీఐ(ఎం)



పతాకాన్ని మన్నెం బ్రహ్మయ్య అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు వజ్జా రామారావు, పండగ కొండయ్య, వల్లేబోయిన కొండలరావు, సూరభాక సర్వయ్య, మూడు శోభన్ నాయక్, ఎరిపోతు భద్రయ్య, రాచబంటి పుల్లయ్య పోతురాజు చంద్రావు, పాటి రంగయ్య, షేర్ వెంకటేశ్వర్లు, మాలోతు హనుమ, ధరావత్ రవి, రాచర్ల రణధీర్, భూక్య శ్రీను, మాలోత్ శ్రీను, రాచర్ల విజయ్, వాంకుడోత్ రామకోటి, షేరు లలితమ్మ రాచర్ల జాలమ్మ, పుసులూరి లక్ష్మణరావు, పాటి రాంబాబు, లచ్చు తదితరులు పాల్గొన్నారు

సామాన్యులకు చట్టం...బడాబాబులకు చుట్టమా

- అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు
- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్

నవతెలంగాణ-పాల్వంచ

జిల్లా కేంద్రంలో నిభందనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ యెర్రా కామేష్ సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వీ. పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ సామాన్యులకు ఒక చట్టం డబ్బున్న బడాబాబులకు ఒక చట్టం అనేలా మున్సిపల్



అధికారుల వ్యవహారశైలి ఉందని, పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా 30వ వార్డు మధురబస్తీలో అనుమతులు లేకుండా అక్రమ సెల్లార్ నిర్మాణం చేస్తున్నా, అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు నోటీసులతో చేతులు దులుపుకుని అటువైపు కన్నెత్తి చూడటం లేదని ఆరోపించారు. స్థల యజమాని రాజకీయ అండదండలు ఉన్నాయనే ధీమాతో జాతీయ రహదారిపై ఇసుక, కంకర, ఐరన్ రాడ్డులను రహదారిపై వేసినా అధికారాలు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. ఇండ్ల ముందు పూల కుండీలు పెట్టుకుంటే నోటీసులు ఇచ్చి కుండీలను తీసుకొని వెళ్ళిన మున్సిపల్ అధికారులు బస్టాండ్ వద్ద, సెయింట్ మేరీస్ స్కూల్ ఎదురుగా, శాంతన్ బాబు కంటి ఆస్పత్రి పక్కన జరుగుతున్న అక్రమ నిర్మాణాల జోలికి ఎందుకు పోవడం లేదని ప్రశ్నించారు? జిల్లా కేంద్రంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై, అధికారుల వ్యవహారశైలిపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు, సుజాత, లత, మురళి తదితరులు పాల్గొన్నారు.



గల్లంతైన ఇద్దరిలో ఒకరి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-కూసుమంచి

మండలంలోని నాయకన్ గూడెం గ్రామం వద్ద పాలేరు జలాశయం వరద ఉధృతికి ఆదివారం గల్లంతైన ఇద్దరిలో యాకూబ్(50) మృతదేహాన్ని సోమవారం పోలీసులు గుర్తించారు. మరొకరి కోసం అధికారులు గాలిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజామిల్‌ఖాన్ మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వపరంగా అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ అండ్ సైన్స్ స్వయం ప్రతిపత్తి కళాశాలలో ఖాళీగా ఉన్న వివిధ సబ్జెక్టులలో బోధించడానికి కళాశాల విద్యా కమిషనర్ ఉత్తర్వుల మేరకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ 1, హిస్టరీ 3, ఎకనామిక్స్ 1, పొలిటికల్ సైన్స్ 2, కామర్స్ 1, గణితం 3, బి.సి.ఏ 1, డేటా సైన్స్ 1, బయోటెక్నాలజీ 1 ఖాళీలున్నట్లు వెల్లడించారు.అభ్యర్థులు తమ దరఖాస్తులను 4వ తేదీ బుధవారం సాయంత్రం 5గంటల వరకు అన్ని సర్టిఫికెట్ల జిరాక్సులను జతచేసి కళాశాల కార్యాలయంలో అందజేయాలని కోరారు. జనరల్, బి.సి అభ్యర్థులకు పీజీలో 55శాతం, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు 50శాతం మార్కులతో పాటు నెట్, సెట్, పిహెడి అదనపు అర్హతలు ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఇంటర్వ్యూలకు 5వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు కళాశాలలో జరుగుతాయని, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

వైయస్ఆర్ వర్ధంతి

నవాతెలంగాణ-అశ్వాపురం

మండల కేంద్రంలోని కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయులు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి15 వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. తొలుతాయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ సీనియర్ నాయకులు గాదే కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, మాజీ ఎంపిటిసి బేతం రామకృష్ణ, ఎక్కటి సత్యనారాయణరెడ్డి, మాదినేని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కులగణనపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి డిమాండ్
- గాంధీఆస్పత్రిలో సంజయ్‌కుమార్, బత్తు సిద్ధేశ్వర్‌కు పరామర్శ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కులగణనపైనా, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపైనా అఖిపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులగణన చేపట్టాలనీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్, బీసీ మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్ధేశ్వర్ తదితరులను సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవి రమణ, పి ఆశయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా డిజి నరసింహారావు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లపై దీక్ష చేస్తున్న వారిని ప్రభుత్వం అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. తొమ్మిది రోజులుగా దీక్ష చేస్తున్న వారికి సంఘీభావం ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా కులగణన చేపట్టాలనీ, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కులగణనపై నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని విమర్శించారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలనీ, అప్పుడే దీనికి చట్టబద్ధత వస్తుందని అన్నారు. 50 శాతం రిజర్వేషన్ మించరాదన్న సుప్రీం కోర్టు తీర్పునకు అడ్డు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విపత్తు సమయంలో ప్రజలకు అండగా ఉందాం

- పనిగంటలతో సంబంధం లేకుండా పనిచేద్దాం
- సహాయ కార్యక్రమాల్లో పాల్గొందాం

ప్రభుత్వ ఆదేశాలను పాటిద్దాం : తెలంగాణ ఉద్యోగ జేఏసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరద సహాయ, పునరావాస కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఉద్యోగులు, అధికారులకు తెలంగాణ ఉద్యోగ జేఏసీ అభినందనలు తెలిపింది. ప్రకృతి విపత్తులు సంభవించిన ప్రస్తుత సమయంలో ప్రజలకు అండగా ఉండాలని పిలుపునిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలను పాటించాలనీ, పనిగంటలతో సంబంధం లేకుండా నిర్విరామంగా పనిచేయాలని కోరింది. సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలనీ, ప్రజలను కాపాడుకోవాలనీ, సంపదను పరిరక్షించుకోవాలని సూచించింది. ఈ మేరకు తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మెన్, టీఎన్జీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్, టీజీవో అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న వర్ష బీభత్సానికి రాష్ట్రంలో మారుమూల ప్రాంతాల నుంచి పట్టణాల వరకు జనజీవనం స్థంభించిపోయిందని తెలిపారు. ప్రజలు ధన, ప్రాణ, పశు పక్షాదులు, వ్యవసాయ పంటలు, సంపదలకు తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ప్రభుత్వంలో భాగమైన ఉద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ప్రజలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. వరద సహాయ కార్యక్రమాల్లో నిర్విరామంగా పాల్గొనాలని కోరారు. ఇలాంటి క్లిష్ట సమయంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రజలకు ప్రాణనష్టం రాకుండా సహాయం చేయడానికి పనిగంటలతో సంబంధం లేకుండా పనిచేయాలని సూచించారు. ఉద్యోగులు, అధికారులు ఉన్నారంటూ మరింత నిబద్ధతతో పనిచేసి ప్రజల్లో భరోసా కల్పించాలని తెలిపారు.

సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- మాజీమంత్రి వి శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ అధికారంలోకొచ్చి తొమ్మిది నెలలు కావొస్తున్నదనీ, సర్పంచులకు పెండింగ్ బిల్లులు ఎందుకు చెల్లించలేదని మాజీమంత్రి వి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌ల పరిస్థితి దారుణంగా ఉందన్నారు.రూ.1300 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

నూతన ఆర్థిక విధానాలతో వ్యవసాయ రంగం దివాలా

- ప్రతి ఉద్యమం రైతాంగ పోరాటాలతోనే ప్రారంభం : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు
- ముగిసిన రైతు శిక్షణా తరగతులు
- ఎకరానికి రూ.25వేలు నష్టపరిహారం ఇవ్వాలని తీర్మానం

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి



దేశంలో నూతన ఆర్థిక విధానాలు తెర మీదకు వచ్చిన తర్వాత వ్యవసాయ రంగం క్రమంగా దివాలా తీస్తూ వస్తోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం సైతం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్ శక్తుల చేతిలో పెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. వీటిపై క్షేత్రస్థాయిలో ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని రాందాస్‌పల్లి శుభం కన్వెన్షన్ హాల్‌లో మూడు రోజులుగా జరుగుతున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర శిక్షణా తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ.. కార్మిక, కర్షక ఐక్య ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోగలుగుతామన్నారు. బ్రిటిష్ పాలన నుంచి భారతదేశాన్ని విముక్తి చేసుకోవడంలోనూ రైతాంగ ఉద్యమాలు కీలకంగా పని చేశాయన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సైతం రైతుల భాగస్వామ్యంతోనే 10వేల ఎకరాల భూములను ఎర్రజెండా నాయకత్వంలో పంపిణీ చేసిందన్నారు. అందులో భాగంగానే ప్రధాని మోడీ నాయకత్వంలో తీసుకువచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం బలమైన ఉద్యమాన్ని నిర్వహించి, విజయం సాధించిందన్నారు. చివరికి ఆ నల్ల చట్టాలను వెనక్కి తీసుకోక తప్పలేదని తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో ఆర్ఆర్ చట్టం తీసుకొచ్చిన తర్వాత అనుభవదారు కాలమ్ లేకుండా చేశారని, ఈ కాలాన్ని భూమాత యాప్‌లో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కౌలు రైతులు నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భూసేకరణ చేస్తే 2013 సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాలను ప్రస్తుత ప్రభుత్వం చేయొద్దని విన్నవించారు.

రెండు తీర్మానాలకు అమోదం

మూడు రోజుల పాటు జరిగిన రాజకీయ శిక్షణా తరగతుల్లో రెండు తీర్మానాలను ప్రతినిధులు ఆమోదించారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించి, రైతును ఆదుకోవాలని సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేసింది. వాణిజ్య పంటలకు రూ.50వేల, మెట్ట పంటలకు రూ.50వేల చొప్పున నష్టపరిహారం అందజేయడంతో పాటు మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు, గాయపడిన కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేయాలని, మృత్యువాత పడిన పశువులకు నష్టపరిహారం అందజేయాలని తీర్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీని అర్హులందరికీ ఏకకాలంలో మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు సైతం రుణమాఫీ చేసి ఆదుకోవాలని కోరారు. రేషన్ కార్డు ప్రామాణికంగా కాకుండా రుణం పొందిన వారందరికీ రుణాలను మాఫీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, రాష్ట్ర నాయకులు పీ.జంగారెడ్డి, మూడ్ శోభన్, బొంతల చంద్రారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచందర్, మధుసూదన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మండల అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణారెడ్డి, ముసలయ్య, శ్రీనివాసరెడ్డి, విక్రమ్, ప్రజా సంఘాల నాయకులు, ఉన్నారు.

ఆన్‌లైన్‌లో కోట్లు కొల్లగొట్టారు..

- సైబర్ నేరస్తుల అరెస్టు : వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు అందిస్తామని మోసానికి పాల్పడుతూ ఆన్‌లైన్‌లో ప్రజల నుంచి కోట్ల రూపాయలను కొల్లగొట్టిన తమిళనాడుకు చెందిన ఒక మహిళతో సహా ఇద్దరు సైబర్ నేరగాళ్లను వరంగల్ పోలీస్ కమిషనరేట్ సైబర్ విభాగం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వీరి నుంచి చెక్‌బుక్కులు, క్రెడిట్, డెబిట్ కార్డులు, పెన్ డ్రైవ్‌లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించిన వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మీడియాకు వెల్లడించారు. తమిళనాడులోని తాంబరం పట్టణానికి చెందిన జసిల్(38), ప్రీతి(32).. పెట్టిన పెట్టుబడికి ఎక్కువ డబ్బులు తిరిగి వస్తాయని ప్రజలను నమ్మిస్తూ తప్పుడు ప్రచారం చేస్తూ.. గోల్డ్‌మ్యాన్ సచ్, యాం బ్రాండింగ్స్ అనే వెబ్‌సైట్లలో ప్రజలతో భారీ మొత్తంలో డబ్బు పెట్టుబడి పెట్టించారు. వీటి కోసం ప్రయివేటు బ్యాంకుల్లో ఖాతాలు తెరవగా.. జమ అయిన డబ్బులను విత్ డ్రా చేసి జల్సాలు చేసేవారు. ఇలా వారి ఉచ్చులో చిక్కుకున్న.. హన్మకొండకు చెందిన ఒక వ్యక్తి.. నకిలీ వెబ్‌సైట్లలో సుమారు రూ.28 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు. ఈ విషయమై అతను.. వరంగల్ సైబర్ క్రైమ్ విభాగం పోలీసులను ఆశ్రయించారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ ఏసీపీ విజయ్‌కుమార్ అధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు టెక్నాలజీ అధారంగా నిందితులను గుర్తించి.. నిన్న (ఆదివారం) చెన్నైలోని సలయూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో అరెస్టు చేశారు. స్థానిక జిల్లా కోర్టులో హజరుపర్చిన అనంతరం సైబర్ విభాగం పోలీసులు నిందితులను సోమవారం ఉదయం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు తీసుకువచ్చారు. కాగా, వీరు ఈ నకిలీ వైబ్‌సైట్ల ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 150కిపైగా సైబర్ నేరాలకు పాల్పడి ప్రజలను మోసం చేసి పెట్టుబడుల రూపంలో కోట్ల రూపాయలు వసూళ్లకు పాల్పడినట్టు విచారణలో నేరస్తులు అంగీకరించారు. అలాగే, నిందితులు వినియోగించిన బ్యాంక్‌ఖాతాల లావాదేవీలను నిలిపివేసినట్టు సీపీ తెలిపారు. ఈ సందర్భంగా ఈ సైబర్ నేరస్తులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైమ్స్ ఏసీపీ విజయ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్‌ఐలు చరణ్‌కుమార్, శివకుమార్, ఏఏఓ సల్మాన్‌పాషా, కానిస్టేబుళ్లు రాజు, ఆంజనేయులు, దినేష్, అనూషలను పోలీస్ కమిషనర్ అభినందించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ రవి పాల్గొన్నారు.

వాస్తవాలను విశ్లేషిస్తే బెదిరింపులా?

- ప్రొఫెసర్ కె నాగేశ్వర్ పై ఈటల అనుచరులు బెదిరింపులు మానుకోవాలి : కేవీపీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకులు, మేధావి ప్రొఫెసర్ కె నాగేశ్వర్‌ను మల్కాజ్‌గిరి ఎంపీ నాయకులు ఈటల రాజేందర్ అనుచరులు వరుసగా ఫోన్లు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ, టి స్కైలాబ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్షణమే ఆ బెదిరింపులు మానుకోవాలనీ, పోలీసు ఉన్నతాధికారులు నాగేశ్వరకు రక్షణ కల్పిస్తూ, బెదిరింపులకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో, దేశంలో జరుగుతున్న పరిణామాలను రోజువారీగా విశ్లేషిస్తూ ప్రజలకు వాస్తవాలను తెలియజేస్తున్న నాగేశ్వర్ పై ఈటల అనుచరులు బెదిరింపులకు పాల్పడటం అప్రజాస్వామిక చర్య అని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు నిరాధారమైతే ఈటల ప్రెస్ మీట్ ద్వారా లేదా మరో వీడియో ద్వారా తన అభిప్రాయాలు తెలియజేయొచ్చునని గుర్తు చేశారు. భావ ప్రకటన స్వేచ్ఛను సైతం హరించే బీజేపీ ఆర్ఎస్ఎస్ నియంత పోకడలు ప్రజాస్వామ్యంలో కుదరదని హెచ్చరించారు. ఇప్పటికైనా నాగేశ్వర్‌పై బెదిరింపులకు పాల్పడిన దానికి సంబంధించి ఈటల రాజేందర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

హాస్టల్ వెల్ఫేర్ అధికారుల సమస్యలు పరిష్కరించాలి

- టీఎన్జీవో కేంద్రసంఘం డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని హాస్టల్ వెల్ఫేర్ అధికారుల సమస్యలను పరిష్కరించాలని టీఎన్జీవో కేంద్రసంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని టీఎన్జీవో కార్యాలయంలో సంక్షేమ అధికారుల రాష్ట్రసంఘం ఆధ్వర్యంలో అత్యవసర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. వసతి గృహ సంక్షేమ అధికారుల రాష్ట్ర ఫోరం అధ్యక్షులు ఎండీ ఖాజా గౌస్ మొయినుద్దీన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా టీఎన్జీవోస్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేని, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్, ముజీబ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభంలో వసతి గృహాలకు సరుకుల సరఫరా కోసం టెండర్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పిలుస్తున్నారని చెప్పారు. అందులో పాల్గొన్న గుత్తేదారులు టెండర్లు తీసుకున్న తర్వాత సంక్షేమ హాస్టళ్లకు నామమాత్రంగా ఒకటి లేదా రెండు నెలలు మాత్రమే సరుకులను సరఫరా చేస్తున్నారని అన్నారు. మెనూ తయారు చేసేటప్పుడు కిరాణా సరుకులకు ఎక్కువ ధర, గుడ్లు, చికెన్, మటన్, పాలు, కూరగాయలకు తక్కువ ధర వేసి టెండర్లను పిలుస్తున్నారని వివరించారు. గురుకుల పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులుఉండడం వల్ల అక్కడ టెండర్ వేసి, సంక్షేమ హాస్టళ్లలో టెండర్లు వేయడానికి ముందుకు రావడం లేదన్నారు. అధికారుల ఒత్తిడితో టెండర్ వేసి, తూతూ మంత్రంగా ఒకటి, రెండు నెలలు సరఫరా చేసి తర్వాత చేయడం లేదని ఆరోపించారు. గుత్తేదారులు సరఫరా చేయకపోవడం వల్ల ఆ భారం వసతి గృహ సంక్షేమ అధికారులపై పడుతున్నదని అన్నారు. సిలిండర్ గ్యాస్‌కు టెండర్లు వేయకపోవడం వల్ల సంక్షేమ హాస్టళ్ల అధికారులే భరిస్తున్నారని చెప్పారు. హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరాయన్నారు. వంటమనిషి, కామాటి, శానిటేషన్ వర్కర్, వాచ్‌మెన్లను నియమిస్తే పిల్లలకు ఎక్కువ న్యాయం జరుగుతుందని చెప్పారు. మెస్‌చార్జీలు ఆరు నుంచి ఎనిమిది నెలలకోసారి చెల్లిస్తున్నారని అన్నారు. గ్రీన్ చానెల్ ద్వారా ప్రతినెలా వచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన సరుకులు వచ్చేలా చూడాలని కోరారు.

ముప్పేటా వరద ముప్పు

- ఎటు చూసినా (క)న్నీరే.. ● రెండ్రోజులుగా జలదిగ్బంధనంలోనే ప్రజలు ● సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం

ఎడతెరిపి లేని వర్షాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి.. వరదలు ముప్పేటా ముప్పు తెచ్చాయి. ఎటు చూసినా వరదే కనిపిస్తోంది. వరదల నుంచి ఇప్పుడిప్పుడే బయట పడటం కనుచూపు మేరలో కనిపించడం లేదు. మూడ్రోజులుగా భారీ నుంచి మోస్తరు వర్షాలు ఏకధాటిగా కురుస్తుండటంతోపాటు.. ఎగువ రాష్ట్రాల నుంచి వరదలు పోటెత్తడంతో ప్రాజెక్టులు, చెరువులు, వాగులు నిండి గ్రామాలను నీరు చుట్టుముట్టింది. ఇండ్లన్నీ జలదిగ్బంధమయ్యాయి. ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలతోపాటు సూర్యాపేట జిల్లాల్లో వరదలు అపార నష్టాన్ని మిగిల్చాయి. ప్రజలంతా రెండ్రోజులుగా వరదల్లోనే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులు, సీపీఐ(ఎం), ఇతర రాజకీయ పార్టీల నేతలు ముంపు ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలు చేపడుతున్నారు. కొట్టుకుపోయిన రోడ్లు, రైల్వే ట్రాక్‌లకు తాత్కాలిక మరమ్మతులపై అధికారులు పరిశీలించారు. తక్షణం చర్యలకు ఉపక్రమించారు.

నవతెలంగాణ- మొఫసిల్ యంత్రాంగం



రెండ్రోజులుగా దంచికొడుతున్న వానలతో కరీంనగర్ ఉమ్మడి జిల్లా తడిసి ముద్దయింది. కాసేపు గెరువిస్తూ.. కాసేపు కుండపోతగా వాన కురిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 3268 చెరువుల్లో దాదాపు 2వేల చెరువులన్నీ మత్తడి దూకుతున్నాయి. కల్వర్టులు ఉధృతంగా ప్రవహిస్తుండగా.. పంట చేలు జలసంద్రమయ్యాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మూలవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మామిడిపల్లి- నిజామాబాద్, వెంకట్రావుపేట- బావుసాయిపేట, వట్టిమల్ల-నిమ్మపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం జవారిపేట-నర్సక్కపేట గ్రామాల మధ్య బిక్కవాగు ఉధృతితో రాకపోకలు నిలిచిపోయాయి. వేములవాడ పట్టణ శివారులోని కోనాయిపల్లి బుడగజంగాల కాలనీలోని లోతట్టు ప్రాంతాన్ని వరద ముంచెత్తడంతో గుడిసెల్లోకి వరద చేరింది. బాధితులను అధికారులు సురక్షిత ప్రాంతానికి తరలించి నిత్యావసర సరుకులు అందించారు.

గల్లంతైన ఇద్దరు మృతి

కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జంపేట కారోబార్ పవన్ కొత్తపల్లి-మల్యాల సమీపంలోని నక్కలవాగు కల్వర్టు వద్ద బైక్‌పై ప్రయాణిస్తుండగా.. ప్రవాహంలో కొట్టుకుపోయాడు. సాయంత్రం మృతదేహం లభ్యమైంది. ఇదే మండలం కునారం చెరువులో చేపల వేటకు వలలు కట్టేందుకువెళ్లిన గోస్కులు కుమార్(45) సైతం వరద ప్రవాహంలో గల్లంతై చనిపోయాడు.

పంట పొలాల్లో ఇసుక మేటలు

సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఈదురుగాలులకు ఇండ్ల రేకులు లేచిపోయాయి. ముకుందాపురం ఎస్సీ కాలనీలో45 ఇండ్లలోకి నీరు చేరడంతో రాత్రంతా నిద్ర లేకుండా జాగారం చేశారు. వరద నీటికి అడ్డుగా వున్న చర్చి గోడను పగలకొట్టడంతో సమస్య తగ్గింది. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. చెర్వులు, వాగుల కింద సాగు చేసిన వరి పొలాల్లో ఇసుక మేటలు పేరుకుపోయాయి. నడిగూడెం మండల పరిధిలోని రామచంద్రపురం గ్రామం వద్ద గండి పడిన సాగర్ ఎడమ కాలువను ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతి, జిల్లా అధికారులతో కలిసి భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. బొల్లం మల్లయ్య యాదవ్ కూడా పరిశీలించారు. చివ్వెంల మండలంలో చాలా గ్రామాలకు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.



వాగుల ఉగ్రరూపం..

నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలంలో వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పంట పొలాలు జలమయమయ్యాయి. పల్లి, పత్తి, వరి చేలు నీట మునిగాయి. జిల్లా కేంద్రంలోని 11వ వార్డులో నసీం బేగం, సాధికా బేగం, జహీర్ ఇండ్లు కూలాయి. వాటిని సీపీఐ(ఎం) జిల్లా నాయకత్వం పరిశీలించింది. గండీడు, మహ్మదాబాదు మండలాల్లో రహదారులు తెగిపోయాయి. జడ్చర్ల నియోజకవర్గంలో ప్రభుత్వ నియోజకవర్గ ఆస్పత్రి 24 గంటలుగా వరద నీట్లోనే ఉంది. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని కోడూరు గ్రామ శివారులో కస్తూర్బా విద్యాలయం చుట్టూ నీరు చేరింది. భారీ వర్షాలతో రైల్వే బ్రిడ్జి కింద నీరు నిల్వ ఉండటంతో శాశ్వత పరిష్కారం కోసం అధికారులతో మాట్లాడుతామని మహబూబ్‌నగర్ ఎంపీ డికె. అరుణ అన్నారు.

వర్షాలు పైన.. వరదలు ఇక్కడ..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షం లేకపోయినప్పటికీ ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా వరద కష్టాలు కొనసాగుతున్నాయి. శని, ఆదివారాల్లో ఉమ్మడి జిల్లాలో కురిసిన వర్షాలతో జనజీవనం అతలాకుతలం కాగా, సోమవారం వర్ష భయం కొంత వీడినా వరద ముప్పు మాత్రం తగ్గలేదు. ఎగువన మహారాష్ట్ర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు.. అక్కడి ప్రాజెక్టుల నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో ఆ ప్రభావం జిల్లా మీద పడుతోంది.

పెన్‌గంగ ఉగ్రరూపం

తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దున ఉన్న పెన్‌గంగ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పెన్‌గంగ బ్రిడ్జికి ఆనుకొని ప్రవహిస్తుండటంతో పరివాహక ప్రాంతాల్లో పంట పొలాలు నీటమునిగాయి. ఉమ్మడి ఆదిలాబాద్‌లో ప్రాణహిత నది సైతం ఉధృతంగా ప్రవహిస్తోంది. బ్యాక్ వాటర్ కారణంగా పలు పంట పొలాలు నీటిలోనే ఉండిపోయాయి. బేల మండలం సాంగిడి, బెదోడా గ్రామాలను మూడు వైపులా వరద నీరు చుట్టుముట్టడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.



ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయడంతో వరద ఉధృతి వల్ల నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం సావేల్-తడపాకల్ గ్రామాల మధ్యన గోదావరి నదిలో ఉన్న సాంబయ్య ఆశ్రమంలోని ముగ్గురు సాదువులు సంతోష్, నారాయణ, ముత్తెన్న అక్కడే చిక్కుకుపోయారు. వీరిని ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సురక్షింతంగా బయటకు తీసుకొచ్చింది.

వర్షపు నీటిలో పోలామా కమ్యూనిటీ

రంగారెడ్డి జిల్లాలో శేరిలింగంపల్లిలో అత్యధికంగా కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో ఎమ్మెల్యే గాంధీ పర్యటించి, పరిస్థితిని సమీక్షించారు. శంకర్‌పల్లి మండలంలోని మోకిలా పోలామా కమ్యూనిటీలో 212 విల్లాలు ఉన్నాయి. అందులో 1000 మంది వరకు ఉంటున్నారు. వర్షాలకు పోలామా కమ్యూనిటీ ఏరియా మొత్తం మోకాళ్ల లోతు నీటితో నిండిపోయింది. ఘటనా స్థలాన్ని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పరిశీలించారు. ఈ ప్రాంతంలో గతంలో చెరువు ఉండేదని తెలుస్తోంది. అధికారులు విల్లాల నిర్మాణాలకు పర్మిషన్స్ ఇవ్వడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందని ఎమ్మెల్యే ఆరోపించారు. హిమాయత్‌సాగర్‌ను కలెక్టర్ శశాంక్ పరిశీలించారు.



రైల్వే ట్రాక్‌లను పరిశీలించిన డీఆర్ఎం



మహబూబాబాద్ జిల్లా కే సముద్రం మండలలోని తాళ్ల పూసలపల్లి, ఇంటికన్నె రైల్వే స్టేషన్‌ల సమీపంలో భారీ వర్షానికి దెబ్బతిన్న రైలు పట్టాలను డీఆర్ఎం అరుణ్ కుమార్ జైన్ పరిశీలించారు. ఈ రెండు స్టేషనులను ఎక్కువ సిబ్బంది, మిషనరీ ఉపయోగించి త్వరలో మరమ్మతులు పూర్తి చేసి రైలు రాకపోకలకు అనుకూలంగా చేస్తామని తెలిపారు.

నిండు కుండలా జంట జలాశయాలు

మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలు హైదరాబాద్ నగరాన్ని అతలాకుతలం చేశాయి. నగరంలో 9 సెంటీమీటర్ల మేర వర్షం కురియడంతో అనేక ప్రాంతాలను వరదలు ముంచెత్తాయి. వీధులు, కాలనీలు చెరువులను, జలాశయాలను తలపించాయి. వరద నీరు రోడ్లపై ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెట్లు పెద్దఎత్తున కూలిపోయాయి. జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌తో పాటు హుస్సేన్ సాగర్‌లోకి పెద్దఎత్తున్న వరద నీరు చేరుతోంది. బంజారా, పికెట్, కూకట్‌పల్లి, బుల్కాపూర్ నాలాల నుంచి పెద్దఎత్తున వరద నీరు వస్తుండటంతో హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. హుస్సేన్ సాగర్ ఫుల్ ట్యాంక్ లెవెల్ దాటడంతో అధికారులు నాలుగు గేట్లు ఎత్తి దిగువన ఉన్న మూసీ నదికి నీటిని వదిలారు.

మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని పైతర గ్రామ పటేల్ చెరువు, పించెరువు నిండుకుండలా మారి అలుగులు పారాయి. మెదక్, సిద్దిపేట జిల్లాల్లో ఇండ్లు దెబ్బతిన్నాయి. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల కేంద్రంలోని పాత చెరువు అలుగుకు గుర్తు తెలియని వ్యక్తులు గండి కొట్టారు. బెజ్జంకిలో వాగులో జాలరి గల్లంతయ్యారు.

తెగిన సీతారామ ప్రాజెక్టు కాలువ

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం బంద్రిగుండ పంచాయతీ పరిధిలో కోయ గట్టు గ్రామంలో సీతారామ ప్రాజెక్టు కాలువ తెగింది. కరకగూడెం మండలంలో కరకగూడెం, చిరమళ్ళ గ్రామాల ప్రధాన రహదారి, పెద్దవాగు బ్రిడ్జి కోతకు గురైంది. ఇరిగేషన్ శాఖ ఎస్ఈ వెంకటేశ్వర రెడ్డి బ్రిడ్జిని పరిశీలించారు. వరదలతో దెబ్బతిన్న ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డు బ్రిడ్జి మరమ్మతు పనులను ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పరిశీలించారు.











వాసన పోగొట్టాలంటే..

అందరి ఇండ్లల్లో ఫ్రిజ్ కామన్ అయిపోయింది. చాలా రకాలుగా అది మనకు ఉపయోగపడుతున్నది. కూరగాయల దగ్గర నుంచి మొదలుపెడితే... కూరలు, పిండ్లు, పొడులూ అన్నీ అందులో తోసే స్తున్నాం. ఇలా ఫ్రిజ్‌లో రకరకాలు ఉండటం వల్ల ఫ్రిజ్ నుంచి ఒక్కోసారి వాసన వస్తూ ఉంటుంది. ఈ వాసన కాస్త ఇబ్బందిగా ఉంటుంది. దానిని పోగొట్టాలంటే.. ఈ చిట్కాలను ఒకసారి ప్రయత్ని ంచండి. ఫ్రిజ్‌లోంచి వచ్చే వాసన పోతుంది.

ఎక్కడి నుంచి వస్తుంది:

ఫ్రిజ్ నుంచి దుర్వాసన ఎక్కడి నుంచి వస్తుంది అనేది గుర్తించాలి. వెంటనే వాటిని తొలగించండి. అలాగే ఆహార పదార్థాలు పెట్టి మర్చిపోవడం వల్ల కూడా బ్యాడ్ స్మెల్ వస్తుంది. కాబట్టి ముందు అవేంటో గుర్తించి.. వాటిని తొలగించండి.

నిమ్మతొక్కలతో..

కూరగాయలు, ఆహార పదార్థాలు, పువ్వులు చాలా త్వరగా కుళ్లిపోతూ ఉంటాయి. వీటి వలన ఫ్రిజ్ మొత్తం చెడు వాసన వస్తుంది. ఇలా రాకుండా ఒక చిన్న ప్లేట్ లేదా గిన్నె తీసుకోండి. అందులో నిమ్మ తొక్కలు, ఉప్పు, బేకింగ్ సోడా వేసి పెట్టండి. ఇది డియోడరైజర్‌గా పని చేస్తుంది. ఇది ఫ్రిజ్‌లో ఏదో ఒక చోట పెట్టండి. ఫ్రిజ్ నుంచి చెడు వాసన రాకుండా చేస్తుంది. ▪



ఆ ప్రపంచమే అమానవీయం...

సినిమా అంటేనే రంగుల ప్రపంచం. అందరినీ ఆకర్షించే రంగం. ఒక్కసారి స్క్రీన్‌పై కనిపిస్తే చాలని కోరుకునే వారు ఎందరో. అందుకే అవకాశాల కోసం వస్తున్న మహిళలపై లైంగిక దాడులు ఎక్కువైపోయాయి. తమపై జరుగుతున్న లైంగిక దోపిడీని బయటకు చెప్పకోలేక లోలోపలే కుమిలిపోతున్న నటీమణులు ఎందరో. అటువంటి పరిశ్రమ లో మహిళల రక్షణను పరిశీలించేందుకు కేరళ ప్రభుత్వం ముందు కొచ్చింది. మలయాళ చిత్రసీమలో జరుగుతున్న లైంగిక వేధింపులపై జస్టిస్ హేమ కమిటీ ఏర్పాటు చేసింది. ఆ కమిటీ నివేదించిన అంశాలు ఇప్పుడు దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. సినీ మాఫియా గుట్టు బయట పెట్టాయి.



2017లో నమోదైన ఓ కేసు ఆధారంగా మలయాళ చిత్రసీమలో మహిళా కళాకారులు ఎదుర్కొంటున్న వేధింపులను పరిశీలించడానికి కేరళ ప్రభుత్వం జస్టిస్ కె.హేమ అధ్యక్షత ఓ ప్యానెల్‌ను నియమించింది. ఆ కమిటీ తమ నివేదికను 2019లో అందించింది. అయితే అందులోని విషయాలు బహిర్గతం చేయాలంటూ



కొన్ని డిమాండ్లు రావడంతో ఇటీవలే ఆ కమిటీ తన నివేదికను కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రికి అందజేసి తీసుకోవల్సిన చర్యలు, జాగ్రత్తలను కూడా తెలిపింది.

సెక్స్ కోసం అందుబాటులో ఉండాలి

పరిశ్రమలోకి అడుగుపెట్టగానే మహిళలపై వేధింపులు కూడా మొదలవుతాయని నివేదికలో స్పష్టంగా ఉంది. కమిటీ పరిశీలన ప్రకారం ఒక పాత్ర కోసం సంప్రదించే స్త్రీ 'సర్దుబాట్లు చేసుకోవాలి, రాజీ పడాలి' అని అందులో పేర్కొన్నారు. వారు కోరినప్పుడు మహిళా కళాకారులు సెక్స్‌కు అందుబాటులో ఉండాలి. కొంతమందైతే కొన్ని వీడియో క్లిప్‌లు, ఆడియో క్లిప్‌లు, సినిమాల్లోకి ప్రవేశించిన స్క్రీన్‌షాట్‌లను కూడా చూపించారు. సినీరంగంలో ఈ పరిస్థితికి స్వస్తి పలకాలని పలువురు మహిళలు కమిటీ ముందు గట్టిగా చెప్పారు. కొందరు వారి కోర్కెలు తీర్చేందుకు ఒప్పుకోనందుకు సినిమాల్లో నటించాలనే తమ చిరకాల స్వప్నాన్ని కోల్పోవలసి వచ్చింది. పరిశ్రమలోని ప్రసిద్ధ వ్యక్తుల నుండి కూడా మహిళలు లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారని కమిటీ తన నివేదిక పేర్కొంది. చాలా మంది ఆర్టిస్టులు సెట్స్‌లో దగ్గరి బంధువులు లేదా తల్లిదండ్రులతో కలిసి ఉంటాల్సి వస్తుంది. ఎందుకంటే పాత్ర కోసం ఆఫర్‌తో పాటు సెక్స్ కోసం డిమాండ్ కూడా వస్తుంది. అందుకే వారు కార్యాలయంలో తమ భద్రత గురించి భయపడుతున్నారు. వారు బస చేసిన హోటళ్లలో, సినీ రంగానికి చెందిన వ్యక్తులు తాగిన మత్తులో వారి తలుపులు తట్టిన సందర్భాలు అనేకం ఉన్నాయని నివేదికలో తెలిపారు.

అమానవీయ పని పరిస్థితులు

షూటింగ్ లొకేషన్లలో టాయిలెట్లు కానీ, దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు వంటి సౌకర్యాలు వుండవు. 'సెట్‌లో టాయిలెట్ సౌకర్యం, దుస్తులు మార్చుకునే గది లేదు. ముఖ్యంగా చాలా వరకు షూటింగ్‌లు అవుట్‌డోర్ లొకేషన్‌లలో జరుగుతుంది. అప్పుడు మాకు ఎలాంటి సౌకర్యాలు ఉండవు' అంటూ దాదాపు కమిటీ ముందు మాట్లాడినా ప్రతి మహిళా పేర్కొన్నట్టు నివేదికలో ఉంది. అలాంటి ప్రదేశాలలో మహిళలు ఏకాంత ప్రదేశాల కోసం వెతికేవారు. పొదలు వెనుక్కు వెళ్ళి తమ అవసరాలు తీర్చుకునేవారు. కొన్నిసార్లు ఇతరులు తమ చుట్టూ గుడ్డతో పట్టుకుంటే బట్టలు మార్చుకునేవారు.

చట్టవిరుద్ధమైనా...

టాయిలెట్లు అందుబాటులో లేక చాలా మంది సెట్‌లో నీరు తాగడం లేదు. దాని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. ఇదంతా తెలిసినా ఈ సమస్యల నుండి బయటపడే అవకాశం తమకు లేదని కూడా అన్నారు. అయితే ఈ సమస్య కేవలం నటీమణులకే కాకుండా జూనియర్ ఆర్టిస్టులు, స్టైలిస్ట్‌ల వంటి సహాయక సిబ్బంది కూడా ఎదుర్కొంటున్నారు. నటీమణుల ప్రత్యేక ఉపయోగం కోసం మాత్రమే క్యారవాన్‌లు అందించబడ్డాయి. ఒక ప్రముఖ నటుడు చెప్పిన ప్రకారం మలయాళ సినిమాల్లో శక్తివంతమైన మాఫియా గురించి కూడా నివేదికలో పొందుపరిచారు. 'వారు తమ ఇష్టాయిష్టాలు, అభిరుచుల ప్రకారం సినిమాల్లో ఏదైనా చేయగలరు. అలాంటివి చట్టవిరుద్ధం, అనధికారికమైనప్పటికీ ప్రముఖ దర్శకులు, నిర్మాతలు వీటికి పాల్పడుతున్నారు' అని నివేదిక పేర్కొంది.

స్వతంత్ర ఫోరమ్ అవసరం

సాధారణంగా అన్యాయాల గురించి బహిరంగంగా మాట్లాడే మహిళలు కూడా తమపై జరుగుతున్న లైంగిక వేధింపులను బహిర్గతం చేయడానికి ఇష్టపడరు. ఎందుకంటే అవకాశాలు రావనే భయంతో పాటు మరిన్ని వేధింపులకు గురవుతామనే ఆందోళన వారిని వెనకడుగు వేసేలా చేస్తుంది. 'సోషల్ మీడియా నుండి కూడా వారిపై తీవ్రమైన ఆన్‌లైన్ వేధింపులు జరుగుతున్నాయి. కొన్ని సందర్భాలలో వారికే కాక సన్నిహితులు, కుటుంబ సభ్యులు కూడా ప్రాణహాని ఎదుర్కోవలసి వస్తుందని కమిటీలో కొందరు పంచుకున్నారు. ఇవన్నీ పరిశీలించిన కమిటీ తన నివేదికలో చట్టంలోని నిబంధనల ప్రకారం సినిమా రంగంలో ఐసిసిని ఏర్పాటు చేయగలిగినప్పటికీ అది మహిళలకు ఎటువంటి సహాయం చేయదని, పైగా దీనివల్ల వారికి మరింత హాని కలిగే అవకాశం ఉందని అభిప్రాయపడింది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని సినిమాల్లో స్త్రీల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం తప్పనిసరిగా ఒక స్వతంత్ర ఫోరమ్‌ను ఏర్పాటు చేయవలసి ఉంటుందని ఆమె ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి వివరించారు. అప్పుడే ఈ రంగంలోని మహిళలకు లైంగిక వేధింపుల నుండి విముక్తి లభిస్తుందని మలయాళ చిత్ర పరిశ్రమ కూడా అభిప్రాయపడింది. ▪



తెలంగాణలో కూడా అవసరం



వాస్తవానికి ఈ సమస్య ఒక్క మలయాళ చిత్ర పరిశ్రమదే కాదు. దేశం, ప్రపంచంలోనే సినీ రంగంలోని మహిళా కళాకారులు లైంగిక దోపిడీని ఎదుర్కొంటున్నారు. 2016లో జరిగిన మీటూ ఉద్యమమే దీనికి ఓ ఉదాహరణ. ఏది ఏమైనా మాట్లాడేందుకే భయపడే పరిశ్రమలో మహిళా భద్రత గురించి చర్చించి కేరళ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఆ స్ఫూర్తితో కేరళలో మాదిరిగా తెలంగాణ సినీ పరిశ్రమలోని మహిళల రక్షణ కోసం కూడా ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేయాలని సమంత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ట్విట్ వేదికగా విజ్ఞప్తి చేశారు. హేమ కమిటీ ఏర్పాటుకు కారణమైన డబ్ల్యూసీసీ లాగే టాలివుడ్‌లో కూడా సపోర్ట్ గ్రూప్ ది వాయిస్ ఆఫ్ ఉమెన్ నడవాలి. దీన వల్ల సురక్షితమైన వాతావరణంలో మహిళలు పని చేసేందుకు అవకాశం దొరుకుతుందని ఆమె ట్విట్ చేశారు.

ప్రతిపక్షాలు బురద రాజకీయాలు

మానుకోవాలి



నవతెలంగాణ-మోతె

రైతులు, ప్రజలు రెండ్రోజుల నుంచి వరదల్లో చిక్కుకొని అల్లాడుతుంటే.. సహాయం చేయాల్సిందిపోయి ప్రతిపక్షాలు బురద జల్లే రాజకీయాలు చేస్తున్నాయి.. ఇక్కనైనా అలాంటివి మానుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లాలో వర్షాలు, నష్టాలపై మోతె మండల పరిధి రాఘవపురం ఎక్స్ రోడ్డులోని పీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జిల్లా అధికార యంత్రాంగంతో సీఎం సమీక్ష నిర్వహించారు. తక్షణ సాయంగా జిల్లాకు రూ.5 కోట్లు అందజేయాలని చీఫ్ సెక్రెటరీకి ఆదేశాలు జారీ చేశారు. ఈ సహాయాన్ని స్థానిక కలెక్టర్ ఏ ప్రాంతంలో అవసరముంటే ఆ ప్రాంతంలో వాడుకోవచ్చని చెప్పారు. వరదల్లో మృతిచెందిన వారికి సంబంధించి ఆ కుటుంబాలకు రూ.5లక్షలు, పశువులకు రూ.50వేలు అందజేయాలన్నారు. నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో అధికంగా మేకలు ఉంటాయని, వరదల్లో మృత్యువాతపడిన మేకకు రూ.5వేల చొప్పున బాధితులకు ఇవ్వాలని అధికారులకు సూచించారు. పంట నష్టం ఎకరానికి రూ.10వేలు అందిస్తామని చెప్పారు. రాష్ట్ర విపత్కర పరిస్థితి గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అడిగి తెలుసుకున్నారన్నారు. వర్షంలో నష్టపోయిన ప్రజలను, రైతులను ఆదుకోవడానికి వారు ముందుకొచ్చారని చెప్పారు. తక్షణ సాయంలో భాగంగా రాష్ట్రానికి రూ.2000 కోట్లు కేంద్రం అందించేందుకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మెన్ పటేల్ రమేష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, రామారావు, అధికారులు పాల్గొన్నారు.

నెతన్యాహూ గద్దె దిగు

(మొదటిపేజీ తరువాయి)

దిగాలని డిమాండ్ చేశారు. దాదాపు 11 మాసాలుగా జరుగుతున్న ఈ దాడులకు స్వస్తి పలుకుతూ తక్షణమే హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలని నినదించారు. అప్పటివరకు ఈ ఆందోళనలు విరమించేది లేదని స్పష్టం చేశారు. ఇజ్రాయిల్‌లోని అతిపెద్ద కార్మిక సంఘమైన హిస్తాద్రట్ సోమవారం సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చింది. డగాజాపై దాడులు ఆరంభమైన తర్వాత ఇలా సమ్మె జరగడం ఇదే మొదటిది. బ్యాంకింగ్, ఆరోగ్య సంరక్షణలతో సహా ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన ప్రధాన రంగాలు మూతపడేలా చేయాలన్నది ఈ సమ్మె ఉద్దేశం. బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, పెద్ద పెద్ద మాల్స్ అన్నీ మూతపడ్డాయి. విమాన రాకపోకలకు అంతరాయం కలిగింది. పాఠశాలలు పనిచేయలేదు. ప్రజా రవాణా కూడా కొంతమేర స్తంభించింది. టెల్‌అవీవ్‌తో సహా సెంట్రల్ ఏరియాలోని మున్సిపాలిటీలన్నీ సమ్మెలో పాల్గొన్నాయి. జెరూసలేంతో సహా మరికొన్ని మున్సిపాలిటీలు సమ్మెలో పాల్గొనలేదు. రాజకీయ దురుద్దేశంతో పిలుపునిచ్చిన ఈ సమ్మెను రద్దు చేయాలని ఇజ్రాయిల్ ప్రభుత్వం లేబర్‌కోర్టుకు విజ్ఞప్తి చేసిందని మీడియా వార్తలు పేర్కొన్నాయి.

సొరంగంలో ఆ ఆరుగురు బందీలు నిర్బంధించబడ్డారని, సైన్యం అక్కడకు వెళ్లేసరికే వారిని అత్యంత దగ్గర నుండి కాల్చి చంపేసినట్లు తెలుస్తోందని ఇజ్రాయిల్ పేర్కొంటోంది. ఇలా బందీలను హతమార్చేవారు కాల్పుల విరమణ ఒప్పందాన్ని కోరుకోవడం లేదని నెతన్యాహు ఆరోపించారు. కొత్త డిమాండ్లు జారీ చేయడం ద్వారా చర్చల నుండి వైదొలగిన ఇజ్రాయిల్, అమెరికాలే ఈ హత్యలకు కారణమని హమాస్ పేర్కొంది.

11మంది మృతి

నిర్వాసితులైన పాలస్తీనియన్లు తలదాచుకున్న స్కూలుపై ఇజ్రాయిల్ దాడి చేయడంతో 11మంది చనిపోయారు.

జాతీయ విపత్తుగా ప్రకటించండి

(మొదటిపేజీ తరువాయి)

వర్షాలు కురుస్తున్నాయని చెప్పారు. ఈ విషయమై మరింత లోతైన అధ్యయనాలు కొనసాగుతున్నాయని వివరించారు. సోమ, మంగళవారాల్లో ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు చెప్పారు. ఈ క్రమంలో అన్ని విభాగల అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అవసరమైతే వెంటనే సహాయక శిబిరాలకు తరలించాలని ఆదేశించారు. కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. తద్వారా 24 గంటలూ పరిస్థితిని పర్యవేక్షించాలని అన్నారు. చెరువులు, కల్వర్టులు, లోలెవల్ కాజ్‌వేలు, ఇతర ప్రదేశాల్లో వివిధ శాఖల అధికారులతో పర్యవేక్షణ చేయించాలని సీఎం ఆదేశించారు. వాతావరణ పరిస్థితులపై ప్రతి మూడు గంటలకో బులెటిన్ విడుదల చేయాలని ఆయన సూచించారు.

వర్షాలు, వరదలతో చనిపోయిన వారి కుటుంబాలకు ఇచ్చే పరిహారాన్ని రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతున్నట్టు ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. చనిపోయిన పాడి పశు వులకు ఇచ్చే పరిహారాన్ని రూ.30 వేల నుంచి రూ.50 వేలకు, మేకలు, గొర్రెలకు చెల్లించే పరిహారాన్ని రూ.3 వేల నుంచి రూ.5 వేలకు పెంచుతున్నట్టు వెల్లడించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రంలో రూ.లక్షన్నరకు పైగా ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని అధికారులు సీఎంకు తెలిపారు. అయితే నాలుగు లక్షలకుపైగా ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్టు వార్తలొస్తున్నాయనీ, తక్షణమే రంగంలోకి దిగి ఆయా వివరాలను సేకరించాలని సీఎం ఆదేశించారు. కామారెడ్డిలో వరదలు వచ్చినప్పుడు పంట నష్ట పరిహారాన్ని వెంటనే విడుదల చేశామనీ, ఇప్పుడు కూడా అలాగే చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సంబంధిత వివరాలను సమగ్రంగా పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వ బృందాలు సైతం తక్షణమే పంట నష్ట పరిశీలనకు వచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇండ్లు కూలిపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు.

రాష్ట్రంలోని ఎనిమిది బెటాలియన్లలో మూడో వంతు యువ పోలీసులకు ఎన్‌డీఆర్ఎఫ్ తరహాలో శిక్షణివ్వాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా డీజీపీని ఆదేశించారు. భారీ వర్షాలు, వరదల సమయంలో ఎన్‌డీఆర్ఎఫ్ నుంచి తక్షణ సాయం ఎందుకు అందడం లేదని ఆయన ప్రశ్నించారు. మనం (ప్రభుత్వం) పెట్టిన ఇండెంట్ ఆధారంగా వాళ్ల దగ్గర ఉన్న బలగాలను పంపుతారనీ, ఇందుకు సమయం పడుతుందని అధికారులు సీఎంకు వివరించారు. స్పందించిన రేవంత్... మన బెటాలియన్లలోని యువ పోలీసులకు ఎన్‌డీఆర్ఎఫ్ తరహాలో శిక్షణనివ్వాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా తెలంగాణ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (టీజీడీఆర్ఎఫ్)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు ఎక్విప్‌మెంట్ సమస్యగా ఉంటుందని అధికారులు తెలపగా.. ఎంత ఖర్చయినా ఫర్వాలేదనీ, వెంటనే కొనుగోలు చేయాలని సూచించారు. ఒడిశా, గుజరాత్‌లో అలా శిక్షణనిచ్చి బృందాలు ఏర్పాటు చేసుకున్నారని అధికారులు తెలపగా, అవసరమైతే అక్కడి విధానాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఆయా రాష్ట్రాల్లో అనుభవం ఉన్నవారితో శిక్షణ ఇప్పించాలని సీఎం సూచించారు. దానికోసం ఒక మాన్యువల్‌ను రూపొందించాలని కోరారు. ప్రతీ సీజన్ ముందు శిక్షణనిప్పించిన సిబ్బందితో రిహార్సల్స్ చేయించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

జీహెచ్ఎంసీ, కమిషనరేట్ల పరిధిలో...

వర్షాల నేపథ్యంలో హైదరాబాద్‌తోపాటు ఇతర కార్పొరేషన్లు, కమిషనరేట్ల పరిధిలో ఎక్కడా చిన్న అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోవడానికి వీల్లేదని సీఎం అధికారులకు దిశా నిర్దేశం చేశారు. విద్యుత్, ట్రాఫిక్, తాగు నీరు, శానిటేషన్ విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్‌ను నిరంతరం పర్యవేక్షించాలనీ, విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సహాయ శిబిరాలకు తరలించాలని సూచించారు. వర్షాలు, వరదలతో నిత్యం పనికి వెళ్లే కూలీలు బయటకు వెళ్లలేక, ఇంటి దగ్గరే ఉండిపోతారని రేవంత్ పేర్కొన్నారు. అలాంటి వారిని గుర్తించి బియ్యం, పప్పులు, నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని ఆయన ఆదేశించారు.

విద్యుత్ సిబ్బందికి అభినందనలు...

భారీ వర్షాల వల్ల రాష్ట్రంలో 25 పెద్ద పెద్ద టవర్లు కూలిపోయినప్పటికీ విద్యుత్తు సిబ్బంది వెంటనే కరెంట్ సరఫరాను పునరుద్ధరించారని గుర్తు చేసిన ముఖ్యమంత్రి వారిని అభినందించారు. అదే తరహాలో 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలనీ, విద్యుత్తు సమస్యలు, ప్రమాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాగులు, వంకలు పొర్లుతున్న దృష్ట్యా ఎవరూ వాటిని దాటేందుకు ప్రయత్నించొద్దని హెచ్చరించారు. రెవెన్యూ, పోలీసు, ఇతర విభాగాల అధికారులు బృందాలుగా ఏర్పడి అన్ని చోట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, సీఎస్ శాంతి కుమారి, డీజీపీ జితేందర్‌తోపాటు అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విచారించే కోర్టు మారినా..విషయం మారదు

(మొదటిపేజీ తరువాయి)

సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహిత్గి, సిద్ధార్థ్ లూత్రా, మేనకా గురుస్వామీలు, పిటిషన్ల తరపున సీనియర్ న్యాయవాదులు ఆర్యమా సుందరం, దామా శేషాద్రి నాయుడు, మోహిత్ రావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుందరం వాదనలు వినిపిస్తూ తెలంగాణ కాంగ్రెస్ అధికారిక సోషల్ మీడియాతో చేసిన ట్వీట్లను ఇంటర్ లోకేటరీ అప్లికేషన్ (ఐఏ) ద్వారా కోర్టు దష్టికి తీసుకెళ్లారు. ఇందులో న్యాయవాదులు, న్యాయమూర్తులపై అవమానించేలా సామాజిక మాధ్యమాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేసిందని, ఆ వివరాలు అన్ని ఐఏలో పొందుపరిచినట్టు న్యాయవాదులు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన జస్టిస్ బీఆర్ గవాయి.... 'ఎందుకు రాజకీయ నాయకులు కోర్టులు, న్యాయమూర్తులను వారి మధ్యలోకి లాగుతున్నారు' అని అసంతృప్తి వ్యక్తం చేశారు. నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి పరిధిలోనే హోం మంత్రి శాఖ ఉందని సుందరం మరోసారి కోర్టు దష్టికి తీసుకెళ్లారు. ఏసీబీ, ఏసీబీ ప్రాసిక్యూషన్, అలాగే అధికారులు ఆయనకే రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్న విషయాన్ని తాము దాఖలు చేసిన రిజాయిండర్ లో సవిరంగా పొందుపరిచామన్నారు. ఏసీబీ ఎవరిని విచారణ చేయాలి, వద్దు అనేది హోం మంత్రి శాఖనే నిర్ణయిస్తుందని వాదనలు వినిపించారు. ఈ వాదనలపై మరోసారి జోక్యం చేసుకున్న ధర్మాసనం... 'ఒకవేళ మరోచోటుకు కేసు విచారణ మార్చితే కూడా... అధికారులు ఆయనకు చెప్పిన తర్వాతే కోర్టుకు వెళతారు కదా అని ప్రశ్నించింది. అప్పుడు పరిధి మారుతుందని, ప్రాసిక్యూషన్ హోంమంత్రి చేతుల్లో ఉండదని సుందరం వాదించారు. మధ్యలో తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది ముకుల్ రోహిత్గి జోక్యం చేసుకొని, ఇప్పటికే 25 మంది సాక్షుల నుంచి అన్ని వివరాలను ఏసీబీ సేకరించిందని కోర్టుకు నివేదించారు. కాగా, మరోసారి పిటిషనర్ తరపు న్యాయవాదులు దాఖలు చేసిన ఐఏపై స్పందిస్తూ ప్రభుత్వ తరపు న్యాయవాదులను కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు, న్యాయవాదులను పబ్లిక్‌కు ట్యాగ్ చేశారని, దీనిపై తొలుత కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా

ఇదిలా ఉండగా...'ల్యాండ్ గ్రాబర్స్‌కు ఒక రూల్, ప్రభుత్వానికి ఒక రూల్ నా? వాట్ ఈజ్ దిస్ మై లార్డ్?' అంటూ సోషల్ మీడియాలో కాంగ్రెస్ చేసిన కామెంట్లను ప్రస్తావించిన జస్టిస్ బీఆర్ గవాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఇందులో రేవంత్ రెడ్డి వ్యక్తిగత పాత్ర లేదని ఆయన తరపు న్యాయవాది సిద్ధార్థా లూత్రా వాదించారు. అయితే ప్రస్తుతం రేవంత్ రెడ్డినే పీసీసీ చీఫ్ గా ఉన్నారని, పీసీసీ అధ్యక్షుడిగా ఈ వ్యవహారంలో రేవంత్ రెడ్డికి పూర్తి బాధ్యత ఉంటుందని సుందరం కోర్టుకు తెలిపారు. అయితే గత శుక్రవారం కోర్టు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో న్యాయవ్యవస్థకు క్షమాపణలు చెప్పడంతో పాటు, వ్యవస్థపై తనకు ఎంత గౌరవం ఉందో కూడా సీఎం రేవంత్ ప్రకటన చేశారన్న ప్రభుత్వం తరపు న్యాయవాదులు కోర్టుకు నివేదించారు. ఎందుకు రాజకీయ నాయకులు కోర్టులు, న్యాయమూర్తులను వారి మధ్యలోకి లాగుతున్నారని మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసిన జస్టిస్ గవాయి, పిటిషనర్ దాఖలు చేసిన ఐఏపై తప్పక రిప్లై ఇవ్వాలని ఆదేశించారు. 'ఎవరైతే అత్యున్నతమైన పాలన భవనం(హెూల్డింగ్ హై ఆఫీస్) నడుపుతున్నారో, వాళ్లు బాధ్యతగా ఉండాలని' అని సీఎంను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అంతకు ముందు జస్టిస్ కేవీ విశ్వనాథన్ స్పందిస్తూ... తెలంగాణలో ప్రస్తుతం భారీ వరదలు ఉన్నాయని, ఆ విధుల్లో ప్రభుత్వం నిమగ్నం అయి ఉన్నట్టు గుర్తు చేశారు. తాము అన్ని సున్నితమైన అంశాలపై ఫోకస్ చేస్తామని చెప్పారు. అందువల్ల రెండు వారాల్లో ఏఐపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. మరోసారి జస్టిస్ గవాయి జోక్యం చేసుకొని, కానీ రాజకీయ నేతలు మాత్రం కోర్టులను, జడ్జీలను సోషల్ మీడియాలో ట్యాగ్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తదుపరి విచారణను రెండు వారాల తరువాత చేపడతామని స్పష్టం చేశారు.

వరద సహాయ కార్యక్రమాల్లో పాల్గొనండి

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేశారు. రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల కారణంగా అసంఖ్యాక ప్రజానీకం నిరాశ్రయులయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువులు, వాగులు కట్టలు తెగడంతో లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయని తెలిపారు. రహదారులపైకి నీరు రావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిందని పేర్కొన్నారు. వరదల కారణంగా అల్లాడిపోతున్న బాధిత ప్రజలను ఆదుకోవడానికి తక్షణమే ప్రభుత్వం అన్ని రకాల చర్యలనూ తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. అంటువ్యాధులు ప్రబలే అవకాశాలున్నందున వాటి నివారణకు తాత్కాలిక వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో గండ్లుపడిన, కట్టలు తెగిన చెరువులతోపాటు దెబ్బతిన్న రహదార్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. భారీ వర్షాల కారణంగా నష్టపోయిన పంటలను అంచనా వేసి నష్టపరిహారం అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వ్యవసాయరంగంలో ఏడు పథకాలకు ఓకే

(మొదటిపేజీ తరువాయి)

మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం సమావేశం జరిగింది. ఈ సమవేశంలో మూడు నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం కేంద్రమంత్రి వర్గ సమావేశ నిర్ణయాలను గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. రూ.2,817 కోట్ల డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ పథకం, క్రాప్ సైన్స్ కోసం రూ.3,979 కోట్లు కేటాయించింది. వ్యవసాయ విద్య, నిర్వహణను బలోపేతం చేసేందుకు రూ.2,291 కోట్ల విలువైన కార్యక్రమానికి ఆమోదం తెలిపినట్టు కేంద్రమంత్రి పేర్కొన్నారు. పశవుల సుస్థిర ఆరోగ్యం, వాటి ఉత్పత్తి కోసం రూ.1,702 కోట్లతో స్కీమ్‌కి సైతం ఆమోదం తెలిపినట్టు చెప్పారు. ఉద్యానవనాల సుస్థిర అభివద్ధికి రూ.1,129.30 కోట్లతో మరో బహత్తర పథకానికి మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. దీంతోపాటు వ్యవసాయ విజ్ఞాన కేంద్రాలను బలోపేతం చేసేందుకు రూ.1,202 కోట్లు వెచ్చించనున్నట్టు తెలిపారు. అదే సమయంలో సహజ వనరుల నిర్వహణకు సంబంధించిన పథకానికి రూ.1,115 కోట్లు వెచ్చించనున్నారు. ఏడు పథకాలకు రూ.14,235.30 కోట్లకుపైగా నిధులు కేటాయించినట్టు అశ్విని వైష్ణవ్ వివరించారు.ముంబాయి-ఇండోర్ రహదారికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. 309 కిలోమీటర్ల రహదారికి రూ.18,036 కోట్లు ఖర్చు చేయనున్నారు. సెమీ కండక్టర్ పరిశ్రమల్ని ప్రోత్సహించే లక్ష్యంతో గుజరాత్‌లోని సనంద్‌లో ఒక సెమీ కండక్టర్ పరిశ్రమను ఏర్పాటు చేయడానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.

నిందితుడైతే ఇల్లు కూల్చేస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

అలాంటి కూల్చివేతలు జరుగుతున్నాయని తుషార్ మెహతా ధర్మాసనానికి తెలిపారు. ఈ విషయం న్యాయస్థానంలో తప్పుగా చూపించబడుతున్నదని అన్నారు. ఒకవేళ మీరు దీనిని సమ్మతిస్తే, దీని ఆధారంగా మేము మార్గదర్శకాలు విడుదల చేస్తామని న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ తెలిపారు. కూల్చివేతలకు మార్గదర్శకాలుండాలనీ, వాటిని డాక్యుమెంట్ చేయాల్సినవసరం ఉన్నదని ధర్మాసనం స్పష్టం చేసింది. తొలుత నోటీసులిచ్చి సమాధానానికి, న్యాయ పరిష్కారం కోసం కొంత సమయమివ్వాలనీ, ఆ తర్వాతే కూల్చివేతలు చేపట్టాలని న్యాయమూర్తి జస్టిస్ విశ్వనాథన్ సూచించారు. తాము అక్రమ నిర్మాణాలను సమర్థించటంలేదనీ, అయితే, కూల్చివేతల విషయంలో మార్గదర్శకాలుండాలని ధర్మాసనం తెలిపింది. కాగా, ఈ కేసు విషయంలో న్యాయస్థానంలో తుషార్ మెహతా, దుశ్యంత్ దవేల మధ్య వాద, ప్రతివాదనలు తీవ్రస్థాయిలో జరిగాయి. అనంతరం జస్టిస్ గవాయ్ జోక్యం చేసుకొని.. కోర్టు రూమ్‌ను యుద్ధభూమిగా మార్చొద్దని ఇద్దరు సీనియర్ న్యాయవాదులకు సూచించారు. న్యాయస్థానం తదుపరి విచారణను ఈనెల 17కు వాయిదా వేసింది. సాధారణంగా ఈ బుల్డోజర్ చర్యలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో, ప్రాంతాల్లో కనిపిస్తాయి. యూపీలోని యోగి సర్కారు మొదలు పెట్టిన ఈ బుల్డోజర్ చర్య ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలకూ పాకింది. దీంతో బీజేపీ సర్కారు బుల్డోజర్ చర్యపై పౌర సమాజం తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేసింది. ఇప్పుడు ఇదే విషయాన్ని న్యాయస్థానం విచారిస్తుండటం గమనార్హం.

ఆటలు
నవతెలంగాణ
ఖమ్మం
మంగళవారం 12
3 సెప్టెంబర్ 2024

వరద ప్రాంతాల్లో సీపీఐ(ఎం) సహాయక చర్యలు



పంటల పరిశీలన

నవతెలంగాణ- విలేకరులు

వరదల్లో సర్వం కోల్పోయి బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న బాధితులకు సీపీఐ(ఎం) తనవంతుగా బాసటగా నిలుస్తోంది. ముంపు ప్రాంతాల్లో నాయకులు పర్యటించి.. సహాయక చర్యలు చేపట్టారు. బాధితులతో మాట్లాడి.. ఓదార్చారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో నీట మునిగి, మేటవేసిన పంట పొలాలను తెలంగాణ రైతు సంఘం, సీపీఐ(ఎం) నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా పాండునాయక్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోత్ బాలునాయక్ పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ పట్టణంలో ముంపు ప్రజల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం అన్వేషించాలని సీపీఐ(ఎం) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కె.గోపాల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లవెల్లి కురుమూర్తి, చంద్రకాంత్ వరద ప్రాంతాల్లో పర్యటించారు. ఎర్రకుంట పరివాహక ప్రాంతం కురువిని శెట్టి కాలనీ, పాత పాలమూరు దళితవాడ, హబీబ్ నగర్, లక్ష్మీ నగర్ కాలనీ, చిక్కుడు వాగు, మోతీ నగర్ తదితర ప్రాంతాలను పరిశీలించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం బంద్రిగుండ పంచాయతీ పరిధిలో కోయగట్టు గ్రామంలో సీతారామ ప్రాజెక్టు కాలువ తెగి సుమారు 50 ఎకరాల పత్తి, వరి, కంది చేలు నేలమట్టం అయ్యాయి. వర్షాలకు కొట్టుకుపోయిన పంటలను సీపీఐ(ఎం) బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడారు. పాల్వంచ రూరల్ మండల పరిధిలో వర్షాలు, వరదలకు ముంపుకు గురైన ఉల్వనూరు, మందెరకలపాడు,మల్లారం,కిన్నెరసాని, రాళ్ళవాగు, యానంబైలు ప్రాంతాలను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సందర్శించారు.

ఖమ్మం జిల్లా ఖానాపురం హవేలి వరదయ్యనగర్ వరద బాధితులకు సీపీఐ(ఎం) సానుభూతిపరులు కాటేపల్లె క్రాంతి కుమార్ ఉదయం టిఫిన్ అందించారు. సీపీఐ(ఎం) ఖానాపురం హవేలి కార్యాలయం సత్తెనపల్లి రామకృష్ణ భవన్‌లోనూ, అలాగే మధ్యాహ్నం భోజనం వరదయ్యనగర్ నివాస ప్రాంతంలోనూ ఏర్పాటు చేశారు. వన్ టౌన్ ఐద్వా నాయకులు డాక్టర్ ప్రశాంతి వరద బాధితులకు దుస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సెక్రటేరియట్ సభ్యులు వై.విక్రమ్, హవేలి కార్యదర్శి దొంగల తిరుపతిరావు, ఎస్ఎఫ్ఐ ప్రవీణ్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, హవేలి నాయకులు పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్ మండలంలోని జలగంనగర్, కస్నాతండా, తనగంపాడు, నాయుడుపేట,రాజీవ్ గృహకల్ప,కోట నారాయణపురం గ్రామాలను మున్నేరు తీవ్ర వరదతో ముంచెత్తడంతో ప్రజలు సర్వస్వం కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న వారిని సీపీఐ(ఎం) నాయకులు పరామర్శించారు. మనో ధైర్యం కల్పించి వారికి అండగా ఉన్నారు.

కారేపల్లి మండలంలో వరదలతో నష్టపోయిన పంటలను, వరదముంపు ప్రాంతాలను, తిరుమలాయపాలెం మండలంలోనూ తెగిన రోడ్లు,చెరువులు,కుంట లను సీపీఐ(ఎం) నాయకులు పరిశీలించారు.

కూల్చివేతలకు ముందు ఆధారాలు చూడండి

(మొదటిపేజీ తరువాయి)

వాదించారు. పిటిషనర్ల భూములు ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో లేవని 2015లో అప్పటి అధికారులు నిర్ధారణ చేశారనీ, తాజాగా ఎఫ్‌టీఎల్‌లో ఇండ్లు ఉన్నాయని చెప్పి కూల్చివేత చర్యలు పాక్షికంగా చేపట్టారన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు పైవిధంగా ఉత్తర్వులు ఇచ్చింది. కౌంటర్ వేయాలనీ, ఉస్మాన్ సాగర్ మ్యాప్‌ను కూడా కౌంటర్‌లో ఉండాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఇదే తరహాలో దాఖలైన మరో పిటిషన్‌ను కూడా హైకోర్టు సోమవారం విచారించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగంపేట ప్రాంతంలో దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని చెప్పి కూల్చివేత నోటీసులు ఇవ్వడాన్ని సవాలు చేసిన పిటిషన్లను హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే బెంచ్ విచారించింది. కూల్చివేత నోటీసులను షోకాజ్ నోటీసులుగా సవరించాలని అధికారులను ఆదేశించింది. షోకాజ్ నోటీసులపై పిటిషనర్లు చూపించే ఆధారాలన్నింటినీ లోతుగా పరిశీలించాక తదుపరి చర్యలు ఉండాలని సూచించింది. గుట్టలబేగంపేటలో 15 ఎకరాల్లోని లేఔట్‌లోని ఇండ్ల నిర్మాణదారులకు వాల్టా చట్టంలోని సెక్షన్ 23 కింద డిప్యూటీ కలెక్టర్ నోటీసులు ఇవ్వడాన్ని తప్పుపడుతూ పిటిషన్లు దాఖలయ్యాయి. చర్యలు చట్ట ప్రకారమే ఉండాలన్న హైకోర్టు వాటిపై విచారణను మూసేస్తున్నట్టు ప్రకటించింది.

హుస్సేన్ సాగర్‌లో వినాయక నిమజ్జనంపై పిటిషన్

హుస్సేన్‌సాగర్‌లో వినాయక విగ్రహాల నిమజ్జనంపై గతంలో హైకోర్టు ఉత్తర్వులు అమలు కావడం లేదంటూ న్యాయవాది వేణుమాధవ్ వ్యక్తిగత హోదాలో వేసిన పిటిషన్‌కు నెంబర్ ఇచ్చేందుకు రిజిస్ట్రీ అభ్యంతరం లేవనెత్తింది. ఈ అంశంపై హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ సోమవారం విచారించింది. మరో వారంలో వినాయక చవితి పండగ ఉందనీ, ఆ తర్వాత నుంచి విగ్రహాల నిమజ్జనం చేస్తారనీ, చివరి సమయం వరకు పిటిషన్ వేయకుండా ఏం చేస్తున్నారని పిటిషనర్‌ను ప్రశ్నించింది. విచారణను వినాయక చవితి తర్వాత ఈనెల తొమ్మిదిన విచారిస్తామని చెప్పింది. ఈలోగా మధ్యంతర ఉత్తర్వులు ఏమీ ఇవ్వబోమని స్పష్టం చేసింది. గతంలో తామిచ్చిన ఉత్తర్వులను తదుపరి విచారణ సమయంలో సమీక్ష చేస్తామని వెల్లడించింది.

రవిప్రకాశ్‌పై కేసు ఉపసంహరణ రద్దు చేయండి

ఫోర్జరీ, తప్పుడు డాక్యుమెంట్ల తయారీ, నిధుల దుర్వినియోగం వంటి క్రిమినల్ అభియోగాల కేసులో నిందితుడిగా ఉన్న టీవీ 9 మాజీ సీఈవో/డైరెక్టర్ రవిప్రకాశ్‌పై కేసు ఉపసంహరణ ఉత్తర్వులను రద్దు చేయాలని అలందా మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రయివేట్ లిమిటెడ్ డైరెక్టర్ పి కౌశిక్‌రావు వేసిన కేసులో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ప్రభుత్వం జీవో ద్వారా కేసు ఉపసంహరణ చేయాలందనీ, దీనికి అనుగుణంగా పీపీ కూకట్‌పల్లి మెజిస్ట్రేట్ కోర్టులో మెమో దాఖలు చేశారని తెలిపింది. దీని ఆధారంగా మెజిస్ట్రేట్ కేసు పూర్వపరాల్లోకి వెళ్లకుండా ఏకపక్షంగా మెమోను ఆమోదించి రవిప్రకాష్ ఇతరులపై కేసు ఉపసంహరణకు అనుమతి ఉత్తర్వులు ఇచ్చారని పిటిషనర్ వాదన. రవిప్రకాశ్, రాష్ట్ర ప్రభుత్వం, ఎస్ శివాజీ, జె కనకరాజు, జె తేజవర్మ, మహేష్ గాంధీ, మూర్తిలకు న్యాయమూర్తి నోటీసులు ఇచ్చారు. విచారణ ఈనెల ఐదో తేదీకి వాయిదా వేశారు.

అవి వ్యక్తిగత వ్యాఖ్యలు : స్మితా సబర్వాల్

వికలాంగుల గురించి సీనియర్ ఐఏఎస్ అధికారి, స్టేట్ ఫైనాన్స్ మెంబర్ సెక్రటరీ స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యల ఆధారంగా దాఖలైన పిటిషన్‌కు నెంబర్ కేటాయింపు దశలోనే హైకోర్టు డిస్మిస్ చేసింది. హైదరాబాద్‌కు చెందిన సోషల్ వర్కర్ కొప్పుల వసుంధర వేసిన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ బెంచ్ కొట్టేసింది. మహారాష్ట్ర క్యాడర్‌కు చెందిన పూజా ఖేద్కర్ నకిలీ సరిఫికేట్ ఉదంతం నేపథ్యంలో సబర్వాల్ విమానయాన సంస్థ వికలాంగులకు పైలట్‌గా నియమించడం, వైకల్యం ఉన్న సర్జన్‌ను రోగులు నమ్ముతారా, ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లు క్షేత్రస్థాయిలో బాగా తిరగాల్సి ఉంటుందనీ, ఈ సర్వీసులకు వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించడం సబబు కాదని ఆమె చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతమని పేర్కొంది.

గాఫ్ కథ ముగిసే

- ప్రీ క్వార్టర్స్‌లో ఓడిన స్టార్ ప్లేయర్
- క్వార్టర్‌ఫైనల్లో అలెగ్జాండర్ జ్వెరెవ్

యు.ఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ 2024



యు.ఎస్ ఓపెన్‌లో అమెరికా యువ స్టార్ కొకొ గాఫ్ టైటిల్ వేటకు తెరపడింది. వరుసగా మూడు మ్యాచుల్లో మెరుగైన విజయాలు నమోదు చేసిన లోకల్ స్టార్.. ప్రీ క్వార్టర్‌ఫైనల్లో బోల్తా కొట్టింది. సొంత అభిమానుల నడుమ టైటిల్ ముద్దాడాలనుకున్న గాఫ్‌కు భంగపాటు తప్పలేదు. పురుషుల సింగిల్స్‌లో జర్మనీ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్ ముందంజ వేశాడు. చెమట పట్టకుండా ప్రత్యర్థిని చిత్తు చేసిన జ్వెరెవ్ క్వార్టర్‌ఫైనల్లో కాలుమోపాడు.

నవతెలంగాణ-న్యూయార్క్

జర్మనీ స్టార్ ఆటగాడు, నాల్గో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ పురుషుల సింగిల్స్ విభాగం క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించాడు. మెన్స్ సింగిల్స్ ప్రీ క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో అమెరికా ఆటగాడు బ్రాండన్ నకషిమాపై అలెగ్జాండర్ జ్వెరెవ్‌పై విజయం సాధించాడు. 3-6, 6-1, 6-2, 6-2తో అలెగ్జాండర్ జ్వెరెవ్ గెలుపొందాడు. నాలుగు సెట్ల మ్యాచ్‌లో జ్వెరెవ్‌కు తొలుత ఎదురుదెబ్బ తగిలినా.. తర్వాత వరుసగా మూడు సెట్లలో అలవోక విజయం సాధించాడు. 14 ఏస్‌లు కొట్టిన జ్వెరెవ్ ఆరు బ్రేక్ పాయింట్లతో అదరగొట్టాడు. పాయింట్ల పరంగా 114-80తో బ్రాండన్‌పై తిరుగులేని ఆధిపత్యం చూపించాడు. సొంత సర్వ్‌లో జ్వెరెవ్ 15 గేమ్ పాయింట్లు గెలుపొందగా, బ్రాండన్ 10 గేమ్ పాయింట్లు సాధించాడు. మెన్స్ సింగిల్స్‌లో మరో ప్రీ క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో నొవాక్ జకోవిచ్‌ను ఓడించిన అలెక్సీ పాపిరిన్ పరాజయం పాలయ్యాడు. అమెరికా ఆటగాడు ఫ్రాన్సెస్ టియాఫె 6-4, 7-6(7-3), 2-6, 6-3తో అలెక్సీని ఓడించాడు. జకోవిచ్‌పై నిలకడగా రాణించిన అలెక్సీ.. ప్రీ క్వార్టర్స్‌లో తేలిపోయాడు. నాలుగు సెట్ల మ్యాచ్లో ఒక్క సెట్‌లోనే పైచేయి సాధించాడు. టైబ్రేకర్‌కు దారితీసిన రెండో సెట్‌ను సైతం చేజార్చుకున్నాడు. అలెక్సీ 24 ఏస్‌లు సంధించగా, ఫ్రాన్సెస్ 14 ఏస్‌లు కొట్టాడు. అలెక్సీ, ఫ్రాన్సెస్ చెరో మూడు బ్రేక్ పాయింట్లు సాధించగా.. పాయింట్ల పరంగా 120-117తో ఫ్రాన్సెస్ పైచేయి సాధించాడు. ఫ్రాన్సెస్ 21 గేమ్ పాయింట్లు సాధించగా, ఆసీస్ ఆటగాడు అలెక్సీ 19 గేమ్ పాయింట్లతో సరిపెట్టుకున్నాడు. మెన్స్ సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో దిమిత్రోవ్, ఫ్రాన్సెస్.. జ్వెరెవ్, ఫ్రిట్జ్‌లు తలపడనున్నారు.



గాఫ్‌కు భంగపాటు :

సొంత అభిమానుల నడుమ యు.ఎస్ ఓపెన్ టైటిల్ అందుకోవాలని తపించిన కొకొ గాఫ్ కథ ప్రీ క్వార్టర్‌ఫైనల్లోనే ముగిసింది. సహచర అమెరికా క్రీడాకారిణి ఎమ్మా నవారో 6-3, 4-6, 6-3తో కొకొ గాఫ్‌ను చిత్తు చేసింది. మూడు సెట్లకు దారితీసిన మ్యాచ్‌లో నవారో నాలుగు బ్రేక్ పాయింట్లతో విజయానికి చేరువైంది. గాఫ్ కేవలం రెండు బ్రేక్ పాయింట్లతో వెనుకంజ వేసింది. పాయింట్ల పరంగా 100-88తో గాఫ్‌పై నవారో పైచేయి సాధించింది. రెండో సీడ్, టైటిల్ ఫేవరేట్ సబలెంక సైతం క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది. ఎలిసీ మెర్టెన్స్‌పై 6-2, 6-4తో వరుస సెట్లలో విజయం సాధించి సబలెంక అలవోకగా ముందంజ వేసింది. సబలెంక 12 గేమ్ పాయింట్లు గెలుపొందగా.. మెర్టెన్స్ కేవలం ఆరు గేమ్ పాయింట్లు మాత్రమే సాధించింది. ఏడో సీడ్ చైనా స్టార్ క్విన్‌వెన్ జెంగ్ 7-6(7-2), 4-6, 6-2తో డొనా వెకిక్‌పై విజయం సాధించాడు. టైబ్రేకర్‌తో తొలి సెట్‌ను నెగ్గినా చైనా అమ్మాయి రెండో సెట్‌లో తలొగ్గినా.. నిర్ణయాత్మక మూడో సెట్లో మెరిసింది. 10 ఏస్‌లు, మూడు బ్రేక్ పాయింట్లతో కదం తొక్కి క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది.

నితీశ్ పసిడి షో

యోగేశ్‌కు సిల్వర్ మెడల్
పారిస్ 2024 పారాలింపిక్స్





పారిస్ (ఫ్రాన్స్) : పారాలింపిక్స్‌లో భారత్ జోరు కొనసాగుతోంది. బ్యాడ్మింటన్‌లో పతక వర్షానికి రంగం సిద్ధం చేసుకున్న భారత్.. నితీశ్ కుమార్ పసిడి పతకంతో లెక్క మొదలెట్టింది. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 విభాగంలో నితీశ్ కుమార్ చాంపియన్‌గా నిలిచాడు. సోమవారం జరిగిన పసిడి పోరులో గ్రేట్ బ్రిటన్ షట్లర్ జెనీయాపై 2-1తో గెలుపొందాడు. 21-14, 18-21, 23-21తో ఉత్కంఠగా జరిగిన ఫైనల్లో మెరుపు విజయం నమోదు చేశాడు. తొలి గేమ్ నెగ్గిన నితీశ్‌కు రెండో గేమ్‌లో గట్టి పోటీ ఎదురైంది. టైబ్రేకర్‌కు దారితీసిన నిర్ణయాత్మక మూడో గేమ్‌లో నితీశ్ పైచేయి సాధించాడు. 2009 రైలు ప్రమాదంలో కాలు కోల్పోయిన నితీశ్ కుమార్ ఐఐటీ మండి నుంచి ఇంజినీరింగ్ పట్టా పొందాడు. జీవితం ముగిసిందనుకున్న తరుణంలో బ్యాడ్మింటన్‌పై ఏర్పడిన మక్కువ నేడు నితీశ్ కుమార్‌ను పారాలింపిక్స్ చాంపియన్‌గా నిలబెట్టింది. అథ్లెటిక్స్‌లో యోగేశ్ రజత పతకం సాధించాడు. డిస్కస్ త్రో ఎఫ్56 ఫైనల్లో రెండో స్థానంలో నిలిచిన యోగేశ్ మరోసారి సిల్వర్ మెడల్ అందుకున్నాడు. టోక్యో పారాలింపిక్స్‌లో సిల్వర్ నెగ్గిన యోగేశ్.. ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లోనూ రెండు సార్లు సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నాడు. 42.22 మీటర్ల దూరంతో యోగేశ్ పారిస్‌లో మళ్లీ సిల్వర్ మెడల్ దక్కించుకున్నాడు.

ఇంటర్ కాంటినెంటల్ పోరుకు సై

నేటి నుంచి హైదరాబాద్‌లో మ్యాచ్‌లు

హైదరాబాద్ : ఆల్ ఇండియా ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్), తెలంగాణ ఫుట్‌బాల్ సంఘం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటర్ కాంటినెంటల్ కప్ పోటీలకు గచ్చిబౌలి స్టేడియం ముస్తాబైంది. భారత్ సహా మూడు దేశాలు పోటీపడుతున్న ఇంటర్ కాంటినెంటల్ ట్రోఫీ నిర్వహణతో హైదరాబాద్‌ను మళ్లీ ఫుట్‌బాల్ కేంద్రంగా చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. నేడు తొలి మ్యాచ్‌లో భారత్, మారిషస్ పోటీపడుతుండగా.. 9న చివరి మ్యాచ్‌లో సిరియాతో భారత్ ఆడనుంది.

ఆద్యంతం నవ్వించే సినిమా : దిల్‌రాజు



సుహాస్, సంగీర్తన

సుహాస్, సంగీర్తన హీరో, హీరోయిన్లుగా దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందిన తాజా చిత్రం 'జనక అయితే గనక'.

శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రాన్ని సందీప్ రెడ్డి బండ్ల డైరెక్ట్ చేశారు. ఈనెల 7న ఈ సినిమా గ్రాండ్ రిలీజ్ కానుంది.

ఈ నేపథ్యంలో మీడియాతో దిల్ రాజు మాట్లాడుతూ, 'సెన్సార్ అయింది.యూ/ఏ సర్టిఫికేట్ ఇచ్చారు. ఆల్రెడీ టీజర్, ట్రైలర్, పాటలు అన్నీ కూడా అందరినీ ఆకట్టుకున్నాయి. సుహాస్ తన ప్రతీ సినిమాతో ఒక్కో మెట్టు ఎక్కుతూనే ఉన్నాడు. సుహాస్ అంటే మినిమం గ్యారెంటీ అని యూఎస్ డిస్ట్రిబ్యూటర్లు కూడా చెబుతున్నారు. దిల్ రాజు ప్రొడక్షన్ అంటే ఫ్యామిలీతో చూడదగ్గ సినిమానే ఉంటుంది. కాకపోతే ఈ సినిమా కథ కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. కాస్త పక్కకు జరిగి ఈ కథను చేసినా ఆ లైన్ దాటకుండా తీశాం. ఆడియెన్స్‌ను ఎడ్యూకేట్ చేసేలా ఉంటుంది. విజయ్ బుల్గానిన్ మంచి పాటలు ఇచ్చారు. సంగీర్తన మలయాళీ అమ్మాయి అయినా తెలుగు నేర్చుకుని డబ్బింగ్ చెప్పారు. మేం ఈనెల 6న ప్రీమియర్లు వేస్తున్నాం. ఈ సినిమా ఆద్యంతం నవ్వించేలా ఉంటుంది. ఓ మంచి సందేశాన్ని ఇచ్చారు అనే ఆలోచనతో థియేటర్ నుంచి బయటకు వస్తారు' అని అన్నారు. 'ప్రశాంత్ నీల్ టీంలోకి నన్ను దిల్ రాజు పంపారు. అక్కడ చాలా నేర్చుకున్నాను. ప్రశాంత్ నీల్‌కి ఈ కథ తెలుసు. బాగుందని మెచ్చుకున్నారు' అని దర్శకుడు సందీప్ రెడ్డి బండ్ల చెప్పారు.

సుహాస్ మాట్లాడుతూ, 'సినిమా చాలా బాగా వచ్చింది. ఆడియెన్స్ నుంచి ఎలాంటి రెస్పాన్స్ వస్తుందా? అని వెయిట్ చేస్తున్నాను. స్క్రిప్ట్ విన్నప్పుడు నవ్వుతూనే ఉన్నాను. అలాగే ప్రేక్షకులు కూడా నవ్వుతారు' అని తెలిపారు.

అందరికీ కనెక్ట్ అయ్యే కాన్సెప్ట్



సృజన్ యరబోలు

నివేద థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్‌లో నటించిన న్యూ ఏజ్ క్లీన్ ఎంటర్‌టైనర్ '35-చిన్న కథ కాదు'.

సురేష్ ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రానికి నంద కిషోర్ ఈమాని రైటర్, డైరెక్టర్. ఈ సినిమా ఈనెల 6న తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో విడుదల కానుంది.

ఈ సందర్భంగా నిర్మాత సృజన్ యరబోలు మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- ఏదైనా సినిమా చేస్తే జనాలకు గుర్తుండిపోవాలి. క్లాసిక్‌గా నిలిచిపోవాలి. 'మహానటి, జర్సీ, సీతారామం' లాంటి కథ కోసం వెతుకుతున్న సమయంలో నాకు వచ్చిన కథ '35-చిన్న కథ కాదు'.
- మదర్ సెంటిమెంట్‌కి మించిన కమర్షియల్ ఎలిమెంట్ ఏది లేదు. ఇందులో అది అద్భుతంగా కుదిరింది. కథ, స్క్రీన్ ప్లే పెర్ఫెక్ట్‌గా వుంటాయి. ఓ పెద్ద హీరో ఈ సినిమా చూసి వయసుతో నిమిత్తం లేకుండా అందరినీ థియేటర్‌కి పంపించే కథ అని కాంప్లిమెంట్ ఇచ్చారు.
- సినిమాని అందరూ ఓన్ చేసుకుంటారు. ఇది థియేటర్ కోసం చేసిన సినిమా.. తిరుపతి, అక్కడ ఓ ఇల్లు, స్కూల్ ఇలా ఓ బ్యూటీఫుల్ వరల్డ్ వుంటుంది. సినిమా చూస్తున్నపుడు ఆడియన్స్‌కి ఆ వరల్డ్‌లో ఉన్న ఫీలింగ్ కలుగుతుంది.
- నివేద, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్‌తోపాటు పిల్లలు.. ఇలా ప్రతి ఒక్కరూ తమ పాత్రల్లో ఒదిగిపోయారు.
- కన్నడలో కాంతార, మలయాళంలో మంజుమ్మల్ బాయ్స్, తమిళలో మహారాజ, తెలుగులో .'35-చిన్న కథ కాదు'. ఇది పదేళ్ళు నిలిచిపోయే సినిమా అవుతుంది. బాపు, విశ్వనాథ్ సినిమాలని గుర్తుచేస్తుంది. ఈ సినిమా నా కెరీర్‌లో మైల్ స్టోన్ మూవీ అవుతుందనే నమ్మకం ఉంది.
- తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బాతో చేస్తున్న సినిమా షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ జరుగుతోంది. 'గతం'కు సీక్వెల్ జరుగుతోంది. ఓ థ్రిల్లర్‌ని చేస్తున్నాం.

నవచిత్రం


ఆయ్ కలెక్షన్లలో 25% విరాళం



ఆంధ్రప్రదేశ్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆ ప్రాంతమంతా అల్లకల్లోలం అయిన సంగతి తెలిసిందే. వరదల వల్ల ఎంతో మందికి నీడ లేకుండాపోయింది. ఎంతో మందికి ఆహారం అందకుండా పోతోంది. వరద బాధితులకు అండగా నిలిచేందుకు నిర్మాత బన్నీ వాస్ ముందుకు వచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో వరదల వల్ల నష్టపోయిన వారికి సాయంగా ఆయ్ టీం నిలిచింది. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి ఉండే సామాజిక బాధ్యత నుంచి స్ఫూర్తి పొంది బన్నీ వాస్ అండ్ టీమ్ వరద బాధితులకు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా సోమవారం నుండి వారాంతానికి వచ్చే 'ఆయ్' కలెక్షన్లలో నిర్మాత వాటాలో 25% జనసేన పార్టీ ద్వారా వరద బాధితులకు అందజేస్తామని నిర్మాత బన్నీ వాస్, గీతా ఆర్ట్స్ సంస్థ ప్రకటించింది.

నార్నే నితిన్ హీరోగా వచ్చిన 'ఆయ్' చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.

కాలాముఖగా అర్పిత్ రంకా



అర్పిత్ రంకా

విష్ణు మంచు నటిస్తూ, నిర్మిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ఈ సినిమాలో కాలాముఖ పాత్రకు సంబంధించి అర్పిత్ రంకా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. గాంధార దేశం.. వాయు లింగం సొంతం చేసుకునే ధ్యేయం.. వేలాది మంది రక్తపాతాన్ని చూసే దాహం.. అడివిని, అడవి వీరుల్ని సైతం అంతం చేసే క్రూరత్వం అంటూ కాలాముఖ పాత్రకు ఇచ్చిన ఎలివేషన్, పోస్టర్ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. ఇప్పటికే టీజర్‌తో సినిమా మీద భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. డిసెంబర్‌లో ఈ సినిమా పాన్ ఇండియా వైడ్‌గా విడుదల కానుంది..

బిల్లా రంగ బాషా..



కిచ్చా సుదీప్

కిచ్చా సుదీప్, దర్శకుడు అనూప్ భండారి బ్లాక్ బస్టర్ 'విక్రాంత్ రోణ' తర్వాత మరో ప్రాజెక్ట్ కోసం కలిశారు. 'హనుమాన్'తో పాన్ ఇండియన్ బ్లాక్‌బస్టర్ అందుకున్న నిర్మాతలు కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై హై బడ్జెట్, భారీ కాన్వాస్‌పై ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.

కిచ్చా సుదీప్ పుట్టినరోజు సందర్భంగా ఫ్యూచర్‌లో జరగబోయే కథను పరిచయం చేసే కాన్సెప్ట్ వీడియోతో పాటు 'బిల్లా రంగ బాషా' అఫీషియల్ లోగోని మేకర్స్ రివీల్ చేశారు. యూనిక్ అప్రోచ్ సినిమాలు చేయడంలో అనూప్ భండారి దిట్ట.

ఈ వీడియో ప్రేక్షకులని మెస్మరైజ్ చేసింది. క్రీ.శ. 2209లో జరిగిన భవిష్యత్తు గురించి గ్లింప్స్‌ని అందిస్తోంది. ది స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ, ఈఫిల్ టవర్, తాజ్ మహల్ స్మాష్ అయినట్లుగా చూపిస్తూ, ఒక వ్యక్తి అన్నింటినీ జయించినట్లు ప్రజెంట్ చేయడం ఆసక్తికరంగా ఉంది. దీనికి మూడు వేర్వేరు ప్రాంతాలు, క్లైమట్స్ యాడ్ చేశారు. అనూప్ భండారీ ఎగ్జైటింగ్ డీటెయిల్స్‌తో విజువల్ ప్యాడ్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చారు.

డైరెక్టర్ అనూప్ భండారి మాట్లాడుతూ, "విక్రాంత్ రోణ' తర్వాత నిరంజన్ రెడ్డి నాతో కలిసి పనిచేయాలనుకున్నారు. మేము ఇంతకు ముందు 'హనుమాన్' పోస్ట్ ప్రొడక్షన్ సమయంలో కలుసుకున్నాం. నా నెక్ట్స్ చిత్రం కూడా కిచ్చా సుదీప్‌తోనే ఉంటుందని, 'బిల్లా రంగ బాషా' కథని, దాని వరల్డ్‌ని వివరించినప్పుడు ఆయన థ్రిల్ అయ్యారు. వారు తమ నెక్ట్స్ ప్రాజెక్ట్‌ను పెద్ద ఎత్తున నిర్మించాలని కోరుకున్నారు. దీనికి 'బిల్లా రంగ బాషా' పర్ఫెక్ట్' అని అన్నారు.

'కిచ్చా సుదీప్‌తో అనూప్ భండారి సినిమా చేస్తున్నారని మొదట విన్నప్పుడు చాలా ఎగ్జైట్ అయ్యాం. 'విక్రాంత్ రోనా' తెలుగులో విజయవంతమైంది. ఈ కొలాబరేషన్ ఇప్పటికే సంచలనం సృష్టించింది. 'బిల్లా రంగ బాషా' కథ విన్నప్పుడు, ఇది మేమే నిర్మించాలి అనే నమ్మకం కలిగింది' అని నిర్మాతలు తెలిపారు. అన్ని ప్రధాన భారతీయ భాషలలో ఈ సినిమా నిర్మాణమౌతుంది. అతి త్వరలో షూటింగ్ ప్రారంభం కానుంది.

ప్రయోగాత్మక కథతో మిస్టర్ సెలబ్రిటీ



సుదర్శన్ పరుచూరి హీరోగా 'మిస్టర్ సెలబ్రిటీ' అనే సినిమాను ఎన్. పాండురంగారావు, చిన్న రెడ్డయ్య సంయుక్తంగా ఆర్‌పి సినిమాస్ బ్యానర్ మీద నిర్మిస్తున్నారు. ఈ మూవీకి చందిన రవి కిషోర్ దర్శకత్వం వహిస్తున్నారు.

ఈ మూవీలో వరలక్ష్మీ శరత్ కుమార్, శ్రీ దీక్ష, నాజర్, రఘుబాబు తదితరులు ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. సోమవారం ఈ చిత్ర టీజర్ ఈవెంట్ లాంచ్ ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, 'నేను, మా తమ్ముడు కలిసి ఈ సినిమాను చూశాం. మా తమ్ముడు చాలా మంచి విమర్శకుడు. సుదర్శన్ బాగున్నాడని, సినిమా బాగుందని మెచ్చుకున్నారు. హీరోల కొడుకులు హీరోలు అవుతుంటారు. కానీ మా మనవడు హీరోగా ఎంట్రీ ఇస్తున్నాడు. సెలబ్రిటీల మీద బయట వచ్చే రూమర్లను బేస్ చేసుకుని ఈ కథను రాసుకున్న దర్శకుడు రవి కిషోర్ సినిమాను బాగా తీశారు. రఘు బాబు తెరపై అద్భుతంగా నవ్విస్తాడు. సాయి మాధవ్ బుర్రా చాలా మంచి రచయిత. ఆడియెన్స్ కనెక్ట్ అయ్యే సబ్జెక్ట్‌తో తీసిన ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి' అని అన్నారు.

'నేను హీరో అవుతానని చెప్పగానే మా తాతయ్య నాకు కొన్ని పరీక్షలు పెట్టారు. ఎవ్వరికీ నా గురించి చెప్పకుండా జూనియర్ ఆర్టిస్ట్‌గా పని చేశాను. సినిమా కష్టాలన్నీ దగ్గరగా చూశాను. ఈ కథ నన్ను వెతుక్కుంటూ వచ్చింది. ఆ విషయాన్ని మా తాతయ్యకి చెప్పాను. ఒళ్లు దగ్గర పెట్టుకుని నటించు అని చెప్పారు' అని పరుచూరి సుదర్శన్ చెప్పారు.

డైరెక్టర్ రవి కిషోర్ మాట్లాడుతూ,'ఈ కథ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఓ ప్రయోగాత్మక కథ. పరుచూరి వారికి స్క్రిప్ట్ చూపించాం. చిన్న చిన్న కరెక్షన్స్ చేశారు. ఈ మూవీకి క్లైమాక్స్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది' అని చెప్పారు.

'పరుచూరి వారి ఇంటి నుంచి హీరోని పరిచయం చేస్తుండటం ఆనందంగా ఉంది. ఈ జనరేషన్‌కు తగ్గ కంటెంట్‌తో సినిమాను తీశాం. ఈ మూవీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని చిన్న రెడ్డయ్య అన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886